
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 357
సోమవారం 18-3-2024


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'


16 ఏళ్ల జాతీయ రికార్డు బద్దలు
పురుషుల 10,000 మీటర్ల విభాగంలో భారత అథ్లెట్ గుల్‌వీర్ ఘనత - 12లో


ఇంటి పేరు మార్చుకుంటున్నారా?
అయితే ముందుచూపుతో వ్యవహరించాల్సిందే.. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


అక్కడ ఓట్ల లెక్కింపు తేదీ మార్పు
అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో జూన్ 4న జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును జూన్ 2కు మార్చినట్లు సీఈసీ పేర్కొంది.
- వివరాలు 6లో


బాండ్లతో బీజేపీకి 6,986.5 కోట్లు
ఎలక్టోరల్ బాండ్లతో అధికార బీజేపీకి అత్యధికంగా రూ.6,986.5 కోట్లు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలియజేసింది.
- వివరాలు 6లో


కేజ్రీవాల్‌కు సమన్లు పంపిన ఈడీ
ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ అధికారులు ఆదివారం 9వసారి కేజ్రీవాల్‌కు సమన్లు పంపారు.
- వివరాలు 6లో


అవి లేకుంటే మోదీ నెగ్గలేడు
ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా ఎన్నికల్లో నెగ్గడం మోదీ తరం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడు జగిత్యాలకు మోదీ




లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ జగిత్యాలకు రానున్నారు. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా గీతా విద్యాలయ మైదానంలో విజయ సంకల్పసభ పేరుతో నిర్వహించతలపెట్టిన సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.
- వివరాలు 2లో

అమ్మో 'రాజధాని' బస్సులు



రాజధాని బస్సులు చుక్కలు చూపుతున్నాయి. విరిగిన కుర్చీలు, సరిగ్గా పనిచేయని ఏసీ, క్లీనింగ్ అంతంతమాత్రమే కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికుల నుంచి ఆదరణ ఉన్నా, నిధుల్లేక కొత్త బస్సులను ఆర్టీసీ సమకూర్చుకోలేకపోతోంది.
- వివరాలు 14లో

రామోజీ కబ్జాలపై చర్యలేవీ?



రాష్ట్రంలో కొందరు కబ్జాదారులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తుందని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి రాగద్వేషాలకు పోకుండా కబ్జాదారులందరిపైనా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు కోరారు.
- వివరాలు 2లో

'నామినేటెడ్' ప్రాధాన్యత విధేయతకే!

- వివరాలు 5లో

నా రాజకీయం చూపిస్తా!

మీట్ ది మీడియా కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ప్రభుత్వాన్ని పడగొడుతుంటే చూస్తూ ఊరుకుంటమా?
- కుక్క కాటుకు చెప్పు దెబ్బ కొట్టకుండా ఉంటమా?
- అందుకే ఓ గేట్ ఓపెన్ చేసిన.. ఎన్నికల నగారా మోగింది కాబట్టి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా పని మొదలు పెట్టిన
- ఇక ఎన్నికల రూపం చూపిస్తా..
- వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించామన్న సీఎం
- వైబ్రెంట్ తెలంగాణ లక్ష్యమని వెల్లడి


మీట్ ది మీడియా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ మొదలుకొని కడియం శ్రీహరి వంటి వారి దాకా ఈ ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండదంటూ మాట్లాడుతున్నారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఎన్నికల తర్వాత ఆపరేషన్ మొదలుపెడతామని అంటున్నారు. ఇది దేనికి సంకేతం? వందరోజుల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా ఫిరాయింపుల జోలికి వెళ్లానా? కానీ ఈ రోజు వాళ్లిద్దరూ ఒకే లైన్‌లో మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారు. పడగొడుతుంటే చూస్తూ ఊరుకుంటమా? కుక్క కాటుకు చెప్పుదెబ్బ అంటారు. కొట్టకుంట ఊర్కుంటమా? కొడతం కదా.. అందుకే వందో రోజు మొదలుపెట్టిన. ఓ గేట్ ఓపెన్ చేసిన. ఈరోజు ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్యే వచ్చారు. ఎన్నికల నగారా మోగింది కాబట్టి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా కూడా పని మొదలు పెట్టిన. నిన్న కోడ్ రానంత వరకు ముఖ్యమంత్రిగా చాలా నిబద్ధతతో ప్రతిరోజూ 18 గంటలు ప్రజల కోసం పనిచేసిన. చిన్న తప్పిదానికి కూడా అవకాశం ఇవ్వకుండా పనిచేసిన. నిన్న 3 గంటలకు ఎన్నికల ప్రధానాధికారి నగారా ఊదిండు. ఇక ఎన్నికల రూపం చూపిస్తా. నా రాజకీయం ఏంటో చూపిస్తా..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్య మంత్రిగా 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని

మిగతా 2వ పేజీలో ▶

తన్నీరు.. నువ్వు పన్నీరు కాదు

'200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేస్తుంటే కొన్ని గంజాయి మొక్కలు మళ్లీ తమ పరిమళాలను వెదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఉచిత కరెంటుకు సబ్సిడీని ముందు చెల్లించిన తరువాతే వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేయాలని ఈఆర్సీ ఆదేశించింది. ఇంటి పేరులో తన్నీరు (తన్నీరు రంగారావు) ఉన్నంత మాత్రాన ఆయన పన్నీరు కాదు. ఈ గంజాయి మొక్కను కూడా పీకుతం. ఎక్కువ రోజులు ఆ కుర్చీలో ఉండవు. విద్యుత్ సరఫరా విషయంలో కొన్నిచోట్ల కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వందల కోట్లు కాదు, వేల కోట్లకు చేరింది. అవినీతిపై రాజ్యాంగబద్ధంగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం. బతుకమ్మను కొందరు ప్లాస్టిక్ బతుకమ్మను చేశారు. ఎవరు ఉన్నా లేకున్నా బతుకమ్మ, బోనాల పండుగలు ఘనంగా జరుగుతాయి. ప్రైవేట్ చేతిలో ఉన్న ధరణిని ప్రభుత్వ సంస్థకు అప్పగించాం. ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే తప్పు అవినీతి జరిగిందా లేదా అనే విషయం బయటపడదు. తప్పులకు కారణమైన వారిని ఉపేక్షించం..' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

జంపింగ్‌లు షురూ

- అధికార పార్టీలోకి ప్రారంభమైన చేరికలు
- కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం
- పార్టీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేయకుండానే కండువా మార్పు
- ఆపరేషన్ ఆకర్ష్ మరింత పదునెక్కే అవకాశం ఉందనే చర్చ - 2లో

వాట్సాప్ చాటింగ్‌లు, లావాదేవీలపై ఆరా!

- కస్టడీలో తొలిరోజున కవితకు ప్రశ్నలు సంధించిన ఈడీ
- ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన వారితో సంప్రదింపులపై ఆరా
- ఈడీ కార్యాలయంలో ఆరు గంటల పాటు విచారణ
- కవితను కలిసిన భర్త అనిల్, కేటీఆర్, హరీశ్‌రావు
- లాయర్ విక్రమ్ చౌదరితో కేటీఆర్, హరీశ్ ప్రత్యేక భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు తొలిరోజున ఆమెను సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగిందర్ సింగ్ నేతృత్వంలో ఆదివారం ఈ విచారణ కొనసాగినట్టు తెలిసింది. ఈ కేసులో ఇతర నిందితులతో వాట్సాప్ చాటింగ్‌లు, కొందరు మధ్యవర్తుల ద్వారా జరిగిన లావాదేవీలు, లిక్కర్ స్కామ్‌లో లబ్ధి పొందేందుకు ముడుపులు ఇచ్చారన్న ఆరోపణలపై ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. అలాగే ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన వారితో ఎలాంటి సంబంధాలు ఉన్నాయి? వారితో ఏమేం సంప్రదింపులు జరిపారన్న అంశాలపై ఆరా తీసినట్టు తెలిసింది. కేసులో అప్రూవర్లుగా మారినవారు ఇచ్చిన సమాచారాన్ని కవిత ముందుంచి.. దాని ఆధారంగా పలు ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం ఆరుగంటల వరకు సుదీర్ఘంగా కొనసాగిందని.. మధ్యలో విరామం పోగా ఆరు గంటల పాటు కవితను ప్రశ్నించారని తెలిసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ విచారణ మొత్తాన్ని ఈడీ అధికారులు వీడియో రికార్డు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

కవితను కలసిన కుటుంబ సభ్యులు

ఆదివారం సాయంత్రం 5.50 గంటల సమయంలో కవిత భర్త అనిల్‌కుమార్, కేటీఆర్, హరీశ్‌రావు, న్యాయవాది మోహిత్‌రావు తదితరులు ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల తర్వాత రాత్రి 7.50 గంటల సమయంలో బయటికి వచ్చారు. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లి పోయారు. అయితే కవితను కలసిన సందర్భంగా.. ఏమాత్రం అధైర్యపడొద్దని, న్యాయం జరుగుతుందని వారు భరోసా ఇచ్చారని.. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారని సమాచారం. ఇక లాయర్ మోహిత్‌రావు పలు న్యాయపరమైన అంశాలపై కవితకు సూచనలు

మిగతా 3వ పేజీలో ▶


నిర్మల్ జిల్లా పెంబి మండలం ధూమ్‌ధరి గ్రామపంచాయతీ పరిధిలోని చికమున్ వాగులో ఇసుకలో చెలిమె చేసి నీటిని బిందెల్లో నింపుకుంటున్న గిరిజన మహిళలు

గొంతెండుతోంది!

- రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల తాగునీటి సమస్య షురూ
- భూగర్భ జలాలు అడుగంటడంతో నీళ్లు రాని బోర్లు
- రెండు, మూడు రోజులకోసారి నల్లా నీటి సరఫరా.. పలుచోట్ల అదీ లేక ట్యాంకర్లతో అందజేస్తున్న తీరు
- ఎండాకాలం ప్రారంభంలోనే కమ్ముకుంటున్న తాగునీటి కటకట
- వచ్చే 2 నెలలు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన - 3లో

డబ్ల్యూపీఎల్ విజేత బెంగళూరు



ఐపీఎల్‌లో 16 ఏళ్లుగా సాకారం కాని టైటిల్ కలను మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఆర్‌సీబీ జట్టు రెండో ఏడాదే నిజం చేసుకుంది. స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు డబ్ల్యూపీఎల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను జట్టు ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది. విజేత బెంగళూరు జట్టుకు రూ. 6 కోట్లు ప్రైజ్‌మనీగా లభించాయి. ఫైనల్లో మొదట ఢిల్లీ 18.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. బెంగళూరు స్పిన్నర్లు సోఫీ మోలినెక్స్ (3/20), శ్రేయాంక (4/12), ఆశ శోభన (2/14) ఢిల్లీ జట్టును తిప్పేశారు. తర్వాత బెంగళూరు 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. - 12లో

బీజేపీకి దక్షిణాదిలో అనూహ్య ఫలితాలు

- పల్లె నుంచి పట్నందాకా మోదీ నాయకత్వానికి మద్దతు లభిస్తోంది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్


అరూరి రమేశ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాదిన బీజేపీకి అనూహ్య ఫలితాలు వస్తాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పల్లె నుంచి పట్నం వరకు అన్ని వర్గాల ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతుగా నిలిచారన్నారు. మోదీ పాలనపై అభిమానంతో ఇతరపార్టీల నేతలు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారని వివరించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక మిగతా 2వ పేజీలో ▶

ట్రిబ్యునల్ తుది తీర్పు తర్వాతే

- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా పరిశీలనపై కేంద్రం స్పష్టీకరణ
- కృష్ణా ట్రిబ్యునల్-2 గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే పరిశీలిస్తామని వెల్లడి
- ప్రాజెక్టు డీపీఆర్ మదింపు కూడా అప్పుడే నిర్వహిస్తామన్న జలశక్తి శాఖ



సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునః పంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 తుది తీర్పు ప్రకటించే వరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే అంశాన్ని పరిశీలించలేమని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలతో పాటు ఇతర కేటాయింపులను.. ఏపీ, తెలంగాణల మధ్య పునః పంపిణీ కోసం కృష్ణా ట్రిబ్యునల్-2కు అదనపు విధివిధానాలను (టీఓఆర్) జారీ చేస్తూ 2023 అక్టోబర్ 10న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. కృష్ణా ట్రిబ్యునల్-2 తుది తీర్పును అమల్లోకి తెస్తూ గెజిట్ విడుదలైన తర్వాతే పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. ఇది కృష్ణా జలాలపై ఆధారపడిన ప్రాజెక్టు కావడం, కృష్ణా జలాల కేటాయింపుల అంశం బ్రిజేష్‌కుమార్ పరిధిలో ఉండడమే దీనికి కారణమని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం జనవరి 4న సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶



ఇదండీ సంగతి



అన్ని ప్రయత్నాలు చేశాం సార్! చివరి ప్రయత్నంగా ఇలాంటివి ఫాలో అవడం బెటర్

ఏపీలో జగన్ పార్టీ, కాంగ్రెస్ ఒక్కటే

రెండు పార్టీలనూ ఒకే కుటుంబ సభ్యులు నడుపుతున్నారు..

ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎన్డీఏకి పడకుండా ఇద్దరూ కుమ్మక్కయ్యారు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడింది
- రాష్ట్రంలో మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారు
- 400కు పైగా సీట్లతో ఎన్డీఏను గెలిపించండి.. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి
- ఎన్డీఏని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధికి పునాది వేస్తాం
- మహిళలు, యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తాం
- దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తుంది
- స్వార్థ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి
- చిలకలూరిపేట శివారు బొప్పూడి ఎన్డీఏ సభలో ప్రధాని మోదీ


సభలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి మోదీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదని, ఒకటే అని, రెండు పార్టీలను ఒకే కుటుంబ సభ్యులు నడుపుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎన్డీఏ కూటమికి పడకుండా ఇద్దరూ కుమ్మక్కయ్యారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు మళ్లించాలని చూస్తున్నారని చెప్పారు. ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట శివారు బొప్పూడి గ్రామంలో జరిగిన ప్రజాగళం సభలో మోదీ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రులు ఒకరిని మించి మరొకరు అవినీతి చేయడానికి పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఢిల్లీలో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని

మిగతా 5వ పేజీలో ▶

జయహో 'బీసీ'

అసెంబ్లీ, లోక్‌సభ కలిపి 59 స్థానాలను ఆ వర్గాలకు కేటాయించిన ఏపీ సీఎం వైఎస్ జగన్

- గత ఎన్నికల కంటే ఇప్పుడు 11 స్థానాలు అధికం.. దేశ చరిత్రలో బీసీలకు ఈ స్థాయిలో సీట్లు కేటాయించిన దాఖలాలు లేవంటున్న సామాజికవేత్తలు
- గత 58 నెలల పాలనలో వారిని సమాజానికి వెన్నెముకగా తీర్చిదిద్దిన సీఎం
- 2019, ఫిబ్రవరి 17న ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన దానికంటే ఆ వర్గాలకు అధికంగా న్యాయం
- మంత్రివర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సమున్నత స్థానం
- ఇలా చెప్పిన దానికంటే అధికంగా న్యాయం చేసిన జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్న బీసీలు.. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభల్లో అది తేటతెల్లం



సాక్షి, అమరావతి : ఏపీలో గత 58 నెలలుగా సమాజానికి వెన్నెముకగా బీసీలను తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారికి 48 శాసనసభ, 11 లోక్‌సభ స్థానాలు వెరసి మొత్తం 59 స్థానాలు కేటాయించి వారికి పెద్దపీట వేశారు. తద్వారా తన భవిష్యత్తు ప్రణాళికను కూడా ఆయన సుస్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 294 శాసనసభ, 48 లోక్‌సభ స్థానాలు ఉన్నప్పుడు కూడా ఈ స్థాయిలో బీసీలకు ఎవరూ అవకాశం ఇచ్చిన దాఖలాల్లేవు. ఉత్తరప్రదేశ్‌లో బీసీ నేత అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూడా సీఎం జగన్ ఇచ్చిన రీతిలో బీసీలకు అవకాశం ఇవ్వలేదని.. దేశ చరిత్రలో ఇదో రికార్డు అని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. నిజానికి.. రాష్ట్ర విభజనకు ముందు 2012, జూలై 9న ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీనీ ఆయన అధికారంలోకి వచ్చాక అమలుచేయకుండా తమను వంచించారని బీసీలు

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య.. గంటన్నర ఆలస్యం

విమానంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

శంషాబాద్‌: హైదరాబాద్‌ నుంచి ముంబైకి వెళ్లాల్సిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో గంటన్నర ఆలస్యంగా బయల్దేరింది. ఆదివారం ఇండిగో విమానం 6ఈ–5099 విమానం 2.38 గంటలకు శంషాబాద్‌ విమానాశ్రయం నుంచి టేకాఫ్‌ తీసుకునే సమయంలో విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో నిలిపివేశారు. సమస్య పరిష్కరించిన అనంతరం విమానం 4.05 గంటలకు ఇక్కడి నుంచి టేకాఫ్‌ తీసుకుని ముంబై బయల్దేరింది. విమానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌ దీపాదాస్‌ మున్షీ తదితరులున్నారు.

ఫిరాయింపులపై రేవంత్ మాటలేమయ్యాయి?



సాక్షి, హైదరాబాద్‌: పార్టీ ఫిరాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు శోచనీయమని బీఆర్‌ఎస్‌ నేత దాసోజు శ్రవణ్‌ ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలు మారితే రాళ్లతో కొట్టాలన్న రేవంత్‌.. ఇపుడు ఇతర పార్టీల నుంచి గెలిచిన ప్రజా ప్రతినిధులను తన పార్టీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. గతంలో చట్టబద్ధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల ఇంటి ముందర చావుడప్పు కొట్టిన రేవంత్‌.. ఇప్పుడిలా చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. పార్టీ మారిన వారిపై అనర్హత పిటిషన్‌ వేయనున్నట్లు స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌ను వదిలినప్పుడు బీసీలకు ఆ పార్టీలో ప్రాధాన్యం లేదని ఆరోపించిన దానం నాగేందర్‌.. ఇప్పుడే ముఖంతో అదే పార్టీలో చేరారని శ్రవణ్‌ ప్రశ్నించారు.

అభద్రతాభావంలో రేవంత్



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి అభద్రతా భావం ఎందుకో అర్థం కావడం లేదని బీజేపీ సీనియర్‌ నేత, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ వ్యాఖ్యానించారు. ఆదివారం ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల తర్వాత తెలంగాణ డబుల్‌ ఇంజన్‌ సర్కారు ఏర్పాటు కావడం ఖాయమన్నారు. ఎన్నికల ప్రక్రియ ద్వారానే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని లక్ష్మణ్‌ స్పష్టం చేశారు.


దానంపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు విఫలయత్నం

బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలకు అందుబాటులోకి రాని స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌

సాక్షి, హైదరాబాద్‌: ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్‌ సమర్పించేందుకు ఆదివారం బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు చేసిన ప్రయత్నం విఫలమైంది. వివరాల్లోకి వెళితే... బీఆర్‌ఎస్‌ నుంచి గెలిచిన ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి గాంధీభవన్‌లో కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్‌ అధిష్టానం ఆదేశాల మేరకు సాయంత్రం ఆరు గంటలకు స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ను కలిసేందుకు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు అపాయింట్‌మెంట్‌ తీసున్నారు. పాడి కౌశిక్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్‌, కాలేరు వెంకటేశ్‌, ముఠా గోపాల్‌ స్పీకర్‌ నివాసానికి వెళ్లారు. అయితే ఆరు గంటల నుంచి స్పీకర్‌ నివాసం వద్ద వేచి చూసినా ఎమ్మెల్యేలకు నిరాశే ఎదురైంది. స్పీకర్‌కు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు ఫోన్‌ చేసినా స్పందన లేకపోవడంతో రెండున్నర గంటలు స్పీకర్‌ నివాసం వద్దే నిరీక్షించి ఎమ్మెల్యేలు వెనుదిరిగారు. కాగా స్పీకర్‌ అపాయింట్‌మెంట్‌ యిచ్చి తమను కలవకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం మరోసారి స్పీకర్‌కు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్‌ సమర్పించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

త్వరలో బీఆర్‌ఎస్‌ను మూసివేయడం తథ్యం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



శంషాబాద్‌: త్వరలో బీఆర్‌ఎస్‌ను మూసివేయడం తథ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. అహంకారంతో విర్రవీగిన బీఆర్‌ఎస్‌ వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కనీసం అభ్యర్థులు కూడా లేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందన్నారు. సీపీఐ కార్యకర్తల రెండురోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలనలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ సమయం వెచ్చించారన్నారు. కేసీఆర్‌ రాజులా...ఆయన కుమారుడు కేటీఆర్‌ యువరాజులా నేల మీద నిలబడలేదని విమర్శించారు. ఒడిదుడుకులు సీపీఐకి కొత్తకాదని, కమ్యూనిస్టులకు సీట్లు ముఖ్యం కాదని చెప్పారు. కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

జంపింగ్‌లు షురూ

అధికార పార్టీలోకి ప్రారంభమైన చేరికలు | **కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్న బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌** | **పార్టీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేయకుండానే కండువా మార్పు**

ఆపరేషన్‌ ఆకర్ష్‌ మరింత పదునెక్కే అవకాశం ఉందనే చర్చ

- ఆసక్తి రేకెత్తిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- 26 మంది టచ్‌లో ఉన్నారంటున్న కాంగ్రెస్‌ వర్గాలు
- ఇప్పటికే ఇద్దరు సిట్టింగ్‌ ఎంపీలు చేరిక... తాజాగా మరో ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా..



సీఎం రేవంత్‌, దీపాదాస్‌ మున్షీ సమక్షంలో పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డి, దానం నాగేందర్‌ చిత్రంలో షబ్బీర్‌ అలీ తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగిన మరుసటి రోజే రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడవకుండానే ఎమ్మెల్యేలు పార్టీ మారడం ప్రారంభమైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్‌ నుంచి బీఆర్‌ఎస్‌ పక్షాన గెలిచిన మాజీ మంత్రి దానం నాగేందర్‌ ఆదివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌ పార్టీకి గానీ, శాసనసభ్యత్వానికి గానీ రాజీనామా చేయకుండానే ఆయన కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకోవడం, ఇక నుంచి తన రాజకీయం ఏంటో చూపిస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యింది. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వక భేటీ పేరిట కలిసినప్పటికీ ఇప్పటివరకు ఎవరూ పార్టీ మారలేదు. కానీ గ్రేటర్‌ హైదరాబాద్‌లో ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్‌ పార్టీలోకి, నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే రావడంతో రాజకీయం రసకందాయంలో పడిందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏ క్షణమైనా, ఏమైనా జరగవచ్చనే ఆలోచనతోనే ఎమ్మెల్యేలను అధికారికంగా పార్టీలో చేర్చుకోవడాన్ని కాంగ్రెస్‌ పార్టీ ప్రారంభించిందని, ఆపరేషన్‌ ఆకర్ష్‌కు ఇక మరింత పదును పెట్టే క్రమంలో గేమ్‌ స్టార్ట్‌ చేసిందని చెబుతున్నారు.

టచ్‌లో 26 మంది?

ఇటీవల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పక్షాన మొత్తం 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా, కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆ సంఖ్య 38 అయ్యింది. అయితే వీరిలో మూడింట రెండొంతుల మంది అంటే 26 మంది కాంగ్రెస్‌ పార్టీతో టచ్‌లో ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మెదక్‌ జిల్లాకు చెందిన నలుగురు, రంగారెడ్డి నుంచి ఇద్దరు, మేడ్చల్‌ నుంచి ఇద్దరు, కొత్తగూడెం జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరతారా లేక మర్యాదపూర్వకంగానే కలిశారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వస్తే తాము అండగా నిలుస్తామని తనను కలిసిన బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పడం ఆసక్తి రేకెత్తిస్తోంది. మరోవైపు ఈ రోజే గేట్లు తెరిచానని, అవతలివైపు ఎంతమంది ఉంటారో తనకు తెలియదంటూ రేవంత్‌ చేసిన వ్యాఖ్యలు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠకు తావిస్తున్నాయి.

నాటి బీఆర్‌ఎస్‌ తరహాలోనే!

ఓటుకు కోట్లు వ్యవహారం తర్వాత అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ అప్రమత్తమై భవిష్యత్తులో ప్రభుత్వానికి ప్రమాదం లేకుండా ఉండేందుకు అనే కారణం చూపుతూ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. అయితే అప్పటి నుంచీ ఈ వ్యవహారాన్ని ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌ పార్టీ తప్పుపడుతూనే ఉంది. ఒక పార్టీలో గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా గతంలో పలుమార్లు నిలదీశారు. పార్టీ మారిన వారిని ఉరి తీయాలంటూ ఘాటైన వ్యాఖ్యలు కూడా చేశారు. కానీ ఇప్పుడు ఆయనే స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వంలో కీలక హోదాలో ఉన్న ఓ నాయకుడు మాట్లాడుతూ 'నాడు కేసీఆర్‌ సూత్రాన్నే మేం పాటిస్తున్నాం. మా కోట గోడలను పదిలం చేసుకుంటున్నాం. బలంగా చుట్టూ కంచె వేసుకుంటున్నాం. పార్లమెంటు ఎన్నికల తర్వాత డబుల్‌ ఇంజన్‌ సర్కారు వస్తుందని కొందరు, మూడు నెలల తర్వాత ప్రభుత్వం ఉంటుందో ఉండదో అని మరికొందరు చేస్తున్న వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఏంటో అందరికీ తెలిసిందే. అటు బీజేపీ, ఇటు బీఆర్‌ఎస్‌లకు ఫిరాయింపుల రాజకీయం అలవాటే. మా జాగ్రత్తలో మేం ఉండకపోతే తప్పు చేసిన వాళ్లమవుతాం. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి దూకుడు రాజకీయం చేస్తున్నారు. వాళ్ల శాసనసభాపక్షం మా పార్టీలో విలీనం అవుతుందేమో?' అని వ్యాఖ్యానించడం గమనార్హం.

సీఎం, మున్షీ సమక్షంలో చేరికలు

బీఆర్‌ఎస్‌కు చెందిన ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌, చేవెళ్ల సిట్టింగ్‌ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జ్‌ దీపాదాస్‌ మున్షీల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌, ఖైరతాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వరంగల్‌ ఎంపీ పసునూరి దయాకర్‌, పెద్దపల్లి ఎంపీ నేతకాని వెంకటేశ్‌లు కాంగ్రెస్‌ పార్టీలో చేరిన నేపథ్యంలో, రంజిత్‌రెడ్డితో కలిసి మొత్తం ముగ్గురు బీఆర్‌ఎస్‌ సిట్టింగ్‌ ఎంపీలు కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నట్టయింది.

కేసీఆర్‌, కేటీఆర్‌కు కృతజ్ఞతలు: రంజిత్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌కు రంజిత్‌రెడ్డి తన రాజీనామా లేఖను పంపారు. కాగా ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తాను బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు రంజిత్‌రెడ్డి 'ఎక్స్‌'లో తెలిపారు. ఇన్ని రోజులు చేవెళ్ల ఎంపీగా తనకు సేవలు చేసే అవకాశం కల్పించిన ప్రజలకు, కేసీఆర్‌, కేటీఆర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కేసీఆర్‌ను కోరారు.

నేడు జగిత్యాలకు ప్రధాని మోదీ

సభకు పొంచి ఉన్న వర్షం గండం



సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ జగిత్యాలకు రానున్నారు. నిజామాబాద్‌, కరీంనగర్‌, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా సోమవారం జగిత్యాలలోని గీతా విద్యాలయ మైదానంలో విజయ సంకల్పసభ పేరుతో నిర్వహించతలపెట్టిన సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రతా ఏర్పాట్లను నేషనల్‌ సెక్యూరిటీ గార్డ్స్‌ (ఎన్‌ఎస్‌జీ)తోపాటు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. సభ బందోబస్తుకు 1,600 మందికిపైగా పోలీసులను మోహరించారు. ఇప్పటికే హెలికాప్టర్ల ల్యాండింగ్‌ ట్రయల్స్‌, కాన్వాయ్‌ ట్రయల్స్‌ విజయవంతంగా నిర్వహించారు. మైదాన పరిసరాలను పూర్తిగా ఎన్‌ఎస్‌జీ బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడం, పీఎఫ్‌ఐ, ఐఎస్‌ఐ తదితర ఉగ్రవాద సానుభూతిపరులకు పట్టున్న ప్రాంతం కావడంతో కేంద్ర, రాష్ట్ర అధికారులు భద్రత విషయంలో ఎక్కడా రాజీపడటం లేదు. అయితే జగిత్యాల విజయసంకల్ప సభకు వర్షం గండం పొంచి ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, 30–40 కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ(ఐఎండీ) ఆదివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వర్షం, ఈదురుగాలుల హెచ్చరిక నేపథ్యంలో అధికారులు హెలికాప్టర్‌ ల్యాండింగ్‌, కాన్వాయ్‌ మూమెంట్‌ విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యామ్నాయాలు సిద్ధం చేశారు.

గ్యారంటీల అమలుకు 'డిజిటల్ క్యాంపెయిన్'

పథకాల అమలులో కాంగ్రెస్‌ చేతులెత్తేసింది: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ ఇప్పుడు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాల్సిందేనని, ఈ దిశగా ఒత్తిడి చేసేందుకు బీజేపీ రాష్ట్ర పార్టీ డిజిటల్‌ క్యాంపెయిన్‌ మొదలు పెట్టిందన్నారు. ఆదివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ప్రశ్నిస్తున్న తెలంగాణ పోస్టర్‌, వెబ్‌సైట్‌ను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అహంకారం, నియంతృత్వం, నిరంకుశత్వంతో కేసీఆర్‌ ఓడిపోయినా తెలంగాణ ప్రజలు మాత్రం గెలవలేదన్నారు. అనేక తప్పుడు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ.. పథకాల అమలులో చేతులెత్తేసిందని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతులకు, కౌలు రైతులకు ప్రతి ఏటా రూ.15 వేలు ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనేక రకాల గ్యారంటీలంటూ మభ్యపెట్టి ప్రజలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ ఎక్కడున్నా 'రజాకార్' చూడాలి

సినిమా చూశాక కూడా నిజాం గొప్పోడని అనిపిస్తే ట్వీట్‌ చేయొచ్చు: బండి



కరీంనగర్‌ టౌన్‌: నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు పడ్డ బాధలు, గోసను కళ్లకు కట్టినట్లు చూపిన సినిమా 'రజాకార్‌'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌ కుమార్‌ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని మమత థియేటర్‌లో రజాకార్‌ చిత్ర యూనిట్‌, బీజేపీ కార్యకర్తలతో కలిసి సినిమా చూసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియంత నిజాం, రజాకార్ల రాక్షస పాలనపై తెలంగాణ ప్రజలు చేసిన పోరాటాల చరిత్రను అద్భుతంగా తెరపై చూపించారని కొనియాడారు. ఈ వాస్తవాలను నేటి తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సినిమాను ప్రజలకు అందించిన దర్శక, నిర్మాతలు యాట సత్యనారాయణ, గూడూరు నారాయణరెడ్డిని అభినందించారు. కేసీఆర్‌ ఎక్కడున్నా రజాకార్‌ సినిమా చూడాలన్నారు. ఆ సినిమా చూసిన తర్వాత కూడా నిజాం గొప్పోడు, రజాకార్లు మంచోళ్లని అనిపిస్తే నిరభ్యంతరంగా కేసీఆర్‌ 'ట్వీట్‌'చేయొచ్చు అని సూచించారు. అవసరమైతే ఆనాడు నిజాం సమాధి ఎదుట మోకరిల్లిన కేసీఆర్‌ ఫొటోను కూడా ఈ సినిమా చూసిన తర్వాత ట్వీట్‌ చేయవచ్చని పేర్కొన్నారు.

బీజేపీకి దక్షిణాదిలో అనూహ్య ఫలితాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా 370 సీట్లు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిసి 400కు పైగా సీట్లను గెలుచుకుంటుంద న్నారు. గత పదేళ్లలో అవినీతికి తావులేకుండా సమ గ్రాభివృద్ధి, పేదలు, అణగారిన వర్గాలు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు సంక్షేమానికి ప్రజలు ఆకర్షితులయ్యారని, అందుకే 'మేమంతా మోదీ కుటుంబం'అని గర్వంగా చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పనైపోయిందని, పదేళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడటంతోపాటు నిరంకుశ, నియంతృత్వ పాలనతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కల్వకుంట్ల కుటుంబ రాజకీయాలను ప్రజలు ద్వేషించారని చెప్పారు. కేసీఆర్‌ కూతురు కవితను మనీలాండరింగ్‌ కేసులో అధికారులు అరెస్టు చేయడం పూర్తిగా ఈడీ దర్యాప్తులో లభించిన ఆధారాలు, ఆమె దగ్గర, ఆమెతో కలిసి పనిచేస్తున్న వారు ఇచ్చిన వాంగ్మూలాల కారణంగానే కోర్టులో హాజరు పరిచారని తెలిపారు. బీజేపీకి, ఈడీకి సంబంధం లేదని, తప్పుచేసింది ఎంతవారైనా చట్టబద్ధంగా చర్యలు తప్పవన్నారు. 'తెలంగాణ ప్రజలకు మేలు చేసేందుకు కవిత లిక్కర్‌ కుంభకోణంలో దూరారా? దీని వల్ల తెలంగాణ ప్రజలకు ఏమైనా లాభం జరిగిందా?'అని కిషన్‌ రెడ్డి ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో అక్కడ పర్యటిస్తున్నప్పుడు ఒక ఊళ్లో 16 బెల్టు దుకాణాలు ఉన్న విషయం చూసి ఆశ్చర్యపోయానని, తెలంగాణలో బెల్టు షాపులను ప్రోత్సహించి ప్రజల రక్తం తాగిన కల్వకుంట్ల కుటుంబసభ్యుల బాటలోనే.. ఇవాళ్టి కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండేటి శ్రీధర్‌, నేతలు జైపాల్‌, పొన్నాల శ్రీరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు కబ్జాలపై చర్యలేవీ?

కబ్జాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రాగద్వేషాలకు పోవద్దు: మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

- కేవలం కొందరిపైనే చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి అప్రతిష్ట
- బొమ్మరాసిపేటలో భూకుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి
- అక్కడ 920 ఎకరాల భూకబ్జా వెనుక మాజీ మంత్రుల హస్తం ఉందని ఆరోపణ



హిమాయత్‌నగర్‌ (హైదరాబాద్‌): రాష్ట్రంలో కొందరు కబ్జాదారులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తుందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి రాగద్వేషాలకు పోకుండా కబ్జాదారులందరిపైనా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు కోరారు. రేవంత్‌ సర్కారు హెచ్‌ఎండీఏ పరిధిలోని భూముల కబ్జాదారులపై చర్యలు చేపట్టడాన్ని అభినందిస్తున్నట్టు చెప్పారు. ఫిలింసిటీ పేరుతో ప్రభుత్వ రోడ్డును, పేదల భూములను ఆక్రమించిన రామోజీరావుపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేటలోని 920 ఎకరాల భూకబ్జాపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ఈ భూకబ్జా వెనుక మాజీ మంత్రుల హస్తం ఉందని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో గోనె ప్రకాశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి కమిటీ ద్వారా వాస్తవాలను తేల్చి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ మంత్రుల సహకారంతో భూకబ్జా..

బొమ్మరాసిపేట గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 323 నుంచి 409 వరకు 1,049 ఎకరాల భూమి ఉందని.. అందులో కొందరు రైతు సంఘం ముసుగులో 920 ఎకరాల భూమిని కబ్జా చేశారని గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. 1965లో మీర్‌ రెహమత్‌ అలీతోపాటు మరో ఆరుగురి నుంచి మాజీ ఎంపీ దుగ్గిరాల బలరామకృష్ణ ఈ భూమిని కొనుగోలు చేశారని.. ఆయన వారసులైన దుగ్గిరాల అమరేందర్‌బాబుతోపాటు మరో 20 మంది పేరిట ఆ భూమి రిజిస్టర్‌ అయిందని తెలిపారు. ఈ భూమి హక్కుదారులు విదేశాలలో స్థిరపడటంతో కొందరు దానిపై కన్నేశారని.. నకిలీ పత్రాలను సృష్టించి మాజీ మంత్రుల సహకారంతో కబ్జాకు పాల్పడ్డారన్నారు. రైతు సంఘం నేతలు ధర్నాలు చేస్తూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ కూడా భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. ఈ భూముల విషయంలో కోర్టు ఆదేశాలను అమలు చేయాలని.. జిల్లా కలెక్టర్‌ ద్వారా పూర్తి వివరాలు సేకరించి, అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై త్వరలో సీఎం రేవంత్‌ను కలుస్తానని చెప్పారు.

నా రాజకీయం చూపిస్తా!



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌. చిత్రంలో మీడియా అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి జూపల్లి

ఆరు గ్యారంటీలతో సంక్షేమ పాలన

'వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించాం. మేము పాలకులం కాదు.. సేవకులం అని తెలిపేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. 6 గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. ఉద్యమ సమయంలో వాహనాలపై రాసుకున్న 'టీజీ'ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. తెలంగాణ తల్లి, ప్రభుత్వ చిహ్నాల్లో రాజ దర్పాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నాం. సచివాలయంలోకి అందరికీ ప్రవేశం కల్పించాం. 2004 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మేము ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని 26 కోట్ల మంది వినియోగించుకున్నారు. ఇప్పటివరకు 8 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్‌ సిలిండర్‌ అందించాం. వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని వ్యాధులను చేర్చడమే కాకుండా పరిమితి రూ.10 లక్షలకు పెంచాం. 32 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల వరకు ఉచిత్‌ విద్యుత్‌ పథకాన్ని అందుకున్నాయి..' అని సీఎం వివరించారు.

▶ మొదటి పేజీ తరువాయి

సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన 'మీట్‌ ది మీడియా' కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. వందరోజుల్లో అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం విలేకరుల ప్రశ్నలకు సీఎం సమాధానమిచ్చారు.

నిజాం నకలునే కేసీఆర్‌ చూపించారు

'వారసత్వాన్ని తమపై రుద్దాలని చూసినప్పుడు తెలంగాణ సమాజం ఏకమైంది. ప్రజలు దానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. కేసీఆర్‌ కుటుంబాన్ని అధికారం నుంచి దించారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు నమ్మకం లేదు. ఏనాడూ ప్రజల స్వేచ్ఛను గౌరవించ లేదు. నిజాం నకలునే కేసీఆర్‌ చూపించారు. ఖాసిం రజ్వీ ద్వారా నిజాం తన ఆధిపత్యం, అధికారంపై తిరుగుబాటు చేసిన వారిని అణిచివేసే ప్రయత్నం చేసినట్లు, ప్రభాకర్‌రావు ద్వారా కేసీఆర్‌ చేశారు. ప్రజల స్వేచ్ఛను హరించాలని భావించారు. అందుకే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. 2023 డిసెంబర్‌ 3న స్వేచ్ఛను తెచ్చుకున్నారు. 1948 సెప్టెంబర్‌ 17న ఎలాగో అలాగే స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు..' అని రేవంత్‌ అన్నారు.

కేంద్రం, గవర్నర్‌తో సామరస్యంగా ముందుకు

'కేంద్ర ప్రభుత్వంతో, గవర్నర్‌ తమిళిసైతో సామరస్యంగా ముందుకెళ్తున్నాం. వైబ్రంట్‌ తెలంగాణ మా లక్ష్యం. తెలంగాణ విజన్‌ – 2050 ద్వారా ముందుకు వెళ్తున్నాం. మా ప్రభు త్వం పదేళ్ల అధికారంలో ఉండడం ఖాయం. ఆశీర్వదిస్తే మరో పదేళ్లు ఉంటాం. కానీ అభివృద్ధిని 20 50 లక్ష్యంగా ప్లాన్‌ చేస్తున్నాం..' అని రేవంత్‌ తెలిపారు.

సామాజిక న్యాయానికి మారు పేరుగా

'వందరోజుల్లో సామాజిక న్యాయానికి మారుపేరుగా పాలన సాగించాం. నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, నలుగురు ప్రభుత్వ విప్‌లను నియమిస్తే అన్ని వర్గాలకు అవకాశం కల్పించాం. మంత్రుల్లో కూడా అన్ని వర్గాల వాళ్లు ఉన్నారు. త్వరలోనే సమాచార హక్కు కమిషనర్లను నియమిస్తా. గతంలో ఫోన్‌ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై మేం చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ సామాజిక స్పృహ కలిగిన మంచి మిత్రుడు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ పదవి ఆయనకే ఇద్దామనుకుంటే తిరస్కరించారు. బీఆర్‌ఎస్‌తో కలిసేంత తప్పు చేయరు. కలిస్తే ఆయనే సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది.

అనర్హులకు రైతుభరోసా ఇవ్వం

రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల లోపు 62 లక్షల రైతులకు అందించాం. రైతుభరోసాను పకడ్బందీగా అమలు చేస్తాం. కొండలు, గుట్టలు, రోడ్లకు, కోటీశ్వరులకు, అనర్హులకు ఇవ్వం. అధికారులపై వ్యక్తిగత కక్ష సాధింపులు ఉండవు. హైదరాబాద్‌లోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మీడియా అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి జర్నలిస్టులందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కార నిర్ణయంతో వస్తే సంతకం చేస్తా'అని రేవంత్‌ చెప్పారు. టీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి విరాహత్‌ అలీ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

మెదక్ బరిలో జయరాంరెడ్డి

కాంగ్రెస్‌ టికెట్‌ రేసులో కొత్తపేరు

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభకు పోటీ చేసే కాంగ్రెస్‌ అభ్యర్థుల జాబితా మంగళవారం వెలువడుతుందని భావిస్తుండగా, మెదక్‌ స్థానం నుంచి కొత్త పేరు తెరపైకి వచ్చింది. సిద్దిపేట మండలం మందపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఐలేని జయరాంరెడ్డి ఇక్కడి ఉంచి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీసీ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌లలో ఒకరికి టికెట్‌ వస్తుందని అందరూ భావిస్తుండగా, ఐలేని అభ్యర్థిత్వంపై గాంధీభవన్‌ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. పేలుడు పదార్థాలు (ఎక్స్‌ప్లోజివ్స్‌), హాస్పిటల్‌, ఫార్మా రంగాల్లో గుర్తింపు పొందిన జయరాంరెడ్డిని నిలపడం ద్వారా బీఆర్‌ఎస్‌, బీజేపీలను దీటుగాఎదుర్కోవచ్చనే ఆలోచనతోనే ఆయన పేరును కూడా పార్టీ పరిశీలిస్తోందని, జయరాంరెడ్డి కూడా ఢిల్లీ స్థాయిలో టికెట్‌ కోసం లాబీయింగ్‌ చేస్తున్నారని సమాచారం.

ట్రిబ్యునల్ తుది తీర్పు తర్వాతే

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్‌ షెకావత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై తీసుకున్న చర్యలను సమాచార హక్కు చట్టం కింద జర్నలిస్టు ఇనగంటి రవికుమార్‌కు కేంద్ర జలశక్తి శాఖ తెలియజేసింది.

తీర్పు తర్వాతే డీపీఆర్‌ మదింపు

ప్రాజెక్టు సాంకేతిక ఆర్థిక మదింపు (టెక్నో ఎకనామికల్‌ అప్రైజల్‌) కోసం 2022 సెప్టెంబర్‌ 13న రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలనలో ఉందని జలశక్తి శాఖ తెలిపింది. దీనిపై ట్రిబ్యునల్‌ తుది తీర్పు వచ్చిన తర్వాతే డీపీఆర్‌ మదింపు నిర్వహిస్తామని పేర్కొంది. ప్రధాన్‌ మంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)– సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం(ఐఏబీపీ) కింద సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించేందుకు మార్గదర్శకాలున్నాయని వివరించింది.

45 టీఎంసీలపై చిక్కుముడి

పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే, దానికి ప్రతిగా నాగార్జునసాగర్‌ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి గతంలో బచావత్‌ ట్రిబ్యునల్‌ వెసులుబాటు కల్పించింది. ఈ నీటిని కూడా రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని కేంద్రం విధివిధానాల్లో స్పష్టం చేసింది. ఈ క్రమంలో 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను వాడుకోవడానికి ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలు ప్రాజెక్టులను నిర్మిస్తున్నాయి. మిగిలిన 45 టీఎంసీలను కృష్ణా ట్రిబ్యునల్‌–2 కొత్తగా రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉంది. నాగార్జునసాగర్‌ ఎగువన ఏపీలో కృష్ణా బేసిన్‌కు చెందిన ఆయకట్టులేనందున ఈ 45 టీఎంసీలు తమవేనని తెలంగాణ వాదిస్తోంది. ఈ 45 టీఎంసీలకు తోడు మైనర్‌ ఇరిగేషన్‌లో వాడుకోని 45 టీఎంసీలు కలిపి 90 టీఎంసీల కృష్ణా జలాలను తరలించడానికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టింది. దీనిపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో కృష్ణా ట్రిబ్యునల్‌–2 తుది తీర్పు వచ్చిన తర్వాతే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదాతో పాటు డీపీఆర్‌కు అనుమతులు జారీ చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

ట్రిబ్యునల్‌ తీర్పు వచ్చేది ఎప్పుడు?

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్మాణం పూర్తైన ప్రాజెక్టులతోపాటు నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకు సైతం ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కృష్ణా ట్రిబ్యునల్‌–2కు కేంద్రం ఆదేశించింది. దీంతో తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి, డిండి, ఎస్‌ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టులకు కూడా ట్రిబ్యునల్‌ నీటి కేటాయింపులు జరిపే అవకాశం ఉందని రాష్ట్రం భావిస్తోంది. అయితే ట్రిబ్యునల్‌ తీర్పు వచ్చేందుకు ఎన్నేళ్లు పడుతుందో తెలీని పరిస్థితి ఉంది. కాగా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 9ఏళ్ల జాప్యం తర్వాత ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించడం వల్ల తెలంగాణకు తీరని నష్టం జరిగిందని ఆర్టీఐ కార్యకర్త ఇనగంటి రవికుమార్‌ విమర్శించారు.

గొంతెండుతోంది!

రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల తాగునీటి సమస్య

వేసవికాలం మొదలైంది. కొన్నిరోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. చెరువులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావులు కూడా బోసిపోతుయి. దీనితో గ్రామాల్లో నీటికి కటకట మొదలైంది. ఎండాకాలం ప్రారంభంలోనే నల్లాల ద్వారా మంచినీటి సరఫరా తగ్గిపోయింది. ఊర్లలో నీటి ట్యాంకర్ల హడావుడి మొదలైంది. గ్రామాల్లో పంచాయతీలు, వార్డుల వారీగా ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది. పట్టణాల్లో అయితే ప్రైవేటు ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుని వాడుకోవాల్సిన దుస్థితి మొదలైంది. మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ గ్రామాల్లో అయితే పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. కిలోమీటర్ల కొద్దీ నడిచి వాగుల వద్దకు వెళ్లి చెలిమల నుంచి నీటిని మోసుకురావాల్సి వస్తోంది. మైదాన ప్రాంత గ్రామాల్లోనూ పలుచోట్ల నీటికి ఎద్దడి ఏర్పడటంతో శివార్లలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే రెండు నెలల పాటు ఎలా వెళ్లదీయాల్సి వస్తుందోనని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- సాక్షి నెట్‌వర్క్


లోయర్ మానేర్ డ్యామ్

మా'నీరు' తగ్గుతోంది

కరీంనగర్‌తోపాటు వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాంతాలకు ఆధారమైన లోయర్ మానేర్ డ్యామ్‌లో నీటి నిల్వల పరిస్థితి ఇది. ఈ డ్యామ్ నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలైతే.. ప్రస్తుతం 7.4 టీఎంసీలే ఉన్నాయి. ఎండలు మండుతుండటంతో ఈ నీళ్లు ఎన్ని రోజులకు సరిపోతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాకర్లపల్లెలో అడుగంటిన వ్యవసాయ బావి



సూర్యాపేట జిల్లా వేపల సింగారంలో ట్రాలీ ఆటోలో ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి నీటిని పట్టుకుంటున్న జనం


భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం రేగళ్లగుంపులో చెలిమ నుంచి నీళ్లు తోడుకుంటున్న ఆదివాసీలు

ఊరంతటికీ చెలిమ నీరే ఆధారం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రేగళ్ల గుంపులో చెలిమ నీటిని తోడుకుంటున్న ఆదివాసీలు వీరు. జనవరిలోనే వాగులు ఎండిపోవడంతో చెలిమలో నీటి ఊట కూడా తక్కువగా ఉంటోందని, ఈసారి నీటి కష్టాలు ఎలా ఉంటాయోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దాహం కోసం.. దారి పట్టారు

గిరిజన గ్రామాల్లో తడారిపోతున్న గొంతులకు గుక్కెడు నీళ్లు దొరకాలంటే దూరాలకు వెళ్లక తప్పని దుస్థితిని చూపే చిత్రమిది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సోలంగూడకు చెందిన గిరిజనులు ఇలా వ్యవసాయ పొలాల నుంచి డబ్బాలలో నీళ్లు తెచ్చుకుంటూ కాలం గడుపుతున్నారు.


పొలాల వద్ద నీటి వనరుల నుంచి డబ్బాల్లో బైక్‌లపై తాగు నీటిని తీసుకెళుతున్న గిరిజనులు

ట్యాంకర్ వస్తేనే దాహం తీరేది..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం తాటిపర్తిలో గ్రామపంచాయతీ ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు. దాదాపు నెల రోజులుగా నల్లా నీటి సరఫరా నిలిచిపోయిందని, ట్యాంకర్ నీళ్లే దిక్కు అవుతున్నాయని వారు వాపోతున్నారు.


తాటిపర్తిలోని 8వ వార్డులో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళలు, బాలికలు

కిలోమీటర్ల కొద్దీ నడిస్తేనే గొంతు తడిచేది

నిర్మల్ జిల్లా పెంబి మండలం ధూమ్‌ధరి గ్రామపంచాయతీ పరిధిలోని చికమున్ వాగులో చెలిమ తోడుకుని నీళ్లు నింపుకొంటున్న గిరిజనులు వీరు. దీనికి ఇరువైపులా ఉన్న వస్పల్లి కొత్తగూడెం, గిరిజనగూడెం రెండు గ్రామాలవారికి ఈ వాగు చెలిమలలోని నీరే దిక్కు. బిందెల్లో నీళ్లు నింపుకొని కిలోమీటర్ల కొద్దీ మోసుకుంటూ వెళ్తేనే.. ఇంటిల్లిపాదీ గుక్కెడు నీళ్లు తాగే పరిస్థితి.


చికమున్ వాగు నుంచి నెత్తిపై బిందెలతో నీటిని తీసుకెళ్తున్న వస్పల్లి గిరిజన మహిళలు

నేటినుంచి టెన్త్ పరీక్షలు

- హాజరుకానున్న 5.08 లక్షల మంది
- పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.. విద్యాశాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2 వరకూ జరిగే పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు కొనసాగుతాయి. అయితే ఈనెల 26, 27 తేదీల్లో జరిగే ఫిజిక్స్, బయాలజీ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకే ఉంటాయి. నిర్ణీత పరీక్ష సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే డీఈవోలకు, సీఎస్‌లకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. గతేడాది వరంగల్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో.. ఈసారి పరీక్ష కేంద్రాల సిబ్బందితో పాటు, తనిఖీలకు వచ్చే అధికారులు, స్క్వాడ్స్ కూడా ఫోన్లను బయట పెట్టేలా ఆదేశాలు జారీ చేశారు.

వాట్సాప్ చాటింగ్‌లు, లావాదేవీలపై ఆరా!


ఢిల్లీలోని ఈడీ కార్యాలయం వద్ద హరీశ్‌రావు, కేటీఆర్, అనిల్‌కుమార్

▶ మొదటి పేజీ తరువాయి

చేసి నట్టు తెలిసింది. కాగా.. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు కూడా ఈడీ కార్యాలయా నికి చేరుకున్నా.. ఈడీ అధికారులు కవితను కలిసేందుకు వారిని అనుమతించలేదు.

విక్రమ్ చౌదరితో ప్రత్యేక భేటీ

మద్యం విధానం కుంభకోణం కేసులో కవిత తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరితో కేటీఆర్, హరీశ్‌రావు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఢిల్లీకి చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు తొలుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కాసేపటి తర్వాత విక్రమ్ చౌదరి నివాసానికి వెళ్లారు. కవిత కేసు విచారణ విషయంలో న్యాయ అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వారు సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించినట్టు తెలిసింది. సుమారు రెండు గంటలపాటు ఈ సమావేశం జరిగిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

రహస్య ఒప్పందం ఉంది కాబట్టే కవిత అరెస్టు

- కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది కాబట్టే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అయిందని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము గెలవకపోయినా కాంగ్రెస్ పార్టీ గెలవకూడదనే విధంగా బీజేపీ రాజకీయ డ్రామాకు తెరతీసిందని దుయ్యబట్టారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత ఉందనే విషయాన్ని బీజేపీ నేతలు ఏడాది క్రితమే చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజాస్వామ్యపాలన తీసుకొచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వంద రోజుల పాలనకు కవిత అరెస్టుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ కాలిపోతున్న ఇంటిలాంటిది కాబట్టే ఆ పార్టీ నుంచి నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని పడగొడతామన్న బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతోందని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో సకల సౌకర్యాలతో తెలంగాణ భవన్ నిర్మాణం జరుగుతుందని, భవన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోందని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

వంద రోజుల్లో.. వంద తప్పులు..

- కాంగ్రెస్ ప్రజలను నమ్మించి మోసం చేసింది.. కేటీఆర్ ఫైర్
- పింఛన్ల పెంపు, మహిళలకు ఆర్థిక సాయం హామీలు ఏమయ్యాయి?
- తాగునీరు ఇవ్వకుండా మళ్లీ ట్యాంకర్ల రాజ్యం తేవడం ఏమిటి?
- 200 యూనిట్లు దాటితే మొత్తం కరెంటు బిల్లు ఎందుకు కట్టాలి?
- 'ఎక్స్'లో పోస్ట్ చేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో వంద తప్పులు చేసిందని.. నాలుగు కోట్ల మంది ప్రజలను నమ్మించి మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మండిపడ్డారు. రాష్ట్ర రైతాంగం పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మళ్లీ తిప్పలు పడుతోందని.. సాగు నీరు, విద్యుత్ సమస్యలతో సతమతం అవుతోందని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు.

హామీల అమలు ఏది?

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకుంటోందని కేటీఆర్ మండిపడ్డారు. ''రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15 వేలు, వరికి రూ.500 బోనస్, ప్రతి మహిళకు రూ.2,500 సాయం వంటి హామీల అమలు ఎప్పుడు? రైతుబంధును సీరియల్‌లా ఎంతకాలం సాగదీస్తారు. మూడు నెలలైనా పెన్షన్లను రూ.4000కు ఎందుకు పెంచలేదు. ఒకటో తేదీనే ఇస్తామన్న జీతాలు అందరికి ఎందుకు అందడం లేదు. 200 యూనిట్ల వినియోగం దాటితే మొత్తం కరెంట్ బిల్లు ఎందుకు కట్టాలి? గృహజ్యోతికి ఏటా రూ.8 వేలకోట్లు అవసరమైతే బడ్జెట్లో రూ.2,400 కోట్లే ఎందుకు పెట్టారు? దళితబంధు పథకాన్ని అర్ధాంతరంగా ఎందుకు నిలిపివేశారు? అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అడ్రస్ లేకుండా ఎందుకు చేశారు? ఒకే ఒక్కరోజు ప్రజాభవన్‌కు వెళ్లి ఆ తర్వాత ఎందుకు ముఖం చాటేశారు? చిన్న లోపాన్ని భూతద్దంలో చూపెట్టి మేడిగడ్డ బ్యారేజీపై ఎందుకు కుట్ర చేస్తున్నారు? కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును ఎందుకు పక్కన పెట్టేశారు? భూగర్భ జలాలు అడుగంటుతున్నా చెరువులు ఎందుకు నింపడం లేదు?'' అని ప్రశ్నించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతులకు సాగునీరు ఇవ్వకపోవడం ఘోరమన్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ రైతుల ఆత్మహత్యలు జరిగే పరిస్థితికి తెరలేపుతున్నారని ఆరోపించారు.


వేళాపాళా లేని కరెంటు కోతలేంటి?

యాసంగి సాగు గణనీయంగా తగ్గినా ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని కేటీఆర్ నిలదీశారు. ట్యాంకర్లతో నీళ్లు పోస్తూ పంటలను కాపాడుకునే దుస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ''వేళాపాళా లేని కరెంటు కోతలేమిటి? పల్లెలు, పట్టణాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు ఎందుకు పాతరేశారు? నాణ్యత లేని కరెంట్ వల్ల మోటార్లు కాలిపోవడానికి బాధ్యులెవరు? యూరియా కోసం మళ్లీ క్యూలైన్లలో నిలబడే దుస్థితి ఎందుకు తెచ్చారు? సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు అప్పగించారు? మిషన్ భగీరథను మూలన పడేసి.. మళ్లీ ట్యాంకర్ల రాజ్యం తేవడమేంటి? ఉచిత బస్సు ప్రయాణమని ఆశపెట్టి మహిళలను ఇబ్బందులకు గురిచేస్తారా? ఆటోడ్రైవర్ల పొట్టగొట్టి.. ఏటా ఇస్తామన్న రూ.12 వేలు ఎగ్గొడతారా? పదేళ్లు సంతోషంగా ఉన్న నేతన్నల జీవితాలను ఎందుకు ఆగం చేశారు? ఆర్డర్లు ఇవ్వకుండా సాంచాల సంక్షోభాన్ని ఎందుకు సృష్టించారు?'' అని ప్రశ్నించారు.

వరి పంటకు నిప్పు


యాద్గార్‌పల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పంటను తగులబెడుతున్న రైతు

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాన్ని రైతు బంటు లక్ష్మయ్య తగులబెట్టారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరందించకపోవడంతో బోర్లు, బావుల కింద భూగర్భజలాలు తగ్గిపోయి.. బోర్లు ఎండిపోయాయని, తలా మూడు, ఐదు ఎకరాల్లో పంట వేసుకుంటే కనీసం రెండు ఎకరాలకు కూడా నీరు పారకపోవడంతో మిగతా పొలం మొత్తం ఎండిపోయిందన్నారు. ఎకరాకు సుమారు రూ.25 వేల చొప్పున పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



వ్యక్తుల్లో పిచ్చితనం అనేది అరుదు– కానీ గ్రూపుల్లో, పార్టీల్లో, జనాల్లో, కాలాల్లో అదొక నియమం.

– నీషే

సాక్షి

సోమవారం, 18 మార్చి 2024

నెహ్రూ జాకెట్ సాహిత్యం

నెహ్రూ గారిని నిలదీయడం ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయిందిగాని నిజానికి ఆయనను నిలదీయాల్సింది నెహ్రూ జాకెట్‌ను ఎందుకు పాప్యులర్ చేశావయ్యా అని. రచయితలు, కవులు, విమర్శకులు మున్ముందు రోజులలో లాల్చీ పైజమా ధరించడమేగాక నెహ్రూ జాకెట్‌ను కూడా తగిలించారంటే గనక చచ్చినట్టు వారు సాహిత్యకారులుగా మన దేశంలో చలామణి అవుతారని ఆయన ఊహించి ఉండడు. ఎరిగిన సాహిత్యకారులు అడపా దడపా ఆ అదనపు వస్త్రాన్ని ధరించినా తాము సాహిత్యకారులమే అని తప్పక నిరూపించుకోవాలనుకునే వారికి మాత్రం నెహ్రూ జాకెట్ కవచ కుండలం.

పూర్వం రోజులలో కొందరు సాహితీ తాపసులు పెన్నును బుగ్గకు పెట్టుకుని, నుదుటిని నింగి వంక ఎత్తి పెట్టి ఫొటో దిగి, పుస్తకం వెనుక వేసుకోవడం వల్ల వారు రచయితలని, కవులని నమ్మాల్సి వచ్చేది. మరికొందరు టెలిఫోన్ రిసీవర్‌ను చెవి దగ్గర పెటుకొన్న ఫొటోను పుస్తకం వెనుక వేయడం వల్ల అమ్మో వీరు రచయితలేస్మీ అనుకోకుండా ఉండలేకపోయేవారం. 'మానవతా... ఎక్కడమ్మా నీ చిరునామా?' అని గూగుల్ మేప్స్ లేని కాలంలో ఎవరు పై అడ్రస్ అడుగుతూ కవిత్వం రాసినా వారు కవులు కాకుండాపోలేదు. ఇక ఏ కాలంలో అయినా ఎల్.ఎస్.వి. శేషాచలం, మునవర్తి సుబ్రహ్మణ్యం, విక్టర్ మనోహర్, ప్రొఫెసర్ చారులత వంటి ప్రముఖ విమర్శకులు ఉంటారు కనుక వారు ముందు మాట రాసి వదిలారంటే– ఎందుకొచ్చిన గొడవ అని నోరు మెదపక అట్టి రచయితలను రచయితలే అనుకోవడమూ కద్దు.

ఏదేని ఒక శాఖ కలిగిన రాష్ట్రమంత్రితో, ఏదేని ప్రాదేశిక ఇన్‌కమ్‌టాక్సు కమిషనర్‌తో, లేదంటే స్థానిక వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్‌తో... ఈ ముగ్గురితో కాని కనీసం వీరిలో ఇద్దరితో కాని ఫొటోలు దిగి, ఫేస్‌బుక్‌లో పెట్టి, ఇక మమ్మల్ని సాహిత్యకారులం కాదు అనంటే తంతాం అనేవారు ఉన్నారంటే నోరు నొక్కుకోవాల్సిన పని లేదు. జీవితంలో అక్షరమ్ముక్క రాయకపోయినా రాసే వాళ్లందరి ఫోన్ నంబర్లు కలిగి ఉండటమే కాదు వారికి కాల్ చేసి 'ఏహోయ్ ఎలా ఉన్నావ్' అనిగానీ, 'నమస్కారమండీ... టిఫినయ్యిందా' అనిగానీ అడగ్గలిగే చనువు ఉన్నందుకు కనీసం డజను మంది తెలుగునాట ప్రముఖ సాహిత్యకారులుగా చలామణి అవుతున్నారంటే గుండె పొంగే సంగతి. 'శుంఠల్లారా... ఇదా మీ ప్రతాపమూ... నన్ను గనక కళ్లకు గంతలు గట్టి ఢిల్లీలో ఏమూల వదిలినా నేరుగా సాహిత్య అకాడెమీ ఆఫీసుకు చేరుకోగలను' అనేవారి ప్రదక్షిణ పటిమ వారికి ఇస్తున్న అతిశయం అంతా ఇంతా కాదు.

'అడుగడుగున నుడి ఉంది', 'అక్షర రశ్మి జయతు', 'మనమంతా కలం కులం'... వాట్సప్ గ్రూప్‌లను స్థాపించి, ఒక దానిలో నూట పదహారుకు తక్కువ కాకుండా సభ్యులను చేసి, అడ్మిన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏకైక హోదా వల్ల సాహిత్య దశా దిశను నిర్దేశించాలని కన్నీళ్లతో తపన పడేవారెందరో మన హృదయాలను చెమ్మగిల్ల చేస్తున్నారు. ఈ యొక్క వాట్సప్ గ్రూప్‌లలో ప్రతి ఒక్క కవిత, వ్యాఖ్యకు మరువక లైక్ కొట్టేవారిని దృష్టిలోకి తీసుకుని మాసాంతంలో వారికో అవార్డు బహూకరించడం మరో విశిష్ట ప్రోత్సాహక ప్రోత్సహితం. జూమ్‌లో స్లాట్ బుక్ చేసి, కార్డు డిజైన్ చేయగల వనరులు కలిగినవారు వారానికి పది మందిని సాహితీ సమాలోచనంలో ముమ్మరం చేయడం చూస్తే ఏమిచ్చి వీరి రుణం తీర్చుకోగలం అనిపిస్తుంది. గుర్తు తెలియని విదేశాలకు వెళ్లి స్థానిక గాంధీనగర్ అసోసియేషన్ స్థాయి సాహితీ సమ్మేళనంలో పాల్గొని రుజువు పత్రంతోనూ, తెల్లవాళ్లతోనూ ఫొటోలు దిగి బెదురు, బెరుకు పుట్టించే వారిది స్వీయ విమానచార్జీలు భరించగలిగే స్థాయి.


సాహిత్యం అంటే అందరికీ ఇష్టం. పాఠకులుగా ఉత్తమ సాహిత్యాన్ని ఇష్టపడేవారూ సృజనకారులుగా ఉత్తమ సాహిత్యసృష్టికి పెనుగులాడేవారూ ఎప్పుడూ ఉంటారు. ఈ ఇద్దరూ ప్రతి ప్రాంతంలో, భాషలో, దేశంలో తమ తమ సాహిత్యాన్ని గౌరవ భంగం కలగకుండా కాపాడుకుంటూ వస్తారు. అలాగే ప్రతి సందర్భంలో, ప్రతి సన్నివేశంలో ఈ సాహిత్యంలో భాగం కావాలని నిజాయితీగా అభిలషించేవారూ ఉంటారు. వీరి ప్రయత్న శుద్ధి, సృజన సామర్థ్యం, విడదీయలేని స్వభావం ఇవ్వవలసిన గుర్తింపు ఇస్తూనే ఉంటాయి. వీరు కాక ఔత్సాహిక పాఠకులు, ఔత్సాహిక సాహితీ సేవకులూ ఉంటారు. వీరు తమను తాము సాహితీకారులుగా భావించుకుని కార్యాచరణలో దిగడమూ, సాహిత్యానికి ప్రతినిధులుగా మారడం నేటి సోషల్ మీడియా కాలంలో విస్తృతమైంది. సాహిత్యం ఇచ్చే గుర్తింపు ఆనందాన్ని, ఆత్మసంతృప్తిని కలిగించడమేగాక ఏదో ఒక ఊతం దొరికింది కదా అనుకునేలా చేయడం ఇందుకు కారణం. ఇవన్నీ ఉండాల్సినవే. ఉండతగ్గవే. కాకుంటే శ్రుతి మించి అసలు కొంత, కొసరు మరింతగా మారడం నేటి దుఃస్థితి.

వాస్తవానికి రెండు రాష్ట్రాలలోని చిన్న ఊళ్లలో ఉంటూ మంచి కవిత్వాన్ని, కథను రాస్తున్న యువతరం ఎందరో ఉన్నారు. అలాగే ఏళ్లకేళ్లు తమ మానాన తాము రాసుకుంటూ పాఠకుల గౌరవం పొందినవారూ ఉన్నారు. వీరంతా పి.ఆర్. చేయకపోవచ్చు. తమను తాము ముందుకు నెట్టుకోకపోవచ్చు. అంతమాత్రాన రాష్ట్ర, జాతీయస్థాయి వేదికల మీద వీరు కనపడాల్సిన పనిలేదు అనుకోరాదు. అదే సమయంలో పరిచయ సామర్థ్యమే సాహితీ సామర్థ్యంగా చెల్లుబాటయ్యే వారు అట్టి వేదికల మీద పదే పదే సాహితీ ముఖాలుగా కనిపించడాన్నీ ఉపేక్షించాల్సిన పని లేదు. 'సత్యముతో పని ఏల, మిడియోకర్‌లతో కలిసి నడిచి ప్రయోజనాలు పొందితే పోలా' అనుకునే నిజ సాహితీకారులదీ ఈ దోషం. కళ్లు మూత.

ఏమైనా మాట్లాడే సందర్భం వస్తుంది. అభినయ సాహిత్యకారులూ కొంచెం నెమ్మదించండి!

ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు!

కామెంట్



కరణ్ థాపర్

రాజకీయ పార్టీలకు రహస్యంగా నిధులు అందించటానికి వీలు కల్పించే ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధం అంటూ ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు కీలకమైన తీర్పును వెలువరించింది. ఆ సందర్భంలోనే – భారతీయ స్టేట్ బ్యాంకు ఇంతవరకు తాను కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను నిర్ణీత గడువులోపు ఎన్నికల సంఘానికి వెల్లడించాలని ఆదేశించింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించడంతో బ్యాంకు పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం, కోర్టు ఆదేశాల ప్రకారం బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. దాంతో భారతీయ స్టేట్ బ్యాంక్ కొంతమేరకైనా వివరాలు వెల్లడించాల్సి వచ్చింది. అయితే, ప్రశ్నేమిటంటే... ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బ్యాంకు చేత ఇంతకాలంగా వివరాలు వెల్లడించనివ్వకుండా చేయిస్తున్నది ఎవరు అని! అయితే ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు!

నా తొలి బ్యాంకు ఖాతా ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లోని భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలో ఉండేది. నా పేరిట నాన్న దానిని తెరిచినప్పుడు నా వయసు 16 ఏళ్లు. మా పూర్వీకుల భూములను విక్రయించటం ద్వారా నా వాటాగా వచ్చిన మొత్తాన్ని జమ చేసేందుకు ఉద్దేశించిన ఖాతా అది. ఆ ఖాతాను ప్రతి నెలా వడ్డీ వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు జత కలిపారు. ఆ వడ్డీ పెద్ద మొత్తమేమీ కాదు కానీ, నేనొక డబ్బు గల ఆసామినన్న భావన నాలో కలిగించింది.

నాన్న సొంత ఖాతా గ్రిండ్లేస్ బ్యాంకులో ఉండేది. ఆ బ్యాంకు ఇప్పుడు ఉనికిలో లేదు. నాన్న నా కోసం ఆ రోజు ఎస్.బి.ఐ. బ్యాంకును ఎందుకు ఎంచుకున్నారో నాకు గుర్తులేదు కానీ, ఆ సంస్థ పట్ల ఆయన ఉన్నతమైన అభిప్రాయాన్ని కలిగి ఉండేవారని అనుకుంటాను.

డెబ్బయ్‌లలో బ్యాంకింగ్ చాలా భిన్నంగా ఉండేది. నగదు లావాదేవీల టెల్లర్ కౌంటర్‌ల వద్ద పొడవైన క్యూలు ఉండేవి. సొంత చెక్కులకు డబ్బు ఇవ్వడానికి కూడా వారి ఖాతాలను తనిఖీ చేసేవారు. అదంతా కూడా అమిత ప్రయాసతో కూడిన దుర్భరమైన తతంగంలా ఉండేది. ఆ దశలో అకస్మాత్తుగా ఎస్.బి.ఐ. మన ఖాతాలో సరిపడా నిధులు ఉన్నాయా, లేవా అన్నది కూడా నిర్ధారణ చేసుకోకుండానే సెల్ఫ్–చెక్కులను ఒక నిర్ణీత పరిమితి వరకు నగదుగా మార్చుకునే అవకాశం కల్పించిన మొదటి బ్యాంకుగా అవతరించింది. ఆ దెబ్బతో, అరగంట పట్టే పని... నిమిషాల్లో అయిపోవడం మొదలైంది.

ఆఖరికి నాగర్‌వాలా నగదు కుంభకోణం కూడా ఎస్.బి.ఐ. దేదీప్యాన్ని చెక్కుచెదర్చలేక పోయింది. ఎగతాళిగా నవ్వినవారు లేకపోలేదు కానీ, బ్యాంకు నుంచి తమ ఖాతాలను ఉపసంహరించుకున్న వారు చాలా తక్కువ. అలాంటి కుంభకోణాలు ఊహించినవే. అయినా అవి నేరారోపణలు వచ్చేంతగా పరిగణన పొందనివి.

ఆ రోజుల్లో మా అమ్మ 50 పైసలు, 1 రూపాయి నాణేలను పొదుపు చేసేవారు. ఒక పాత టప్పర్‌వేర్ బ్రెడ్ బాక్సులో వాటిని ఆమె భద్రంగా దాస్తూ ఉండేవారు. అలా కూడబెట్టిన ఆ అపురూపమైన నాణేలను ఎస్.బి.ఐ.కి తీసుకెళ్లి ఆమె ఖాతాలో జమ చేసి రావడం అనే బాధ్యత నాపై పడుతుండేది. కౌంటర్‌లో ఉండే టెల్లర్ ఆ నాణేలను తూకం వేసి చూసి, మా అమ్మలోని ఇలా పోగేసే గృహిణి నైజాన్ని ప్రశంసించేవారు. "మేరీ బీవీ భీ యహీ కర్తీ హై"



దేదీప్యమానం: న్యూఢిల్లీలోని ఒక ఎస్.బి.ఐ. శాఖ భవంతి

(మా ఇంటావిడ కూడా ఇలాగే చేస్తుంటుంది) అనే అతడి మాట నాలోని టీనేజ్ బిడియాన్ని పోగొట్టేది. ఆయన అలా అనేవరకు కూడా నన్ను నేను మురికి నాణేలను సంచిలో మూట కట్టుకుని బ్యాంకుకు వెళ్లే వ్యాపారిలానే భావించుకున్నాను.

స్టో లేదా కేంబ్రిడ్జి నుండి సెలవులకు వచ్చినప్పుడు పార్లమెంటు స్ట్రీట్ బ్రాంచి నిరంతరం నాకు పని కల్పించేది. నాకు మాత్రమే కాదు, ఇంట్లో అందరికి! ఎందుకు అని నన్నడక్కండి. అనుకోకుండా ఎందుకో వెళ్లేవాళ్లం. వెళ్లిన ప్రతిసారీ ఇలా వెళ్లి అలా వచ్చేయటం అన్నట్లుగా ఉండకపోయే వాళ్లం. కనుక, ఆ ప్రదేశంపై నాకు మక్కువ ఏర్పడటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. తరచుగా ఏం జరిగేదంటే, గ్రౌండ్ ఫ్లోర్‌లో నా పని పూర్తి అయినప్పుడు పై అంతస్థులకు కూడా వెళ్లి, నా చిన్న మొత్తాల పొదుపుపై సలహాలు అడుగుతుండేవాడిని. 20 ఏళ్ల యువకుడిలోని ఆ అతిక్రమణను ఐదవ అంతస్థులోని మేనేజర్లు గొప్ప సంసిద్ధతతో క్షమించేసేవారు. నా ప్రశ్నల్ని వారు స్వాగతించారని కూడా నాకు గట్టిగా అనిపించేది.

ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పగలను. నాకు తెలిసిన బ్యాంకు ఎప్పుడూ కూడా గత వారం ఎస్.బి.ఐ. వ్యవహరించిన విధంగా అయితే లేదు. సుప్రీంకోర్టు మందలింపుతో బహుశా ఆ బ్యాంకు సిబ్బంది ముడుచుకుపోయి ఉండొచ్చు. మనకున్న అత్యుత్తమ సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ఒకరైన మదన్ లోకూర్, "బ్యాంకుకు ఇది చెంపపెట్టు" అని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తిగా ఆయన పని చేసిన ఇన్నేళ్లలోనూ ఇలా ఒక బ్యాంకు మందలింపునకు గురైన సంఘటనను ఆయన గుర్తు చేసుకోలేదు.

గత సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి అడిగిన ఒక ప్రశ్న ఎస్.బి.ఐ.ని నెలల తరబడి, కాదంటే ఏళ్ల తరబడి వేధిస్తుందా అని నా ఆందోళన. "ఆదేశాలను పాటించటం మీకు కష్టంగా ఉందని మీరు చెబుతున్నారా?" అని ఆయన అడిగారు. "గత 26 రోజులలో మీరు తీసుకున్న చర్యలు ఏమిటి? ఆ విషయంలో మీరు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఎస్.బి.ఐ. నుంచి ఒక స్థాయి నిజాయితీని మేము ఆశిస్తున్నాం" అన్నారు.

నా బ్యాంకు ఇంతగా తక్కువ కావటం – ఇప్పటికీ అది నా బ్యాంకులలో ఒకటి కావటం – నాకు బాధను కలిగిస్తోంది. ఎందుకు అలా అనిపిస్తోందని అడక్కండి. బహుశా ఇది అర్ధ శతాబ్దం పాటు సాగిన బాంధవ్య పరిణామం కావచ్చు. లేదా, నాకు అలా అనిపిస్తుండొచ్చు. నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఇది తప్ప వేరొక వివరణ నాకు తోచటం లేదు.

అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే – సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఎస్.బి.ఐ. ఉద్దేశపూర్వకంగా తనకు అవసరమైన రీతిలో తప్పుగా అన్వయించుకోవటం ద్వారా, కోర్టు ఆదేశించిన ఒక సాధారణమైన పనిని కావాలనే క్లిష్టతరం చేసి, ఆ ఆదేశాన్ని పాటించలేకపోవటానికి తిరిగి ఆ సంక్లిష్టతనే ఒక నెపంగా చూపిందా అన్న అనుమానానికి ఆస్కారం కలగడం. ఒక గౌరవప్రదమైన బ్యాంకు నుంచి మీరు ఇలాంటిది ఊహించలేరు. దీర్ఘకాలంగా మీరు అనుబంధం కలిగి ఉన్న ఒక బ్యాంకు విషయంలో ఇలా జరిగినప్పుడు భ్రమలు తొలిగినట్లుగా అనిపిస్తుంది.

ప్రభుత్వమే వెనుక ఉండి ఇలా జరిపించిందా? ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు. అయినప్పటికీ మీలోని లక్షల మందికి, ఆ లక్షల్లో ఎక్కువ మందికి ఈ ప్రశ్నకు సమాధానం తెలుసు. కానీ ఈ ప్రశ్న అడగటం వెనుక ఉన్న వాస్తవం బాధను కలిగిస్తుంది. ఆ బాధ అందరి కంటే ఎక్కువగా ఆ బ్యాంకు ఉన్నతాధికారులలో ఉంటుందని నేను ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పిరికి దాడి



ఉత్తర వజీరిస్తాన్‌లో రక్షణ బలగాల మీద జరిగిన తీవ్రవాద దాడి హేయమైనది. అది పిరికిపందల హింసాత్మక చర్య. ఈ కష్టకాలంలో బాధితులకు, వారి కుటుంబాలకు నా సానుభూతి. మనం తీవ్రవాదానికి వ్యతిరేకంగా సమష్టిగా నిలబడాలి. శాంతి భద్రతల కోసం కలిసి పనిచేయాలి.

– అన్వర్ ఉల్ హక్ కాకర్, పాకిస్తాన్ మాజీ ఆపద్ధర్మ ప్రధాని

నమ్మొచ్చా?



చూస్తుంటే భూమ్మీద ఉన్న మనుషుల్లో భారతీయులే ఎంతమాత్రమూ సంతోషంగా ఉన్నట్టు లేరు (ప్రపంచ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భారత్ 126వ ర్యాంకులో ఉందట!). ఇజ్రాయెల్, పాలస్తీనా, ఉక్రెయిన్, రష్యా, ఆఖరికి పాకిస్తాన్ కన్నా కూడా మనం వెనుకబడి ఉన్నాం. ఈ చెత్త సూచికలు కొన్నిసార్లు నన్ను దిగ్భ్రమకు గురిచేస్తుంటాయి.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఒకే రోజు చేయలేమా?



ఎన్నికలకు సంబంధించి ఇంత యంత్రాగం ఉన్న దేశం అయినప్పటికీ, భారతీయులందరికీ ఒకే రోజున ఎన్నికలు జరపలేకపోవడం పట్ల నిరాశగా ఉంది. ఎన్నికల తంతు వారాలు సాగుతుంది.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

మనమే నయం



మన కంటే ధనవంతులు ఎక్కువగా ఈ (కేంద్ర) ప్రభుత్వపు దౌర్జన్యానికి గురి అవుతున్నారని తెలియడం సంతోషంగా ఉంది.

– వీణా వేణుగోపాల్, రచయిత్రి

మళ్లీ మళ్లీనా?



ఉన్నత విద్యాసంస్థలకు మనల్ని దెబ్బ కొట్టడానికి ప్రత్యేక విధానాలుంటాయి. ఎందుకంటే ప్రతిదానికీ అప్లికేషన్ పెట్టుకోవాలి. పీహెచ్‌డీకి అప్లై చెయ్యి, ఫెలోషిప్‌కు అప్లై చెయ్యి, గ్రాంట్ కోసం అప్లై చెయ్యి, ఉద్యోగం కోసం అప్లై చెయ్యి, ప్రమోషన్ కోసం అప్లై చెయ్యి, పేపర్ పబ్లిష్ కావడానికి అప్లై చెయ్యి. అమ్మో! తిర్పునకు గురికావడం అనేది అందరికీ చేతనయ్యే విషయం కాదు.

– టి.వి.నైనన్, పరిశోధకుడు

సమాన దూరం



మీరా నంద ప్రపంచంలోని గొప్ప సైన్సు హిస్టారియన్లలో ఒకరు. ఆమె హిందూత్వకు తీవ్రమైన విమర్శకురాలు. కానీ ఆమె రోజూ టీవీలో గానీ, సాహిత్య పండుగల్లోగానీ కనబడదు. ఎందుకంటే ఆమె అంతే తీవ్రంగా లెఫ్ట్ ఎకోసిస్టమ్‌ను కూడా వ్యతిరేకిస్తారు. ఆమె నిజమైన ఉదారవాది. ఆమె నా ఐకాన్.


– సంజుక్తా బసు, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఆసక్తి రేపే జీవితం!

సినిమా హాలు ముందు కిళ్లీలు అమ్మాడు. సోడాలు కొట్టాడు. థియేటర్‌లో పకోడీ పొట్లాలు అమ్మాడు. ఆరో తరగతి తప్పాడు. నలుగురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ల కడుపు నింపటానికి చక్కిలాలు, విస్తరాకులు అమ్మాడు. చిన్నాన్న నడిపే హోటల్లో పనికి కుదిరాడు. గిరిజన తండాల నడుమ నాటుసారా కాశాడు. నక్సలైట్లకు టీ కాచి ఇచ్చాడు. మావయ్య నడిపే హోటల్లో టేబుళ్లు తుడిచాడు. క్లీనర్ నుంచీ కుక్ వరకూ తనే సమస్తం.

ఆముదాలవలస వదిలేసి పర్లాకిమిడి చేరుకున్నాడు. పధ్నాలుగేళ్ల వయసులో చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని హోటల్ ప్రారంభించాడు. పెద్ద తమ్ముడు



అంట్లు తోమేవాడు. చెల్లి కూరగాయలు కోసేది. తల్లి వంట చేసేది. కష్టమర్లు పెరిగారు. నాలుగు కాసులు కళ్లజూశాడు. పెద్ద తమ్ముడితో పెట్టించిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్, రెండో తమ్ముడితో పెట్టించిన టిఫిన్ సెంటర్ ఘుమఘుమలాడాయి. ముగ్గురూ కలిసి చిన్న తమ్ముళ్లను చదివించారు. చెల్లికి పెళ్లి చేశారు. కమీషన్ బిజినెస్‌తో రెండు వేలు సంపాదించాడు. సంతోషంతో ఉప్పొంగిపోయేలోగానే హోటల్ మంటల్లో కాలిపోయింది. గుండెబలంతో పాటు కండబలం కూడా అవసరమని గుర్తించాడు. పదిహేనేళ్ల వయసులో జిమ్‌లో చేరాడు. 'గ్యాంగ్'లు మంచికీ పనికొస్తాయని నిరూపించాడు.

పదహారో ఏట పుస్తకపఠనం అలవడింది. వామపక్ష భావజాలం పోరాటం నేర్పింది. 'పాతాళ గరుడ' మూలికల్ని సేకరించాడు. నాటుసారా వ్యాపారంలోకి అడుగు పెట్టాడు. రేషన్ షాపు డీలర్‌షిప్ తీసుకున్నాడు.

ఇరవై మూడేళ్ల వయసులో పుష్పాంజలిని పెళ్లి చేసుకున్నాక, వెర్మిసెల్లి పరిశ్రమ స్థాపించాడు. జీడిపిక్కలు కొన్నాడు. చింతపండు అమ్మాడు. వైన్ షాపు నడిపాడు. బార్ అండ్ రెస్టారెంట్లు ప్రారంభించాడు.

ఇదంతా సజావుగా, సాఫీగా జరగలేదు. నక్సలైట్లు ప్రజాకోర్టుకు పిలిచి శిక్షించబోయారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగింది. పేరు ప్రతిష్ఠలతో మురిసిపోయేలోపు పోలీసులు అరెస్టు చేశారు. 18 నెలలు జైల్లో గడిపాడు.

అయినా ఎలా నిలదొక్కుకున్నారు? వివిధ రాష్ట్రాలలో వైద్య కళాశాలలు ఎలా స్థాపించారు? 'డాక్టర్' తిరుపతి పాణిగ్రాహి ఎలా అయ్యారు? వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి ఎలా అయ్యారు?

ఇవన్నీ తెలియాలంటే ఆయన ఆత్మకథ 'జ్ఞానం చెక్కిన శిల్పం' చదవాల్సిందే. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ (శ్రీశైలమూర్తి సహ రచయిత) రాసిన ఈ పుస్తకం నేటి తరం యువతకు ఓ విలువైన కానుక.

– ఎమ్వీ రామిరెడ్డి । 9866777870

అబ్బురపరిచిన 'అనంత' భావోద్వేగం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

కళ్లు చెదిరే ఐశ్వర్యం, దేన్నయినా క్షణాల్లో సాధించగల అధికారం, కుటుంబ విలువల పట్ల అచంచల విశ్వాసం, భగవంతుడిపై అంతులేని భక్తి... ఇవన్నీ ఒకే కుటుంబంలో కలగలిసి వుండటం ఊహాతీతం. కానీ ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న 'అంబానీ పరివార్' వీటన్నిటి సమ్మేళనం అని మరోసారి రుజువైంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మూడు రోజులపాటు ఈమధ్య జరిగిన ప్రీ వెడ్డింగ్ సంబరాలు దేశంలోనే ఎప్పుడూ కనీవినీ ఎరుగనివి. కానీ వీటన్నిటి కంటే అందరికీ ఆసక్తి కలిగించింది మరొకటుంది. అది జూలైలో పెళ్లికొడుకు కాబోతున్న అనంత్ అంబానీ చేసిన ప్రసంగం! చిన్ననాటి స్నేహితురాలూ, ప్రియురాలూ అయిన రాధికా మర్చంట్‌తో ఆయనకు వివాహం అవుతున్న సందర్భంగా ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకలు జరిగాయి. వర్తమాన ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులు, కార్పొరేట్ కుబేరులు, బాలీవుడ్ అగ్రతారలు, క్రికెటర్లు సకుటుంబ సమేతంగా వచ్చారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా హాజరయ్యారు.

అనంత్ అంబానీ చేసిన ప్రసంగం అందరి మనసులనూ మెలిపెట్టింది. కుమారుడి ప్రసంగం వింటూ ముఖేష్ దంపతులైతే కంటతడి పెట్టారు. 2003లో కరణ్ థాపర్ 'బీబీసీ' కోసం ముఖేష్–నీతా దంపతులను ఇంటర్వ్యూ చేసిన సందర్భంగా నీతాను 'మీ దృష్టిలో డబ్బంటే ఏమిటి?' అని అడిగినప్పుడు 'డబ్బు దానికదే అంతిమ లక్ష్యం కాదు... దాన్ని ఎలా వినియోగిస్తామన్నదే ముఖ్యం' అని చెబుతూ ఒక మాటన్నారు. 'డబ్బు సంపాదన, సంపద జీవితం కానే కాదు... కొన్ని అపురూప చిరస్మరణీయ జ్ఞాపకాలను నిర్మించుకోవటమే జీవితం' అని చెప్పారు. అనంత్ హృదయాంతరాళాల్లోంచి పెల్లుబికి వచ్చిన మాటల వెనక ఆ విలువల జీవశక్తి నిండివుందనీ, ఆ దంపతుల పెంపకం అతణ్ణి తీర్చిదిద్దిందనీ అనిపిస్తుంది.

ఏమన్నారూ అనంత్? తన కుటుంబసభ్యులంతా తన కోసం, తన సుఖ సంతోషాల కోసం పడుతున్న శ్రమను వివరించారు. తనకున్న ప్రత్యేక అనారోగ్య సమస్యల నేపథ్యంలో అమ్మానాన్నలిద్దరూ అనుక్షణమూ తనను అపురూపంగా చూసుకున్న వైనాన్ని కళ్లకు కట్టారు. ప్రీ వెడ్డింగ్ వేడుకలు అత్యంత విలక్షణంగా ఉండాలన్న తపనతో గత కొన్ని నెలలుగా రోజుకు కనీసం 20 గంటలు తన కుటుంబసభ్యులంతా పడిన కఠోర శ్రమను గుర్తుకు చేసుకున్నారు. అందరూ అనుకుంటున్నట్టు తన జీవితం పూలపాన్పు కాదనీ, చిన్ననాటినుంచీ భరించలేని బాధల ముళ్లు వేధిస్తూనే ఉన్నాయనీ చెప్పారు. అనారోగ్య సమస్యల నుంచి బయటపడే క్రమంలో వాడక తప్పని స్టెరాయిడ్స్ చివరకు ఊబకాయానికి కారణమైన తీరును తెలిపారు.



రాధికా మర్చంట్, అనంత్ అంబానీ

సాధారణంగా 25–30 ఏళ్ల మధ్యనుండే సంపన్న కుటుంబాల యువతలో చాలా సందర్భాల్లో విచ్చలవిడితనం, బాధ్యతారాహిత్యం కనబడుతూ ఉంటుంది. ఇంగ్లిష్ తప్ప ఏదీ మాట్లాడలేరు.

ఈ వేడుకల సందర్భంగా 'న్యూస్18'కు ఇచ్చిన ఇంటర్వ్యూ అనంత్‌లోని మానవీయతను వెల్లడిస్తుంది. నిలువెల్లా వినమ్రత, పలికే ప్రతి మాటలో నిజాయితీ అతని సొంతం. ఇంగ్లిష్‌లో కాదు... అందరికీ అర్థమయ్యేలా స్వచ్ఛమైన హిందీలో భావ వ్యక్తీకరణ అనంత్ ప్రత్యేకత. గాయపడిన, ఆదరణ కోల్పోయిన వన్యప్రాణులను అక్కున చేర్చుకుని వాటి సంరక్షణ కోసం జామ్‌నగర్‌లో మూడువేల ఎకరాల్లో 'స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ వన్‌తార' అనే ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. చిన్ననాడు తన నాయనమ్మ కోకిలా బెన్ నేర్పిన ప్రేమ, దయ భావనలే ఈ ప్రాజెక్టుకు తనను పురిగొల్పాయని చెప్పారు. తన ఆధ్వర్యంలోనే గుజరాత్ ప్రభుత్వ సహకారంతో ఒక 'జూ' కూడా నిర్వహిస్తున్నారు.

'ఇండియా టుడే' ఛానెల్‌లో వచ్చిన ఇంటర్వ్యూ ఆయనలోని మరో మనిషిని ఆవిష్కరించింది. ఆ యువకుడిలో దాగున్న ఆధ్యాత్మిక భావనలూ, మాతృదేశంపై ఉన్న చెక్కుచెదరని మమకారాన్నీ ఆ ఇంటర్వ్యూ వెలికితీసింది. పెళ్లి వేడుకలు మన దేశంలోనే జరుపుకోవాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపే స్ఫూర్తిగా అందుకోసం జామ్‌నగర్‌ను ఎంచుకున్నానని చెప్పారు. తన ఇంటిల్లిపాదికీ సనాతన ధర్మంపై ఉన్న భక్తి విశ్వాసాలనూ, వాటికి అనుగుణంగా ఆచరిస్తున్న విలువలనూ వివరించారు. ఆసియా ఖండంలోని సంపన్నవంతుల్లో మొట్టమొదటి స్థానంలో, ప్రపంచ కుబేరుల జాబితాలో పదో స్థానంలో ఉన్న కుటుంబంలో ఒక 28 ఏళ్ల కుర్రాడు ఇంత పరిణతితో, ఆధ్యాత్మిక విలువలతో మాట్లాడతాడని బహుశా ఎవరూ అనుకుని ఉండరు.

'లైసెన్స్ రాజ్'గా పేరుబడిన ఆర్థిక సంస్కరణల పూర్వ దశలో అనంత్ తాత ధీరూభాయ్ అంబానీ తనదైన రీతిలో పావులు కదుపుతూ, ఒక్కొక్క మెట్టే అధిరోహిస్తూ తన విశాల కుటుంబ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ వెళ్లారు. ఆయన వారసత్వాన్ని ముఖేష్ అప్రతిహతంగా కొనసాగిస్తూ దాన్ని మరింత పెంచుతున్న వైనమూ కళ్లముందే ఉంది. అందుకే ఇవాళ దేశంలో రిలయన్స్ స్పృశించని రంగమంటూ లేదు. ఆ కుటుంబ విలువలు సైతం అందరి హృదయాలనూ తాకుతాయని ప్రీ వెడ్డింగ్ వేడుకలు తెలియజెప్పాయి.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు

జరిగే పని – జరగని పని

ఎప్పుడూ పరిస్థితులు ఒకే రకంగా వుండవు. రోజులు కాస్త ప్రశాంతంగానే గడుస్తున్నాయని అనుకుంటూ ఉండేంతలో కాలంలో ఊహించని మార్పు సంభవించి, ఎక్కడినుంచో అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన కారుమబ్బులా అయోమయం అంతరంగాన్ని కమ్మేసి, జరుగుతున్న నష్టానికి కారణం ఏమిటో తెలియకుండా చేస్తుంది. తట్టుకోలేని ఆర్తితో దేవులాడతాం. ఎంత శ్రమ



జ్యోతిర్మయం

పడినా ఏమీ సమాధానం దొరకదు. అప్పుడు ఇక చేసేదేమీ లేక, నిస్సహాయంగా మనసులోనే అనుకుంటాం, 'అయ్యేదేదో అవక మానదు కదా, ఎందుకీ అనవసరపు ఆరాటం' అని! అలా అనుకోగానే అప్పటిదాకా కలతతో నిండివున్న చిత్తానికి కొంత శాంతి చేకూరినట్లౌతుంది. అయ్యేది కాకుండా ఎలాగైతే మానదో, కానిది ఎప్పటికీ కాదు అన్నది కూడా అంతే నిజం అని ఆ వెంటనే ఒకసారి మననం చేసుకుని మరికొంత ప్రశాంతత పొందుతాం. ఈ నిజాన్ని చామర్తి శేషగిరి అనే కవి తాను రచించిన 'నమశ్శివాయ శతకం' లోని ఒక తేటగీతి పద్యంలో ఒక చక్కని ఉదాహరణతో చెప్పాడు.

కాని కార్యం బదెంతటి వానికైన
కాదు, నీకొడు కెంతటి ఘనుడు కాడె
యేల సేయవు వెనకయ్య కింటితనము
మథితగజదనుజాయ నమశ్శివాయ!

చిన్నది పెద్దది అన్న తేడా లేకుండా, అన్ని కార్యక్రమాల ఆరంభ సమయంలో, ఆ కార్యక్రమాలు అవిఘ్నంగా మొదలై కొనసాగాలన్న ఆకాంక్షతో వాటి యజమానులు విధిగా నిర్వహించే పూజలందుకునే ఘనుడు కదా నీ చిన్నకొడుకైన విఘ్నేశ్వరుడు! అంతటి ఆయనకు, పెళ్ళి చేసి, ఒక ఇంటివాడిని ఎందుకు చెయ్యవు? గజాసురుని సంహరించి లోకాలను రక్షించిన వాడవైన ఓ పరమశివా! అది జరిగే పని కాదని తెలిసినవాడవు కాబట్టే కదా! అందువలన, జరిగేది ఎలాగైతే జరగకుండా మానదో, జరగేపనిగా నిర్దేశింపబడనిది... అది ఎంతటి మహామహుని విషయంలోనైనా సరే, ఎన్నటికీ జరగదన్నది సృష్టి ధర్మం, విధాత నియమం – అని పై పద్యంలో సారాంశంగా చెప్పిన విషయం. ప్రతి వ్యక్తి గ్రహించి మానసిక స్వస్థత పొందాల్సిన సత్యం!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం. తిథి: శు.నవమి రా.2.16 వరకు, తదుపరి దశమి. నక్షత్రం: ఆరుద్ర రా.9.45 వరకు, తదుపరి పునర్వసు. వర్జ్యం: లేదు. దుర్ముహూర్తం: ప.12.33 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.45 వరకు. అమృత ఘడియలు: ఉ.11.34 నుండి 12.46 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.06

మరో ఫ్లాప్ షో.. ప్రజాగళం


సన్మానం పేరిట ప్రధాని మోదీని నిలబెట్టి శాలువా కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రధానికి అవమానంతో మొదలైన ఎన్డీఏ తొలి సభ

- కనీసం ఓ శాలువా, ఓ పూల బొకే కూడా తీసుకురాని బాబు, పవన్
- మోదీకి సన్మానమంటూ వ్యాఖ్యాత ప్రకటన
- లేచి నిల్చున్న మోదీ.. దిక్కులు చూసిన టీడీపీ, జనసేన అధినేతలు
- తాను తెచ్చిన వినాయకుడి విగ్రహాన్ని ప్రధానికి బహూకరించిన పురందేశ్వరి
- 15 లక్షల మంది వస్తారని నేతల ప్రకటన.. లక్ష మంది కూడా లేక వెలవెలబోయిన సభ
- వేసిందే 48 వేల కుర్చీలు.. అవీ ఖాళీనే
- కూటమి తొలి సభ అట్టర్ ఫ్లాప్‌తో నైరాశ్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట: ఎన్డీఏలో తెలుగుదేశం, జనసేన చేరిన తర్వాత ఏర్పాటు చేసిన తొలి సభ ప్రధానికి అవమానంతో మొదలై, జనం రాక, మైకులు పనిచేయక చివరకు నవ్వులపాలై ఓ ఫ్లాప్ షోగా మిగిలింది. ప్రధాని మోదీ వస్తుండటంతో 15 లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రచారం చేశారు. ఉమ్మడి మేనిఫెస్టో కూడా ప్రకటిస్తామని చెప్పారు. తీరా చూస్తే సభకు పట్టుమని లక్ష మంది కూడా రాలేదు. మేనిఫెస్టో కూడా లేదు. వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు పది లక్షలు, పదిహేను లక్షల జనంతో విజయవంతమై చరిత్ర సృష్టించాయి. వాటి స్థాయిలో నిర్వహించాలన్న భావనతో టీడీపీ, జనసేన ఏర్పాట్లు చేశాయి. తీరా చూస్తే కనీసం లక్ష మంది కూడా రాలేదు. మరోపక్క జనం లేకపోవడాన్ని కవర్ చేయడానికి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలతో చేయించిన హడావుడి ప్రధాని మోదీని అసహనానికి గురి చేసింది. టీడీపీ కార్యకర్తలు సౌండ్ బాక్సుల పైకి దూసుకురావడంతో చాలాసార్లు మైకులు మొరాయించాయి. కార్యకర్తలు సౌండ్ బాక్సుల టవర్లు, లైటింగ్ టవర్ల పైకి ఎక్కడంతో మోదీ తీవ్రంగా వారిని హెచ్చరించారు.

100 ఎకరాల్లో అసలు సభకు 30 ఎకరాలే

బొప్పూడి వద్ద సుమారు దాదాపు 100 ఎకరాల్లో ఈ సభకు ఏర్పాట్లు చేశారు. అందులో పార్కింగ్‌కి పోను కేవలం 40 ఎకరాలను సభ కోసం కేటాయించారు. అందులో వేదిక, హెలీప్యాడ్‌ల కోసం పది ఎకరాలు కేటాయించగా మిగిలిన 30 ఎకరాల్లో మాత్రమే కార్యకర్తల కోసం ఏర్పాట్లు చేశారు. మొత్తం 24 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీలో 2 వేల కుర్చీలు వేశారు. అవి కూడా ఒక కుర్చీకి ఇంకో కుర్చీకి మధ్య రెండు అడుగులు గ్యాప్ ఉండేలా వేశారు. మొత్తం 48 వేల కుర్చీలు వేసినట్లు చెబుతున్నారు. వాటిలో 6 వేల కుర్చీలు కూడా నిండలేదు. మోదీ ప్రసంగం మొదలైన నిమిషానికే మైకు మొరాయించడంతో రెండు నిమిషాలు ఆగాల్సి వచ్చింది. ఈ సమయంలోనే ఎక్కువ మంది లేచి వెళ్లిపోవడం మొదలెట్టారు. మోదీ మాట్లాడే సమయంలో మూడుసార్లు అంటే దాదాపు ఏడు నిమిషాలకు పైగా మైకులు ఆగిపోవడంతో సభా ప్రాంగణం ఖాళీ అయిపోయింది.

టీడీపీ ప్రోద్బలంతో టవర్లెక్కిన కార్యకర్తలు.. హెచ్చరించిన ప్రధాని

సభా వేదికపైకి మోదీ వచ్చిన సమయానికి కూడా జనం లేకపోవడంతో చంద్రబాబు, పవన్‌లో ఆందోళన కనిపించింది. మోదీ వేదిక మీదకు వచ్చిన తరువాత పవన్, బాబు ప్రసంగించారు. దీన్ని గమనించిన చంద్రబాబు అండ్ టీం పరువు కాపాడుకోవడానికి తమకు తెలిసిన టక్కుటమార విద్యలను ప్రదర్శించారు. ఖాళీ కుర్చీల నుంచి మోదీ దృష్టి మళ్లించేందుకు సభలో టీడీపీ కార్యకర్తలతో గందరగోళం సృష్టించి జనం భారీగా వచ్చారన్న భ్రమలు కల్పించే ప్రయత్నం చేశారు. ముందు ఉన్న కార్యకర్తలు స్టేజ్ వద్దకు దూసుకువస్తున్నట్టు ప్రయత్నించారు. సౌండ్ బాక్స్ టవర్లను సైతం ఎక్కి హడావుడి చేశారు. పవన్ మాట్లాడుతున్న సమయంలో చాలా మంది మైక్ టవర్స్, లైటింగ్ కోసం కట్టిన టవర్లపై ఎక్కడాన్ని మోదీ గమనించారు. పవన్‌ను ఆపి మోదీ మాట్లాడారు. ఏదైనా జరగరానిది జరిగితే ఇబ్బందులు ఎదురౌతాయని, దయచేసి దిగాలంటూ విజ్ఞప్తి చేశారు. ఎవరూ వాటిపై ఎక్కకుండా చూడాలని పోలీసులను కోరారు. ప్రధాని గట్టిగా హెచ్చరించడంతో టీడీపీ కార్యకర్తలు టవర్ల పైనుంచి కిందికి దిగారు.

మొరాయించిన మైకులు.. ప్రధాని అసహనం

ప్రధాని మోదీ మాట్లాడుతుండగా మైకులు పదే పదే మొరాయించడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. జనం రాకపోవడాన్ని కవర్ చేయడంలో భాగంగా చంద్రబాబు తన కార్యకర్తలతో చేయిస్తున్న హడావుడిలో భాగంగా వారంతా సౌండ్ సిస్టం వద్దకు దూసుకుపోయారు. వారి తాకిడితో వైర్లు, ఇతర పరికరాలు కదిలిపోయి మైకులు మొరాయించాయి. పవన్, చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో ఒకటి రెండు సార్లు అంతరాయం కలిగింది. ప్రధాని మోదీ మాట్లాడుతున్న సమయంలో తొలుత మూడు నిమిషాలు మైకులు పనిచేయలేదు. తరువాత ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా మరోసారి ఐదు నిమిషాల దాకా అంతరాయం కలిగింది. దీంతో మోదీ అసహనానికి గురయ్యారు. 'దయఉంచి అక్కడ ఉన్నవారంతా వెనక్కి వెళ్తే మైక్ పనిచేస్తుంది. సభకు అంతరాయం కలిగించవద్దు. మీ ఉత్సాహం, మీ జోష్ నాకు ఇష్టమే. కానీ మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. దూరంగా ఉన్న వారు ప్రశాంతంగా ఉన్నారు. మీరెందుకు హడావిడి చేస్తున్నారు' అంటూ మోదీ చిరాకు పడ్డారు.

తొలి మీటింగే ఫెయిలవడంతో...

బీజేపీతో పొత్తు కుదరడంతో టీడీపీ నిర్వహించిన తొలి సభ విఫలమవడంతో టీడీపీ, జనసేన కేడర్ నైరాశ్యంలోకి వెళ్లింది. గట్టిగా ఓ మీటింగ్ నిర్వహించలేకపోతున్నాం, ఇదేమి ఖర్మ అంటూ టీడీపీ కార్యకర్తలు అక్కడే వ్యాఖ్యానించారు. మరోవైపు సభలో సామాన్య ప్రజలు కనిపించలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు మాత్రమే ఉన్నారు. చిలకలూరిపేట సమీపంలో టీడీపీ నేతల మిల్లుల్లో పనిచేసే నార్త్ ఇండియా వలస కూలీలు కూడా సభలో అధిక సంఖ్యలో కనిపించారు. మహిళలు ఈ సభకు దూరంగా ఉన్నారు. సభలో స్త్రీల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆర్టీసీ బస్సులతోపాటు నారాయణ, భాష్యం వంటి టీడీపీ అనుకూల విద్యా సంస్థల నుంచి వందలాది బస్సులు గ్రామాలకు పంపినా జనం లేక ఖాళీగానే వచ్చాయి. కొన్నింటిలో సగం మంది కూడా లేరు. ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1,000 దాకా నగదు, మందు బాటిల్, బిర్యానీ పొట్లం ఇచ్చినా సభకు రాలేదని నేతలు చిరాకుపడ్డారు. బొప్పూడి సభతో ప్రజల నాడి అర్థమవుతోందన్న భావన వారిలో నెలకొంది. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారన్న విషయం ఈ సభ ద్వారా మరోసారి రుజువైందని టీడీపీ కార్యకర్తలే సభ బయట వ్యాఖ్యానించారు.

సభా వేదికపై ప్రధానికి అవమానం

రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్డీఏ కూటమి సభకు హాజరైన ప్రధాన మంత్రి మోదీకి సభా వేదికపైనే అవమానం జరిగింది. దేశ ప్రధాని కోసం కనీసం ఒక పూల బొకే తీసుకురావాలన్న ఆలోచన 40 ఏళ్ల రాజకీయం అనుభవం, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబుకు, వందలాది పుస్తకాలు చదివానని చెప్పుకొనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రాలేదు. ప్రధాని హెలికాప్టర్ దిగి వేదిక పైకి రాగానే వట్టి చేతులతోనే ఆహ్వానం పలికారు. ఆయన కూర్చున్న తర్వాత ప్రధాని మోదీని చంద్రబాబునాయుడు సన్మానిస్తారని, పవన్ పూల బొకే ఇస్తారని వ్యాఖ్యాత చెప్పారు. దీంతో మోదీ సహా అందరూ లేచి నిల్చున్నారు. అయితే, అక్కడ శాలువా లేదు, పూల బొకే లేదు. దీంతో చంద్రబాబు, పవన్ దిక్కులు చూస్తూ నిల్చున్నారు. శాలువా కోసం అటూఇటూ చూశారు. విషయం గమనించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తాను సభ పూర్తి అయిన తర్వాత మోదీని సన్మానించేందుకు తీసుకువచ్చిన వినాయకుడి విగ్రహాన్ని బహూకరించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చంద్రబాబుకు మోదీ క్లాస్!

ఏ సభలో అయినా ఉత్సాహంగా ప్రసంగించే ప్రధాని మోదీ ఈ సభలో జనం లేకపోవడం, పదే పదే మైకులు మొరాయించడంతో కొంత కోపంగా ప్రసంగించారని బీజేపీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రధాని సభా వేదికపై ఉన్నంతసేపూ కోపంగానే ఉన్నారు. చంద్రబాబు, పవన్‌తో అంటీముట్టనట్లుగానే ఉన్నారు. మీటింగ్ జరిగిన తీరుపై ప్రధాని మోదీ చంద్రబాబుపై అసహనం వ్యక్తం చేస్తూ క్లాస్ పీకినట్టు సమాచారం. సభ జరుగుతున్నంత సేపు చంద్రబాబు, పవన్‌ల మొహాల్లోనూ ఏమాత్రం ఆనందం లేదు.


ప్రజాగళం సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు

జయహో 'బీసీ'

▶ మొదటి పేజీ తరువాయి

రగలిపోతున్నారు. అదే వైఎస్ జగన్ గత ఎన్నికలకు ముందు 2019, ఫిబ్రవరి 17న ఏలూరులో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో తమకు చెప్పిన దానికంటే అధికంగా చేస్తుండడంపై బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు చంద్రబాబును ఛీకొట్టగా.. బీసీలు కూడా తమను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అక్కున చేర్చుకున్న సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభలకు తరలివచ్చిన జనసందోహం ఇందుకు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని వారు స్పష్టంచేస్తున్నారు. మొత్తం మీద శాసనసభ, లోక్‌సభ స్థానాలు కలిపి గత ఎన్నికల కంటే ఇప్పుడు అదనంగా 11 స్థానాలను సీఎం జగన్ తమకు కేటాయించడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇచ్చిన మాటకంటే అధికంగా..

ఇక గత ఎన్నికలకు ముందు జగన్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అందులో వారికిచ్చిన మాట కంటే గత 58 నెలలుగా అధికంగానే న్యాయం చేశారు. ఉదా..

- గత ఎన్నికల్లో 41 శాసనసభ స్థానాలు, ఏడు లోక్‌సభ స్థానాల్లో బీసీ వర్గాల అభ్యర్థులను బరిలోకి దించిన జగన్.. అధికారంలోకి వచ్చాక కేబినెట్‌లో ఆ వర్గాలకు చెందిన 11 మందికి మంత్రి పదవులిచ్చారు. ఒకరిని డిప్యూటీ సీఎంగా నియమించడంతోపాటు ప్రధానమైన రెవెన్యూ, విద్యా, పౌరసరఫరాలు, వైద్యం, ఆరోగ్యం లాంటి ప్రధానమైన శాఖలను ఆ వర్గాలకే అప్పగించి పరిపాలనలో వారికి సముచిత భాగస్వామ్యం కల్పించారు.
- శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశమిచ్చారు.
- ఈ వర్గాలకే చెందిన నలుగురిని రాజ్యసభకు పంపిన సీఎం జగన్ శాసనమండలిలో సైతం సింహభాగం పదవులు వారికే ఇచ్చారు.
- ఇక స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి దక్కిన 13 జెడ్పీ చైర్మన్ పదవులకుగాను 6 బీసీలకే ఇచ్చారు. 84 మున్సిపల్ చైర్మన్ పదవులకుగానూ 44 వారికే కేటాయించారు. 14 కార్పొరేషన్ల మేయర్ పదవులకుగానూ 9 బీసీలకే దక్కేలా చేశారు.
- అలాగే, నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు కేటాయించేలా చట్టం చేసి మరీ ఇచ్చారు.

అవమానించి, అవహేళన చేసిన బాబు..

నిజానికి.. రాష్ట్ర విభజనకు ముందు 2012, జూలై 9న చంద్రబాబు బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. 2014 ఎన్నికల్లో 100 అసెంబ్లీ స్థానాల్లో టికెట్లు ఇస్తామని.. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఏటా రూ.పది వేల కోట్లు చొప్పున కేటాయిస్తామని.. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలను మాఫీ చేస్తానని అందులో ప్రకటించారు. కానీ.. 2014 ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనే బీసీలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వారి సబ్‌ప్లాన్‌కు పాతరేశారు. అలాగే, ఐదేళ్లలో బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.50 వేల కోట్ల వరకు ఆ వర్గాల సంక్షేమం కోసం ఖర్చుచేస్తానని హామీ ఇచ్చి.. అందులో సగం కూడా ఖర్చుచేయలేదు. పైగా.. మంత్రివర్గంలో వారికి సముచిత స్థానం కల్పించని చంద్రబాబు.. 2014–19 మధ్య ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. అంతేకాక.. న్యాయమూర్తులుగా బీసీలు పనికిరారంటూ వారిని అవహేళన చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేయాలని అడిగిన బీసీలను తాటతీస్తా.. తోకలు కత్తిరిస్తానంటూ బెదిరించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో తమపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్న చంద్రబాబు.. ఇప్పటిదాకా ఖరారు చేసిన 128 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 24 స్థానాలనే తమకు కేటాయించడంపై బీసీలు భగ్గుమంటున్నారు.

విధేయతకే 'నామినేటెడ్'!

- పార్టీలో చాలా కాలం నుంచి ఉన్న వారికి కాంగ్రెస్ పెద్దపీట..
- 13 మంది బీసీలు, ఒక ఎస్సీ, ముగ్గురు ఎస్టీలు, ముగ్గురు మైనార్టీలు, 17 మంది ఓసీలకు చాన్స్
- పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు 8 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు
- ఇద్దరు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఒక మాజీ ఎమ్మెల్యేకు కూడా అవకాశం


పటేల్ రమేశ్‌రెడ్డి


శివసేనారెడ్డి


నేరెళ్ల శారద


నిర్మలా జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పదవుల పందేరంలో కాంగ్రెస్ పార్టీ విధేయతకే పెద్దపీట వేసింది. పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన, దీర్ఘకాలం నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారిని కార్పొరేషన్ల చైర్మన్ పదవులకు ఎంపిక చేసింది. మొత్తం 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా.. అందులో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యత ఇచ్చింది. 13 మంది బీసీలకు అవకాశమివ్వగా.. అందులో మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ, యాదవ, ముదిరాజ్‌లతోపాటు అత్యంత వెనుకబడిన కులాల జాబితాలో ఉన్న వడ్డెరలు, తక్కువ సంఖ్యలో ఉండే లింగాయత్‌లు, పెరిక సామాజిక వర్గాలకు కూడా చాన్స్ దొరికింది. ఓసీల్లో రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ వర్గాలన్నింటికీ ప్రాతినిధ్యం దక్కింది. ఇక ముగ్గురు ఎస్టీలు, ఒక ఎస్సీ, మరో ముగ్గురు మైనార్టీలను కార్పొరేషన్ చైర్మన్లుగా ఎంపిక చేశారు.

అనుబంధ సంఘాలకు ప్రాధాన్యం

పార్టీ అనుబంధ సంఘాలకు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తున్న ఎనిమిది మందిని నామినేటెడ్ పదవులు వరించాయి. పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్‌లతోపాటు కిసాన్‌సెల్, ఫిషర్‌మెన్ సెల్, యూత్ కాంగ్రెస్, వికలాంగ విభాగం, సోషల్ మీడియా కమిటీల రాష్ట్ర అధ్యక్షులను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించి దక్కనివారికి.. లోక్‌సభ టికెట్లు ఆశిస్తున్నా దక్కే అవకాశం లేనివారికి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. పటేల్ రమేశ్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాలరాజు, జగదీశ్వర్‌రావు, జంగా రాఘవరెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, ఇనుగాల వెంకట్రామిరెడ్డి తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. వీరికితోడు మహిళా నేతల కోటాలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాతలకు చాన్స్ దక్కింది. నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డిలను కూడా నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేశారు.

జగ్గారెడ్డి సతీమణికి కీలక పోస్టు

తొలి విడత భర్తీ చేసిన నామినేటెడ్ పదవులలో.. కొందరు నేతలకు కీలక కార్పొరేషన్ల బాధ్యతలు అప్పగించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి సతీమణి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డిని కీలకమైన తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్‌గా నియమించారు. ఇక సూర్యాపేట అసెంబ్లీ, నల్లగొండ ఎంపీ టికెట్ ఆశించిన పటేల్ రమేశ్‌రెడ్డికి పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్.. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. మన్నె సతీశ్‌రెడ్డికి తెలంగాణ టెక్నాలజికల్ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. ఎండీ రియాజ్‌కు గ్రంథాలయ పరిషత్.. ఎంఏ ఫహీమ్‌కు తెలంగాణ ఫుడ్స్.. కొల్లాపూర్‌కు చెందిన సీహెచ్ జగదీశ్వర్‌రావుకు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. నేరెళ్ల శారదకు మహిళా కమిషన్.. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ తదితర కీలక పోస్టులు అప్పగించారు. ఇక పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు వారి సామాజిక వర్గాల వారీగా చైర్మన్ పదవులు కేటాయించగా.. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు అప్పగించారు.


క్లుప్తంగా...

ఆలయాలను సందర్శించిన హైకోర్టు సీజే దంపతులు



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, ములుగు జిల్లా రామప్ప దేవాలయం, ములుగులోని గట్టమ్మ ఆలయాలను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే దంపతులతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వర్‌రావు ఆదివారం సందర్శించారు. వారికి ఆయా ఆలయాల అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

బీసీలకు అత్యధిక సీట్లివ్వండి



సాక్షి, హైదరాబాద్: వచ్చే తెలంగాణ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం 8 సీట్లను బీసీలకు కేటాయించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 శాతం పైబిలుకు బీసీ జనాభా ఉన్న నిజామాబాద్, కరీంనగర్, మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్, నల్లగొండ, భువనగిరి, మహబూబ్ నగర్, చేవెళ్ల స్థానాలను బీసీలకు కేటాయించి.. ఉదయపూర్‌లో కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పొరేషన్ పదవుల్లో.. కేవలం 13 కార్పొరేషన్లలో బీసీలకు అవకాశమివ్వడం ఒకింత విస్మయానికి గురిచేసిందన్నారు.

మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి

తెలంగాణ గోపాలమిత్ర అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా గ్రామీణ పాడి రైతాంగానికి సేవలందిస్తోన్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర సర్వీసెస్ అసోసియేషన్ (టీఎస్‌జీఎంఎస్ఏ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ అధ్యక్షతన మాసాబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం వెంటనే తమకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో తమ బతుకుల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు.

ఏపీలో జగన్ పార్టీ, కాంగ్రెస్ ఒక్కటే

▶ మొదటి పేజీ తరువాయి

సంకల్పించాని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించడాన్ని మరో సంకల్పంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఎన్డీఏని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధికి పునాది వేస్తామని, మహిళలు, యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తామని, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, పోర్టుల అభివృద్ధి, నీలి విప్లవానికి అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. శనివారం లోక్‌సభ ఎన్నికల నగారా మోగితే వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నానని, కోటప్పకొండ నుంచి త్రిమూర్తుల ఆశీర్వాదం ఎన్డీఏకి దొరుకుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసారి ఎన్నికల ఫలితాలు జూన్ నాలుగున వస్తున్నాయని, ఎన్డీఏకి నాలుగు వందల పైచిలుకు సీట్లు రావాలని అన్నారు. అభివృద్ధి చెందిన ఏపీ కావాలంటే ఇక్కడ ఎన్డీఏ గెలవాలని, ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ ప్రగతిని ఎన్డీఏ సమన్వయం చేస్తుందని చెప్పారు.

ఇండియా కూటమిలోని పార్టీలు పరస్పరం విరుద్ధంగా పనిచేస్తుంటాయని తెలిపారు. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ కూటమి, బెంగాల్‌లో టీఎంసీ – లెఫ్ట్, పంజాబ్‌లో కాంగ్రెస్–ఆప్ పరస్పరం పోటీ పడతాయని, ఢిల్లీలో కలిసిపోతాయని విమర్శించారు. ఇండియా కూటమి ఒకరిని ఒకరు తిట్టుకుంటూనే వారి స్వార్థ ప్రయోజనాల కోసం కూటమిగా ఏర్పడ్డారన్నారు. ఏపీలో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ప్రజల కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ చేరికతో ఎన్డీఏ బలపడిందని అన్నారు. దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల గురించి ఆలోచిస్తుందని, వారి కోసమే పని చేస్తుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో ఐదు వేల ఇళ్లు ఇచ్చామని, జల జీవన్ మిషన్ పథకం కింద కోటి ఇళ్లకు నీరు ఇచ్చామని, ఆయుష్మాన్ భారత్‌తో ఏపీలో కోటీ ఇరవై ఐదు లక్షల మందికి లబ్ధి చేకూరిందని, కిసాన్ సమ్మాన్ నిధితో పల్నాడు ప్రజలకు రూ.700 కోట్లిచ్చామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, తిరుపతిలో ఐఐటీ, ఐసర్, విశాఖలో ఐఐఎం, ఐఐపీఈ, విజయనగరం జిల్లాలో గిరిజన వర్సిటీ, మంగళగిరిలో ఎయిమ్స్ స్థాపించామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వేధింపులకు గురైన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వెండి నాణెం విడుదల చేశామని, పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించామని చెప్పారు.

రాష్ట్రంలో ప్రజల జీవితాలు నాశనం అయ్యాయి : చంద్రబాబు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లలో విధ్వంస, అహంకార పాలనతో ప్రజల జీవితాలు నాశనం అయ్యాయన్నారు. ప్రజల గుండె చప్పుడు బలంగా వినిపించడానికే మూడు పార్టీలు జట్టు కట్టాయని, రాబోయే ఎన్నికల్లో మీరు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. మా జెండాలు వేరు అయినా అజెండా ఒక్కటేనని అన్నారు. గడచిన ఐదేళ్లలో బంగారం లాంటి రాష్ట్రాన్ని జగన్ చీకటిమయం చేశారని, గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ కేసులు పెట్టి రాజకీయాలను కలుషితం చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించిన వారిని అణిచివేశారని ఆరోపించారు. జగన్ అధికార దాహానికి బాబాయ్ బలయ్యారని, ఇద్దరు చెల్లెళ్లు రోడ్డెక్కి జగన్‌కు ఓటు వేయొద్దని చెబుతున్నారంటే.. ఏపీ ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.

ఎన్డీఏ పునఃకలయిక 5 కోట్ల మందికి ఆనందాన్ని ఇచ్చింది: పవన్

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నామని అన్నారు. ఎన్డీఏ పునఃకలయిక ఐదు కోట్ల మందికి ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఒక సారా వ్యాపారిగా మారారని, దేశమంతా డిజిటల్ ట్రాన్సాక్షన్ చేస్తుంటే.. ఏపీలోని మద్యం షాపుల్లో మాత్రమే నగదు చలామణి చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. వేల సంఖ్యలో మహిళలు, యువత కనిపించకుండా పోయినప్పటికీ ఈ ప్రభుత్వం ఏమీ చేయలేక పోయిందన్నారు. గంజాయి, డ్రగ్ క్యాపిటల్‌గా ఏపీ మారిపోయిందన్నారు. అయోధ్యలో రామాలయం కట్టిన మోదీకి రాష్ట్రాన్ని రావణ కాష్టం చేసిన చిటికన వేలంత రావణాసురుడిని తీసేయడం కష్టం కాదని, ద్వారక నుంచి వచ్చిన మోదీ ఎన్నికల కురుక్షేత్రంలో పాంచజన్యం పూరిస్తారని అన్నారు.

అన్నింటా 'అతి'బాబు

ఐదేళ్ల క్రితం


మోదీ వల్ల దేశం సర్వ నాశనమైపోయింది. మోదీ ఒక టెర్రరిస్టు. ఆయనకు భార్య లేదు. తల్లిపై గౌరవం లేదు. మోదీ వల్ల దేశంలో ఎవరికీ ఉపయోగం లేదు.

ఆదివారం

మోదీ భారతదేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్న ఒక శక్తి. మోదీ అంటే అభివృద్ధి. మోదీ అంటే సంస్కరణ. మోదీ అంటే భవిష్యత్తు.

నాడు తిట్లు.. నేడు పొగడ్తలు

- ఐదేళ్లక్రితం ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు
- ఆయనో టెర్రరిస్టు అని, దేశాన్ని సర్వ నాశనం చేశారని తిట్లు
- నేడు అవసరార్థం మోదీ ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగడ్తలు
- మోదీజీ గారూ.. అంటూ అతి వినయం
- కేవలం కేసుల భయంతోనే మోదీని పొగిడిన బాబు
- వేదికపై చంద్రబాబు, పవన్‌ని పెద్దగా పట్టించుకోని మోదీ
- కనీస గౌరవం ఇవ్వకుండా ఇద్దరినీ ఏకవచనంతో సంబోధించిన ప్రధాని


ప్రధాని మోదీ ప్రజలకు నమస్కరిస్తుండగా.. మోదీకి నమస్కరిస్తున్న చంద్రబాబు

ఈ మాటలు మాట్లాడిన నాలుక ఒక్కటే. మడతపడిందంతే.. ఇంతలా మడతపడే నాలుక ఉన్నది చంద్రబాబు ఒక్కరికే అని ఆదివారం జరిగిన బొప్పూడి సభలో మరోసారి నిరూపితమైంది.

ఆనాడు మోదీని నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు.. నేడు తన అవసరార్థం అదే నోటితో మోదీని ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగడ్తల్లో ముంచెత్తారు. మోదీజీ అని పిలిస్తే సరిపోయేదానికి మోదీజీ గారూ అంటూ గారూ అన్న పదాన్ని అదనంగా చేర్చి చంద్రబాబు ప్రదర్శించిన అతి వినయం, ఆయన్ని పొగిడేందుకు పడిన తాపత్రయాన్ని చూసి ప్రజలతో పాటు టీడీపీ శ్రేణులు కూడా ముక్కున వేలేసుకున్నాయి. మోదీ ప్రపంచం మెచ్చిన మేలైన నాయకుడంటూ పొగుడుతూ సాగిలపడిపోవడం చూసి చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చనే సెటైర్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ఉపయోగం లేదని గతంలో దుమ్మెత్తి పోసిన విషయాన్ని జనం మరచిపోయారనుకుని, ఇప్పుడు ఆ రెండింటి వల్ల దేశ ఆర్థిక ముఖ చిత్రం మారిపోయిందని, మార్చిన వ్యక్తి మోదీ అంటూ మాట మార్చేశారు. తాను ఏం చెప్పినా ప్రజలను నమ్ముతారనే రీతిలో బాబు మాట్లాడారు. మధ్యలో బీజేపీ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదాన్ని హిందీలో చెప్పి మోదీని ఆకర్షించేందుకు ప్రయత్నించారు. ఇంత వంగిపోయి మరీ ప్రధానిని పొగడ్డం వెనుక కారణం చంద్రబాబును వెంటాడుతున్న కేసులే. తనపై ఉన్న కేసులను ఎక్కడ తిరగదోడతారో, ఎక్కడ జైల్లో పెడతారో, ఎక్కడ తన అవినీతి చరిత్రను పెకలిస్తారో అనే భయంతోనే మోదీ కరుణ కోసం చంద్రబాబు పాకులాడారు.

పెద్దగా పట్టించుకోని మోదీ.. గౌరవం కోల్పోయిన బాబు

ఎంత భజన చేసినా ప్రధాని మోదీ మాత్రం చంద్రబాబును పెద్దగా పట్టించుకోలేదు. పక్కనే కూర్చున్నా మొక్కుబడి మాటలు తప్ప చిరునవ్వుతో ఆప్యాయంగా మాట్లాడేందుకు ఆయన ఇష్టపడలేదు. పిలుపులోనూ గతంలో ఇచ్చిన గౌరవాన్ని ప్రధాని మోదీ ఇప్పుడు చంద్రబాబుకు ఇవ్వలేదు. చంద్రబాబునాయుడు జీ అంటూ గతంలో మోదీ ఆయన్ని సభల్లో సంబోధించేవారు. బొప్పూడి సభలో చంద్రబాబునాయుడు అంటూ ఏకవచనంతో సంబోధించడం ద్వారా ఆయనపై తనకున్న భావాన్ని వ్యక్తం చేశారు. దీన్నిబట్టి చంద్రబాబు తన గౌరవాన్ని కోల్పోయినట్లు కనపడింది. రెండు రోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చంద్రబాబు గురించి చులకనగా మాట్లాడిన విషయం తెలిసిందే. గతంలో మోదీని టెర్రరిస్టు అని ఎన్డీఏ నుంచి వెళ్లిపోయిన చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని మళ్లీ తిరిగి వచ్చారని, స్వాగతించామని అమిత్‌షా ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అంటే చంద్రబాబు కాళ్లావేళ్లా పడటంవల్ల కూటమిలోకి రానిచ్చినట్లు చెప్పకనే చెప్పారు. బొప్పూడి సభలో చంద్రబాబు పట్ల మోదీ కూడా అలాగే వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపించింది. కేసుల భయం, రాజకీయ అవసరార్థం వచ్చిన బాబుతో ఆయన కూడా అంతే రాజకీయంగా వ్యవహరించి, బాబు పట్ల తమకు ఏమాత్రం గౌరవం లేదని చూపించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను కూడా మోదీ అసలు పట్టించుకోలేదు. అందరితో సమానంగా నమస్కారం పెట్టడమే తప్ప ఆయనకు గౌరవం కూడా ఇవ్వలేదు. తన ప్రసంగంలో పవన్ కళ్యాణ్ అని ఏకవచనంతోనే సంబోధించారు. బొప్పూడి ప్రజాగళం సభలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి కలయిక అంతా మొక్కుబడి తంతుగానే కనిపించింది.


– సాక్షి, అమరావతి

పోలీసు కస్టడీకి ప్రణీత్ రావు



సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరోలో (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేసినప్పుడు నమ్మక ద్రోహానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టయిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును పంజగుట్ట పోలీసులు ఆదివారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఎస్ఐబీ కార్యాలయంలో ప్రణీత్‌రావు పనిచేస్తుండగా చోటుచేసుకున్న అవకతవకలు, అక్రమాలు వెలుగులోకి రావాలంటే ఆయనను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు విచారించింది. పోలీసుల వాదనతో ఏకీభవిస్తూ వారం రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో పంజగుట్ట అధికారులు చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ప్రణీత్‌రావును ఆదివారం తమ కస్టడీలోకి తీసుకున్నారు.

బీసీలకు పదిస్థానాలు కేటాయించాలి: ఆర్.కృష్ణయ్య



రామన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పది ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం లోని ఇంద్రపాలనగరంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలు చైతన్యవంతులై రాజ్యాధికారం దక్కించుకున్నప్పుడే అన్ని రంగాల్లో ముందుకు పోగలరని చెప్పారు. బీసీలను విస్మరించే పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు.

అరుణాచల్, సిక్కిం ఓట్ల లెక్కింపు జూన్ 2నే

సాక్షి, న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీని మార్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. శనివారం ప్రకటించిన విధంగా జూన్ 4న జరగాల్సిన కౌంటింగ్‌ను రెండు రోజులు ముందుకు జూన్ 2కు మార్చినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు రాష్ట్రాల శాసనసభల పదవీ కాలం జూన్ 2తో ముగుస్తున్న నేపథ్యంలో అదే రోజు కౌంటింగ్ చేపట్టనున్నట్లు వివరించింది. అరుణాచల్, సిక్కిం రాష్ట్రాల్లో ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 19వ తేదీనే పోలింగ్ ఉంటుందని స్పష్టం చేసింది.

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ దత్తాత్రేయ హోసబలె

నాగ్‌పూర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి(సర్‌కార్యవాహ)గా దత్తాత్రేయ హోసబలె మరోసారి ఎన్నికయ్యారు. నాగ్‌పూర్‌లో జరుగుతున్న అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశాల్లో ఆదివారం ఆయన్ను 2024–2027 కాలానికి గాను ఈ పదవికి ఎన్నుకున్నారు. సర్‌కార్యవాహ పదవిలో 2021 నుంచి దత్తాత్రేయ హోసబలె కొనసాగుతున్నారు.

18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం

అహ్మదాబాద్: పాకిస్తాన్‌లో మతపరమైన వివక్ష, పీడనను తాళలేక సరిహద్దులకు సమీపంలోని గుజరాత్‌లో ఆశ్రయం పొందుతున్న 18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం లభించింది. అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వీరికి రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అహ్మదాబాద్ జిల్లా ఇప్పటి వరకు 1,167 మంది హిందువులకు పౌరసత్వం లభించినట్లు ఆయన తెలిపారు. ఇటీవల కేంద్రం అమల్లోకి తెచ్చిన సీఏఏ చట్టం ప్రకారం ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం మంజూరు చేసే అధికారం అహ్మదాబాద్, గాంధీనగర్, కచ్ జిల్లాల కలెక్టర్లకు కల్పిస్తూ ప్రభుత్వం గజెట్ జారీ చేసింది.

సీఏఏపై స్టే కోరుతూ సుప్రీంకు కేరళ సర్కారు


న్యూఢిల్లీ: వివక్షాపూరితం, ఏకపక్షం, లౌకికతత్వానికి విరుద్ధంగా ఉన్న పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)అమలుపై స్టే ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మన దేశంతో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటున్న శ్రీలంక, మయన్మార్, భూటాన్ తదితర దేశాల నుంచి వలస వచ్చిన వారి పట్ల వివక్ష చూపేలా ఉన్న సీఏఏలోని నిబంధనలు, ఉత్తర్వులకు ఏమాత్రం ప్రామాణికత లేదంటూ ఇప్పటికే కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. సీఏఏను సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లనూ కలిపి ఈ నెల 19న విచారించేందుకు సుప్రీంకోర్టు ఇప్పటికే అంగీకరించింది.

నువ్వా నేనా...!

సార్వత్రిక పోరుకు ఎన్డీఏ, ఇండియా కూటములు సై

సొంతంగా 370 సీట్లే లక్ష్యంగా బీజేపీ ● 267 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి దూకుడు

కూటమికి పార్టీల ఝలక్‌తో కాంగ్రెస్ కుదేలు ● జారుకున్న జేడీ(యూ), చెయ్యిచ్చిన తృణమూల్



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల నగారా మోగింది. సార్వత్రిక సమరానికి సర్వం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల్లో హోరాహోరీ తలపడేందుకు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ), కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్ (ఇండియా) సిద్ధమయ్యాయి. వరుసగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు బీజేపీ, ఆ పార్టీని ఈసారి ఎలాగైనా మట్టికరిపించాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉన్నాయి. పేదలు, మహిళలు, రైతులు, యువతను లక్ష్యంగా చేసుకుని హామీల వర్షం కురిపిస్తున్నాయి. సొంతంగా 370కి పైగా స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్న అధికార బీజేపీ ఇప్పటికే ఏకంగా 267 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి దూకుడు మీదుంది. ఇంకా కూటమి లెక్కలు తేలక కాంగ్రెస్ సతమతమవుతోంది. హోరాహోరీ పోరులో ఏ కూటమి నెగ్గేదీ తెలియాలంటే జూన్ 4న వరకు వేచి చూడాల్సిందే...

అయోధ్యలో రామమందిర నిర్మాణం అనంతరం కదనోత్సాహంతో ఉన్న కమలదళం ఈ ఎన్నికల్లో భారీ లక్ష్యాలే నిర్ణయించుకుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 282 సీట్లు సాధించి 2019లో 303కు ఎగబాకిన బీజేపీ ఇప్పుడు ఏకంగా 370కి పైగా సీట్ల సాధనే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్డీఏ పక్షాలతో కలిపి 400లకు పైగా సీట్లు సాధించాలని భావిస్తోంది. ఎన్డీఏకు ప్రస్తుతం 335 మంది ఎంపీలుండగా వీరిలో బీజేపీ సొంత బలమే 290 (మిగతా ఎంపీలు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగి రాజీనామా చేశారు). ఇక కాంగ్రెస్ 2019 ఎన్నికల్లో కేవలం 52 సీట్లకు పరిమితమైంది. ప్రస్తుతం ఇండియా కూటమిలో ఉన్న పక్షాలన్నీ కలిపి 2019లో 144 సీట్లు మాత్రమే సాధించాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీఏకి 40 శాతం, ఇండియా కూటమికి 35 శాతం ఓట్లొచ్చాయి. ఎన్డీఏకు ఈసారి ఏకంగా 50 శాతానికి పైగా ఓట్ల సాధనే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఉత్తరాదిలోని అన్ని రాష్ట్రాలను చుట్టేశారు. దక్షిణాదిన కూడా దాదాపు అన్నిచోట్ల పర్యటించారు.

అసెంబ్లీలవారీగా కూటముల బలాబలాలు...

- దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఎన్డీఏ పార్టీలు 18 రాష్ట్రాల్లో, ఇండియా కూటమి పార్టీలు 10 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి.
- మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేల్లో 1,791 మంది ఎన్డీయే కూటమికి చెందినవారు కాగా 1,653 మంది ఇండియా కూటమికి చెందినవారున్నారు.
- శాసన మండలి ఉన్న ఆరు రాష్ట్రాల్లోని మొత్తం 426 ఎమ్మెల్సీల్లో 105 మంది ఇండియాకు, 184 మంది ఎన్డీఏకు చెందినవారు.
- ఎమ్మెల్యేలపరంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రతో సహా అత్యధిక జనాభా ఉన్న చాలా రాష్ట్రాల్లో ఎన్డీఏది ఆధిపత్యం. కాగా పశ్చిమబెంగాల్, కర్నాటక, కేరళ, తమిళనాడు, పంజాబ్‌ల్లో ఇండియా కూటమిది పైచేయి.
- 2023–24 మధ్య తొమ్మిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఐదుచోట్ల ప్రభుత్వం మారింది. నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ, రెండింట కాంగ్రెస్ నెగ్గాయి. మిగతా మూడు రాష్ట్రాలను ప్రాంతీయ పార్టీలు చేజిక్కించుకున్నాయి.

బీజేపీ లక్ష్యం 370 ప్లస్

ఎన్డీఏ భాగస్వాములతో సీట్ల పంపకాలను బీజేపీ శరవేగంగా తేల్చేస్తోంది...

- అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో 80 లోక్‌సభ స్థానాలకు 2019లో 62 సీట్లు బీజేపీ సాధించిన ఈసారి 70 దాటాలని టార్గెట్ పెట్టుకుంది. మిత్రపక్షాల్లో అప్నాదళ్ (ఎస్)కు 5 సీట్లు, నిషాద్ పార్టీకి ఒకట్రెండు కేటాయించవచ్చు. ఎస్‌బీఎస్‌పీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ఐదు సీట్లు డిమాండ్ చేస్తున్నారు.
- మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను 26 చోట్ల బీజేపీ పోటీ చేస్తుందని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. అయితే సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, ఎన్సీపీ (అజిత్)తో కలిసి పోటీ చేయనున్న నేపథ్యంలో సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది.
- 40 స్థానాలున్న బిహార్‌లో కనీసం 25 సీట్లులో పోటీ చేయనుంది. మిగతా స్థానాలను జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ, ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్ జనతాదళ్, హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్)లకు కేటాయించే అవకాశముంది.
- 28 లోక్‌సభ స్థానాలున్న కర్ణాటకలో కొత్త మిత్రుడు జేడీ(ఎస్)కు 3 స్థానాలిచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అక్కడ 2019 ఎన్నికల్లో 25 స్థానాలు చేజిక్కించుకున్న బీజేపీ ఈసారి వాటిని నిలబెట్టుకోవాలని చూస్తోంది.
- అస్సాంలో 14 స్థానాలకు గాను 11 స్థానాల్లో బీజేపీ, మిగతా చోట్ల మిత్రపక్షాలు అస్సాం గణ పరిషత్ (ఏజీపీ), యునైటెడ్ పీపుల్స్ లిబరేషన్ (యూపీపీఎల్) పోటీ చేస్తారు.

2019లో ఇలా...

2014లో బీజేపీకి సొంతంగా 282 సీట్లు రాగా 2019 నాటికి 303కు పెరిగాయి. 2019 ఎన్నికల్లో హిందీ రాష్ట్రాలను చాలావరకు క్లీన్‌స్వీప్ చేసింది. 2019లో 31 శాతం ఓట్లు సాధించగా 2019లో 37.4కు పెంచుకుంది. 2019లో ప్రభుత్వ ఏర్పాటు సమయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు 353 ఎంపీల మద్దతుంది. కూటమి మొత్తం 40 శాతం ఓట్లు సాధించింది.

ఎన్డీఏ కూటమి బలం

బీజేపీ	290
జేడీ(యూ)	16
శివసేన	13
ఆర్ఎల్‌జేపీ	5
ఇతరులు	11

లెక్కలు తేలక 'హస్త'వ్యస్తం...

ఈసారి బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించే లక్ష్యంతో భాగస్వాములతో కాంగ్రెస్ పొత్తు కసరత్తులు చేస్తోంది. ఒంటరిగా పోటీ చేసే రాష్ట్రాలు, మిత్రపక్షాలతో కలిసి ముందుకు సాగాల్సిన రాష్ట్రాలపై పీసీసీల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అంతర్గత నిర్ణయం మేరకు కర్ణాటక (28), గుజరాత్ (26), రాజస్థాన్ (25), ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17), అస్సాం (14), ఛత్తీస్‌గఢ్ (11), హరియాణా (10), అరుణాచల్‌ప్రదేశ్ (2)ల్లో కాంగ్రెస్ ఒంటరి పోటీ చేయనుందని సమాచారం...

- యూపీలో కనీసం 50 స్థానాల్లో పోటీ చేయాలని భావించినా చివరికి 17 స్థానాలకే పరిమితమవుతోంది. మిగతా చోట్ల ఇండియా కూటమి భాగస్వామి సమాజ్‌వాదీ పార్టీ పోటీ చేయనుంది.
- మహారాష్ట్రలో కనీసం 18 సీట్లలో బరిలో దిగాలని కాంగ్రెస్ భావిస్తోంది. మిగతా వాటిని మిత్రపక్షాలు ఎన్సీపీ (శరద్), శివసేన (యూబీటీ)లకు కేటాయించనుంది.
- పశ్చిమబెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో మొత్తం 42 స్థానాల్లోనూ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేయనుంది.
- బిహార్‌లో జేడీ(యూ) జారుకోవడంతో కనీసం 25 చోట్ల పోటీ చేయాలని భావిస్తున్నా చివరికి 15 స్థానాలకే పరిమితమయ్యేలా ఉంది. మిత్రపక్షం ఆర్జేడీ మాత్రం 7 నుంచి 9 సీట్ల కంటే ఇచ్చేది లేదంటోంది!
- తమిళనాట డీఎంకేతో పొత్తున్నా కాంగ్రెస్‌కు రెండుకు మించి సీట్లు దక్కడం కష్టమే.
- జార్ఖండ్‌లోని ఏడు చోట్ల పోటీ చేసి జేఎంఎంకు 4, ఇతర పక్షాలకు 3 ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయి.
- కేరళలో 20 స్థానాల్లో 16 చోట్ల పోటీ చేసి వామపక్షాలకు 4 ఇవ్వనుంది.
- పంజాబ్‌లో ఆప్‌తో పొత్తు కుదరకపోవడం, అకాలీదళ్ కూడా దూరమవడంతో మొత్తం 13 సీట్లలోనూ కాంగ్రెస్ పోటీ చేయనుంది.
- ఢిల్లీలో మాత్రం నాలుగు చోట్ల ఆప్, మూడుచోట్ల కాంగ్రెస్ బరిలో దిగనున్నాయి.

2019లో ఇలా...

ప్రస్తుత ఇండియా కూటమి 2009 లోక్‌సభ ఎన్నికల్లో 40 శాతం ఓట్లతో 347 సీట్లు గెలుచుకుంది. 2014 ఎన్నికల్లో ఓట్ల శాతం 42 శాతానికి పెరిగినప్పటికీ 161 సీట్లకే పరిమితమైంది. బీజేపీ, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల మధ్య త్రిముఖ పోటీయే ఇందుకు ప్రధాన కారణం. ఇక 2019 ఎన్నికల్లో ఇండియా కూటమి 38 శాతం ఓట్లకు, కేవలం 144 సీట్లకు పడిపోయింది.

ఇండియా కూటమి బలం

కాంగ్రెస్	48
డీఎంకే	24
టీఎంసీ	22
శివసేన (యూబీటీ)	6
ఎన్సీపీ (శరద్)	4
ఇతరులు	19

బాండ్లతో బీజేపీకి రూ.6,986 కోట్లు

తృణమూల్‌కు రూ.1,397 కోట్లు ● వెబ్‌సైట్‌లో పొందుపరచిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లతో అధికార బీజేపీ అత్యధికంగా లబ్ధి పొందినట్లు వెల్లడయ్యింది. కమలం పార్టీకి ఈ బాండ్ల ద్వారా ఏకంగా రూ.6,986.5 కోట్లు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలియజేసింది. ఎన్నికల బాండ్లపై పార్టీలు గత నవంబర్‌లో ఇచ్చిన సమాచారాన్ని ఆదివారం తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.1,397 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.1,334 కోట్లు, భారత రాష్ట్ర సమితికి రూ.1,322 కోట్లు, బిజూ జనతాదళ్‌కు రూ.944.5 కోట్లు, డీఎంకేకు రూ.656.5 కోట్లు బాండ్ల రూపంలో అందినట్లు ఈసీ డేటాను బట్టి తెలుస్తోంది. బాండ్ల కొనుగోలుదార్లలో ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ సంస్థ అధినేత, లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ అగ్రస్థానంలో నిలిచాడు. రూ.1,368 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాడు. ఇందులో 37 శాతానికి పైగా, అంటే రూ.509 కోట్లను డీఎంకేకు అందజేశాడు. డీఎంకేకు మేఘా ఇంజనీరింగ్ రూ.105 కోట్లు, ఇండియా సిమెంట్స్ రూ.14 కోట్లు, సన్ టీవీ నెట్‌వర్క్ రూ.100 కోట్లు సమర్పించుకున్నాయి. అన్నాడీఎంకేకు ఇండియా సిమెంట్స్ యాజమాన్యంలోని ఐపీఎల్ టీం చెన్నై సూపర్ కింగ్స్; జేడీ(ఎస్)కు ఆదిత్య బిర్లా గ్రూప్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, మేఘా ఇంజనీరింగ్, ఎంబసీ గ్రూప్; ఆప్‌కు బజాజ్, కేఎంజెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎస్‌జేకే, బీజీ షిర్కే, టొరెంట్ ఫార్మా; జేడీ(యూ)కు భారతీ ఎయిర్‌టెల్, శ్రీ సిమెంట్స్; ఎన్సీపీకి నియోటియా ఫౌండేషన్, భారతీ ఎయిర్‌టెల్, సైరస్‌పూనావాలా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఒబెరాయ్ రియాల్టీ తదితర సంస్థలు విరాళాలిచ్చాయి. బాండ్ల రూపంలో తమకు ఏయే సంస్థ/వ్యక్తుల నుంచి ఎంతెంత విరాళాలు వచ్చాయో బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ఈసీకి తెలియజేయలేదు. ఏడీఆర్ గణాంకాల ప్రకారం బీజేపీకి మొత్తం 7,700 కోట్ల విరాళాలు అందాయి. బాండ్ల ద్వారా తమకెలాంటి నిధులూ రాలేదని సీపీఎం, బీఎస్పీ, మజ్లిస్ ప్రకటించాయి.

ఈసీ డేటా ప్రకారం బాండ్ల ద్వారా అత్యధిక నిధులు అందుకున్న పార్టీలు

పార్టీ	నిధులు
బీజేపీ	రూ.6,986.5 కోట్లు
టీఎంసీ	రూ.1,397 కోట్లు
కాంగ్రెస్	రూ.1,334 కోట్లు
బీఆర్ఎస్	రూ.1,322 కోట్లు

తొలి వంద రోజులకు, వచ్చే ఐదేళ్లకు రోడ్‌మ్యాప్

మంత్రివర్గ సమావేశంలో మోదీ

న్యూఢిల్లీ: మరో రెండు నెలల్లో ఏర్పాటు కానున్న కొత్త ప్రభుత్వానికి తొలి వంద రోజుల రోడ్‌మ్యాప్‌తోపాటు రాబోయే ఐదేళ్ల రోడ్‌మ్యాప్ రూపొందించాలని మంత్రివర్గ సహచరులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. మోదీ అధ్యక్షతన ఆదివారం ఉదయం ఢిల్లీలో జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. తొలి వంద రోజుల రోడ్‌మ్యాప్, ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌ను సమర్థంగా ఎలా అమలు చేయాలన్నదానిపై నిపుణులతో, సంబంధిత శాఖల కార్యదర్శులతో సంప్రదింపులు జరపాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈసారి ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు జరిగే తేదీలను నోటిఫై చేసే ప్రక్రియను కేంద్ర కేబినెట్ ప్రారంభించింది. ఎన్నికల సంఘం ప్రతిపాదనలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు మంత్రివర్గం పంపించింది. రాష్ట్రపతి ఆమోదంతో తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 20న వెలువడనుంది. నోటిఫికేషన్ అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతాయి కాబట్టి వేర్వేరు తేదీల్లో ఏడు నోటిఫికేషన్లు జారీ చేయాల్సి ఉంది.

కేజ్రీవాల్‌కు రెండు సమన్లు

న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు వదిలేలా లేరు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆదివారం 9వసారి ఆయనకు సమన్లు పంపారు. ఈ నెల 21న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. అదేవిధంగా, ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ)లో అవకతవకలపై విచారణకు రావాలంటూ మరో నోటీసిచ్చారు. ఈ కేసులో 18న విచారణకు హాజరు కావాలని కోరారు. మద్యం విధానం కేసుకు సంబంధించి సమన్లు అన్యాయంగా పంపుతున్నారంటూ కేజ్రీవాల్ ఈడీ విచారణకు దుమ్మా కొడుతున్నారు. దీంతో, సమన్లకు ఢిల్లీ సీఎం స్పందించడం లేదంటూ ఈడీ అధికారులు ఢిల్లీ కోర్టును ఆశ్రయించడం, కేజ్రీవాల్‌కు కోర్టు శనివారం బెయిలివ్వడం తెలిసిందే. మద్యం కేసులో పలువురు ఆప్ నేతలు ఇప్పటికే జైల్లో ఉండటం తెలిసిందే.

ఈవీఎం, ఈడీ, ఐటీ

ఇవి లేకుండా మోదీ ఎన్నికల్లో నెగ్గలేడు: రాహుల్

అధికారం కోసం అర్రులు చాచే అసమర్థుడు
- భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సభలో నిప్పులు
- విపక్షాల బల ప్రదర్శన
- ఎస్పీ చీఫ్ అఖిలేశ్ డుమ్మా



ఆదివారం ముంబైలో భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సభలో ఫరూక్ అబ్దుల్లా, ఉద్ధవ్ ఠాక్రే, స్టాలిన్, రాహుల్, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్ తదితరులు

ముంబై/లఖ్‌నవూ: బీజేపీ పాలనలో దేశంలో పెచ్చరిల్లిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేషం తదితరాలను ప్రజలకు చాటిచెప్పేందుకు విధిలేని పరిస్థితుల్లో భారత్ జోడో యాత్రలు చేపట్టాల్సి వచ్చిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. జాతుల హింసతో అట్టుడికిన మణిపూర్‌లో జనవరి 14న మొదలు పెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర 63 రోజులకు ఆదివారం ముంబైలో ముగిసింది. ఈ సందర్భంగా సెంట్రల్ ముంబైలోని అంబేడ్కర్ స్మారకం చైత్యభూమిని రాహుల్ సందర్శించారు. రాజ్యాంగ ప్రవేశికను చదివి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శివాజీ పార్కులో విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో మాట్లాడారు. మోదీ ఓ అసమర్థ నేత అంటూ దుయ్యబట్టారు. ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గడం ఆయన తరం కాదన్నారు. ''మోదీ కేవలం అధికారం కోసం అర్రులు చాచే ముసుగు మనిషి. అవినీతిపై మోదీదే గుత్తాధిపత్యం. తనది 56 అంగుళాల ఛాతీ అని ఆయన చెప్పుకునే మాటలన్నీ అబద్ధాలే'' అంటూ తీవ్ర పదజాలంతో దుయ్యబట్టారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కోసం వీవీప్యాట్లను కచ్చితంగా లెక్కించాలన్న తమ డిమాండ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ సంపన్నుల కోసమైతే ఇండియా కూటమి హామీలు సామాన్యుని కోసమన్నారు. విపక్షాల బల ప్రదర్శనలో భాగంగా జోడో యాత్ర ముగింపులో ఇండియా కూటమి నేతలు పాల్గొన్నారు. డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌తో పాటు శరద్ పవార్ (ఎన్సీపీ–శరద్), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన–యూబీటీ), ఫరూఖ్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితరులు వీరిలో ఉన్నారు. ఇండియా కూటమిలో కీలక పక్షమైన సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాత్రం గైర్హాజరయ్యారు. అయితే, యాత్రను రాహుల్ విజయవంతంగా ముగించారని కొనియాడుతూ ఆయనకు లేఖ రాశారు.

వచ్చేది 'ఇండియా' సర్కారే

గాంధీ ముంబై నుంచే క్విట్ ఇండియా నినాదమిచ్చారని శరద్ పవార్ గుర్తు చేశారు. బీజేపీని అధికారం నుంచి దించేందుకు ఇండియా కూటమి కూడా ముంబైలో ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది ఇండియా కూటమేనని స్టాలిన్ అన్నారు. ఎన్నికల బాండ్లను బీజేపీ పాల్పడ్డ వైట్ కాలర్ నేరంగా అభివర్ణించారు. ప్రజలంతా ఒక్కటైనప్పుడే నియంతృత్వానికి తెర పడుతుందని ఉద్ధవ్ అన్నారు. ఈడీ, సీబీఐ సాయంతో రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూలదోస్తోందని తేజస్వి మండిపడ్డారు. తమ పోరు విద్వేష రాజకీయాలపైనే తప్ప మోదీపైనో, అమిత్ షాపైనో కాదన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడం బీజేపీ తరం కాదు

అంతకుముందు ముంబైలో మహాత్మా గాంధీ నివసించిన మణిభవన్‌ను రాహుల్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడం బీజేపీ తరం కాదన్నారు. ఈ విషయంలో పార్టీ ప్రకటనలు ఉత్తి అరుపులు మాత్రమేనన్నారు. ''జ్ఞానం కేవలం ఒక్క వ్యక్తి సొత్తేనన్నది బీజేపీ, ఆరెస్సెస్ భావన. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు ఏమీ తెలియదన్నది వారి దురభిప్రాయం'' అంటూ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికలను కేంద్రీకృత పాలనే కావాలనే బీజేపీ, అది వికేంద్రీకృత తరహాలో సాగాలనే కాంగ్రెస్ భావజాలాల మధ్య పోరుగా అభివర్ణించారు.

నేను నెగ్గకుంటే రక్తపాతమే

ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఈసారి జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికలు చరిత్రలో నిలిచిపోనున్నాయని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అయితే, తాను నెగ్గకపోతే అమెరికాలో రక్తపాతం జరుగుతుందంటూ శనివారం ఒహాయో ఎన్నికల ర్యాలీలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వీటిపై విమర్శలు రావడంతో, వాహన పరిశ్రమలో ఆర్థిక రక్తపాతం తప్పదన్నదే ట్రంప్ ఉద్దేశమని ఆయన ప్రచార బృందం పేర్కొంది.

అమెరికాకు 'స్పేస్ ఎక్స్' నిఘా ఉపగ్రహాలు!

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్థాపించిన 'స్పేస్ ఎక్స్' కంపెనీ కేవలం అంతరిక్ష ప్రయోగాలే కాదు, నిఘా ఉపగ్రహాల తయారీకి సైతం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్పేస్ ఎక్స్‌తో అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'ఎన్ఆర్ఓ' డీల్ కుదుర్చుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. 2021లోనే ఒప్పందం కుదిరిందని, ఈ కాంట్రాక్టు విలువ 1.8 బిలియన్ డాలర్లు అని తెలియజేశాయి. దీనిప్రకారం ఎలాన్ మస్క్ సంస్థ వందలాది నిఘా ఉపగ్రహాలను తయారు చేసి, ఎన్ఆర్ఓకు అప్పగించాల్సి ఉంటుంది. అమెరికా భద్రతా సంస్థలు, ఎలాన్ మస్క్ కంపెనీ మధ్య బలపడుతున్న బంధానికి ఈ ఒప్పందమే నిదర్శనమని చెబుతున్నారు. ఈ ఉపగ్రహాలు. భూగోళంపై ప్రతి ప్రాంతంపై డేగ కన్నేస్తాయి. అమెరికా సైనిక ఆపరేషన్లకు తోడ్పాటునందిస్తాయి. లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడానికి సహకరిస్తాయి. వీటితో అమెరికా ప్రభుత్వానికి, సైన్యానికి చాలా ప్రయోజనాలే ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

జాయింట్ ఆపరేషన్ సూపర్ సక్సెస్

సోమాలియా పైరేట్ల ఆట కట్టించిన భారత వైమానిక దళం, నావికాదళం

న్యూఢిల్లీ: కచ్చితమైన వ్యూహం, సైనిక దళాల మధ్య సరైన సమన్వయం, పటిష్టమైన ప్రణాళిక ఉంటే ఎలాంటి ఆపరేషన్ అయినా విజయవంతం కావాల్సిందే. భారత వైమానిక దళం, నావికాదళం సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌తో సోమాలియా సముద్రపు దొంగల ఆట కట్టయ్యింది. సోమాలియా పైరేట్లు మూడు నెలల క్రితం హైజాక్ చేసిన సరుకు రవాణా నౌక 'ఎంవీ రూయెన్'ను భారత వైమానిక దళం, నావికాదళం జాయింట్ ఆపరేషన్ ద్వారా విజయవంతంగా విడిపించాయి. ఈ నౌకలోని 35 మంది సముద్రపు దొంగలను నావికాదళం అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నౌకలో బందీలుగా ఉన్న 17 మంది సిబ్బందిని విడిపించారు. నౌకలో రూ.8.29 కోట్ల విలువైన 37,800 కోట్ల టన్నుల సరుకు ఉందని, నౌకను ఇండియాకు చేరుస్తున్నామని నావికాదళం వెల్లడించింది. ఎంవీ రూయెన్ షిప్‌ను సముద్రపు దొంగల చెర నుంచి విడిపించడంలో భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్)కు చెందిన సి–17 టాక్టికల్ రవాణా విమానం కీలకంగా వ్యవహరించింది. జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా రెండు కాంబాట్ రబ్బరైజ్డ్ రైడింగ్ క్రాఫ్ట్(సీఆర్ఆర్‌సీ) బోట్లను, 'మార్కోస్' మెరైన్ కమాండోలను ఈ విమానం ద్వారా భారత తీరానికి 2,600 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంపైకి క్షేమంగా జారవిడిచారు. కమాండోలు అపూర్వమైన ధైర్యసాహసాలతో సముద్రపు దొంగలను లొంగదీసుకున్నారు. మొత్తం ఆపరేషన్ 40 గంటలపాటు జరిగింది.

గుజరాత్ వర్సిటీలో విదేశీ విద్యార్థులపై దాడి.. ఇద్దరు అరెస్ట్

అహ్మదాబాద్: గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులపై కొందరు దాడికి దిగారు. క్యాంపస్‌లోని ఎ–బ్లాక్ హాస్టల్‌లో విదేశీ విద్యార్థులు కొందరు శనివారం రాత్రి నమాజ్ చేస్తుండగా ముగ్గురు విద్యార్థులు అడ్డుకున్నారు. వారికి మరో 200 మంది తోడై విధ్వంసం సృష్టించారు. రాళ్లు రువ్వడంతో శ్రీలంక, తజికిస్తాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు 25 మందిపై కేసులు పెట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కానివ్వబోమని వీసీ నీరజా అరుణ్ గుప్తా స్పష్టం చేశారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

స్నేహితురాలిని పెళ్లాడిన ఆస్ట్రేలియా మహిళా మంత్రి



అడిలైడ్: ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ తన చిరకాల భాగస్వామి సోఫీ అల్లౌచెను పెళ్లి చేసుకున్నారు. ఆస్ట్రేలియా పార్లమెంట్ సభ్యుల్లో మొట్టమొదటిగా స్వలింగ సంపర్కులిగా ప్రకటించుకున్న వాంగ్.. తనతోపాటు పూల బొకేతో పెళ్లి దుస్తుల్లో ఉన్న అల్లౌచె ఫొటోను ఆదివారం ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేశారు. 'మా కుటుంబసభ్యులు, ఎందరో స్నేహితులు ఈ ప్రత్యేకమైన రోజును మాతో పంచుకున్నందుకు సంతోషిస్తున్నాం'అని వాంగ్ పేర్కొన్నారు. వాంగ్, అల్లౌచె దాదాపు రెండు దశాబ్దాలుగా కలిసి ఉంటున్నారు. శనివారం అడిలైడ్‌లోని ఓ ద్రాక్ష తోటలో వారి వివాహ వేడుక జరిగినట్లు 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్' తెలిపింది. సెనెట్‌లో దక్షిణ ఆస్ట్రేలియా తరఫున వాంగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆస్ట్రేలియా కేబినెట్‌లో స్థానం సంపాదించుకున్న ఆసియా(చైనా)లో జన్మించిన మొదటి వ్యక్తి పెన్నీ వాంగ్. ఆస్ట్రేలియాలో 2017 నుంచి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లభించింది.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 18 । మార్చి । 2024



పదో తరగతి పరీక్షలకు అదనపు బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని నగరంలోని వివిధ మార్గాల్లో అదనపు బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు జరగనున్న సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకొనేలా, తిరిగి పరీక్షల అనంతరం ఇళ్లకు వెళ్లేందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలకు యథావిధిగా మహాలక్ష్మి పథకంలో భాగంగా సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణసదుపాయం ఉంటుందన్నారు. రూట్‌పాస్‌లు, నెలవారీ బస్‌పాస్‌లు ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉచితంగా రాకపోకలు సాగించవచ్చని ఆయన సూచించారు. బస్సులో ప్రయాణించే సమయంలో హాల్ టికెట్‌తో పాటు బస్‌పాస్‌ను కండక్టర్‌కు చూపించాలన్నారు. బస్సుల నిర్వహణ, రాకపోకల సమాచారం కోసం 99592 26160, 99592 26154లను సంప్రదించవచ్చని వెంకటేశ్వర్లు సూచించారు.

విలువలతో కూడిన విద్యతోనే దేశాభివృద్ధి

మంత్రి పొన్నం ప్రభాకర్



సనత్‌నగర్: పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదని, విలువలతో కూడిన విద్యను అందించి దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం బీకేగూడలోని హైదరాబాద్ సెంట్రల్ స్కూల్ (పూర్వ వశిష్ఠ స్కూల్) వార్షిక, ప్రారంభ వేడుకలు సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ సెంట్రల్ స్కూల్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లల అభిరుచులను తెలుసుకుని తగిన ప్రోత్సాహాన్ని అందిస్తే ఉన్నతంగా రాణిస్తారన్నారు. తాను విద్యార్థి దశ నుంచే నాయకుడిగా ఉన్నానని బాల్యాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎన్వీ.రమణబాబు, డైరెక్టర్ ఎన్ఎస్‌టీ ఆదిత్య, ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వెంకట నరసమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో హరియాణా గవర్నర్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గవర్నర్ దత్తాత్రేయకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించిన వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

మియాపూర్‌లో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

వరల్డ్ వన్ స్కూల్‌లో రూ.7.85 లక్షలు చోరీ



సీసీ కెమెరాకు చిక్కిన చోరీ దృశ్యం

మియాపూర్: మియాపూర్ పరిధిలోని ఓ పాఠశాలలో రూ.7.85 లక్షల నగదును చెడ్డీ గ్యాంగ్ దొంగిలించుకుపోయింది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హాఫీజ్ పేట వరల్డ్ వన్ స్కూల్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కిటికిలోంచి పాఠశాలలోకి చొరబడి రిసెప్షన్‌లో లాకర్‌ను పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పాఠశాల సిబ్బంది వచ్చి చూడగా లాకర్ పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి నల్లటి మాస్కులను ధరించి, చెడ్డీలు వేసుకుని శనివారం అర్ధరాత్రి పాఠశాలలో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పాత నేరస్తుడు రాకేష్



పవన్‌కుమార్

సనత్‌నగర్: రోజువారీ కూలీలకు గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుడితో పాటు మరొకరిని సనత్‌నగర్ పోలీసుల సహకారంతో ఎస్‌ఓటీ మేడ్చల్ టీమ్ అరెస్టు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతీనగర్ హేమావతినగర్‌కు చెందిన కొమరె రాకేష్ (23) అనే పాత నేరస్తుడు, బల్కంపేటలో ఉండే అతని స్నేహితుడు గండిగూడెం పవన్‌కుమార్ (25)లు కలిసి భువనేశ్వర్ నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తుంటారు. సనత్‌నగర్, బల్కంపేట పరిసర ప్రాంతాల్లో ఉండే రోజువారీ కూలీలు, విద్యార్థులను టార్గెట్ చేసి వారికి గంజాయి ప్యాకెట్లను అమ్ముతుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు సనత్‌నగర్ పోలీసులతో కలిసి రాకేష్ ఉండే ఇంట్లో సోదాలు జరిపారు. ఇంట్లో ఉన్న 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాకేష్ ఇచ్చిన సమాచారం మేరకు బల్కంపేటలో ఉండే అతని స్నేహితుడు పవన్ ఇంట్లో కూడా తనిఖీలు జరపగా మరో నాలుగు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా భువనేశ్వర్ నుంచి ఆరు కిలోల గంజాయి తీసుకువచ్చి 700 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా చేసి పలువురికి విక్రయించినట్లుగా విచారణలో వెల్లడైంది. రాకేష్‌పై గతంలో పలు సెక్షన్ల కింద సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోనే కేసులు నమోదై ఉన్నాయి. ఈ మేరకు పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి తదుపరి విచారణ నిమిత్తం సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యూట్ పెట్!













పెంపుడు శునకాలు ఆకట్టుకున్నాయి. డాగ్ షో ఎంతగానో అలరించింది. పెట్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఐటీసీ సీమాయిల్ సౌజన్యంతో ఆదివారం ఉప్పల్ డీఎస్ఎల్ మాల్స్ ఆవరణలో నిర్వహించిన ఈ షో అందరినీ కట్టి పడేసింది. ఫ్యాషన్ దుస్తుల్లో శునకాలు హొయలుపోయాయి. తలపై టోపి.. కళ్లజోడుతో తమ విన్యాసాలతో ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు ఆహ్లాదంగా జరిగిన పెట్ షోకు దాదాపు 2 వేల మంది పెట్ పేరెంట్స్ హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పెట్ డాగ్ షోలో ఫ్యాబ్‌లో ఎస్కో బార్క్ బ్రీడ్‌కు చెందిన డాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ డాగ్‌కు సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రాంలో దాదాపు 39 వేలకు పైగా ఫాలోవర్స్ ఉన్నట్లు డాగ్ యజమాని ప్రీతి చెప్పారు. అరుదైన బ్రీడ్ అని ఇంట్లో ఒక సంస్కారవంతమైన లక్షణం కలిగిన డాగ్ ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. – ఉప్పల్

తొలి వికెట్ దానమే

అధికార పార్టీలోకి షురువైన వలసలు

- హస్తం గూటికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే నాగేందర్
- అదే బాటలో మరికొందరు సిటీ ఎమ్మెల్యేలు
- గ్రేటర్ హైదరాబాద్‌పై దృష్టి సారించిన కాంగ్రెస్



కాంగ్రెస్‌లో చేరుతున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీ ఒక గేటు తెరిచింది. బీఆర్ఎస్ నుంచి తొలి వికెట్ పడింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ సిటీ ఎమ్మెల్యేలు పలువురు సీఎం రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసినప్పటికీ చేరికలు జరగలేదు. ఆదివారం కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్ హయాంలో మంత్రిగా పని చేసిన దానం 2018లో బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి ఆ పార్టీని వీడి హస్తం గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దానం నాగేందర్ సొంత గూటికి వస్తారన్న ప్రచారం సాగినప్పటికీ.. నిన్నా మొన్నటి వరకూ బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదన్నట్లుగా చెబుతూ వచ్చారు. శనివారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసిన దానం నాగేందర్ గ్రీన్ సిగ్నల్ లభించగానే ఆదివారం కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు.

దానం బాటలోనే మరికొందరు..

నగరంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ బాటలోనే మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన తొలి రోజుల్లోనే రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా సీఎంను కలుస్తానని ప్రకటించారు. ఇటీవల మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా కర్ణాటక డిప్యూటీ సీఎంతో కలిసి వచ్చారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి బీఆర్ఎస్ చేరిన పలువురు ఎమ్మెల్యేలు సైతం అధికార కాంగ్రెస్‌లోకి చేరే అవకాశాలు లేకపోలేదన్న ప్రచారం సాగుతోంది. పలువురు ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ అగ్రనేతలకు టచ్‌లో వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన జీహెచ్ఎంసీ మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ దంపతులు, పలువురు కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే.

గ్రేటర్‌పై కాంగ్రెస్ దృష్టి..

అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల ముందు హైదరాబాద్ మహా నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీచినా.. హైదరాబాద్ మహా నగరానికి మాత్రం తాకలేదు. ఎన్నికల్లో ఓట్ల శాతం పెంచుకున్నప్పటికీ అసెంబ్లీ స్థానాల్లో కనీస ప్రాతినిధ్యం మాత్రం దక్కలేదు. మొత్తం 24 అసెంబ్లీ స్థానాల్లో రిక్తహస్తమే ఎదురైంది. గట్టిగా ఆశలు పెట్టుకున్న స్థానాల్లో సైతం బోల్తాపడటంతో పాటు కొన్నింటిలో డిపాజిట్ గల్లంతైంది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్‌పాత బస్తీ వదిలి మిగిలిన సికింద్రాబాద్, మల్కాజిగిరి చేవెళ్ల నియోజక వర్గాలను హస్తగతం చేసుకునేందుకు వ్యూహంతో ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికకు గేట్లు తెరిచినట్లు కనిపిస్తోంది. సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ చేరికలకు ఒక గేటు తెరిచిందని ప్రకటించడం ఇందుకు బలం చేకూరుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలలోపే నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేరుకునే వ్యూహంతో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డేనా?

కాంగ్రెస్ గూటికి చేరిన బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి చేవెళ్ల అభ్యర్థిగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతోంది. తాజాగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతా రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం సాగింది. అయితే.. కాంగ్రెస్ తొలి జాబితాలో చేవెళ్లకు స్థానం దక్కలేదు. దీంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. సునీతా రెడ్డికి మల్కాజిగిరి టికెట్ ఇచ్చి, రంజిత్ రెడ్డిని చేవెళ్ల నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక్కో సారు.. ఒక్కో తీరు!

యూనిట్ పోస్టు అంశంలో స్పష్టత కరువు

- మూడు కమిషనరేట్లలో వేర్వేరు విధానాలు
- సిటీలో ఒకలా.. మిగిలిన రెండింట్లో మరోలా
- ఎన్నికల బదిలీల్లో తీవ్ర గందరగోళం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు సమీపిస్తున్న ప్రతి సందర్భంలోనూ ఇతర కీలక విభాగాలతో పాటు పోలీసు శాఖలోనూ బదిలీలు అనివార్యం. ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఇవి జరుగుతూ ఉంటాయి. సమయం, సందర్భం, అవసరాన్ని బట్టి ఈసీ తన మార్గదర్శకాల్లో మార్పులు చేర్పులు చేస్తుంటుంది. ఇవి అన్ని జిల్లాలు, కమిషనరేట్లలో ఒకేలా అమలు కావాలి. కానీ.. ఈసారి మాత్రం 'యూనిట్ పోస్టు'ల విషయంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో వేర్వేరు విధానాలు అమలయ్యాయి. దీంతో కింది స్థాయి అధికారుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.

'అసెంబ్లీ- పార్లమెంట్' మధ్య తేడాలెన్నో..

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో పోలీసు బదిలీలకు సంబంధించి ఈసీ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం 2020 జనవరి 30 నుంచి 2024 జనవరి 31 (నాలుగేళ్ల కాలం) మధ్య మూడేళ్ల పాటు కమిషనరేట్‌లో పని చేసిన, స్థానికత ఉన్న (నేటివ్) నియోజకవర్గాల్లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు బదిలీ అనివార్యం. అప్పట్లో రెవెన్యూ జిల్లాను ప్రామాణికంగా చేసుకుని స్థానికతను నిర్ధారించారు. కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచ్, ట్రెనింగ్ విభాగాల్లో పని చేస్తున్న వారికి మినహాయింపునిచ్చారు. 2018 ఎన్నికల సందర్భంలో టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీలను లూప్ లైన్స్‌గా పరిగణించినప్పటికీ 2023లో ఈ వింగ్స్‌ను ఫోకల్ పోస్టులుగా చేశారు. దీంతో అప్పట్లో పెద్దఎత్తున పోలీసు అధికారులు, సిబ్బంది బదిలీలు జరిగాయి. ప్రతి కమిషనరేట్ నుంచి దాదాపు సగం మంది బయటకు వెళ్లిపోయి.. వారి స్థానాల్లో కొత్తవారు వచ్చారు.

మార్గదర్శకాలు మార్చిన ఎన్నికల సంఘం..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఈసీ ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులు మూడు కమిషనరేట్లలో 'మూడేళ్లు' ప్రాతిపదికన బదిలీలు చేశారు. దాదాపు అన్ని స్థాయిల్లో అధికారుల బదిలీలు పూర్తయిన తర్వాత గత నెల 23న ఈసీ మరో ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం రెవెన్యూ జిల్లాను యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేయొద్దని, పార్లమెంట్ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో ఓ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వచ్చే ఏ ప్రాంతంలో అయినా నిర్దేశిత కాలంలో మూడేళ్లు పని చేసి ఉన్నా, ఆ నియోజకవర్గం స్థానికుడైనా కమిషనరేట్ దాటి బదిలీ చేయడం అనివార్యంగా మారింది. దీంతో మరోసారి కసరత్తు చేసిన ఉన్నతాధికారులు మరికొందరు అధికారులకు ఆయా కమిషనరేట్ల నుంచి బయటకు పంపించారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర స్థాయిలో పోస్టుల్లోనూ అనేక మార్పుచేర్పులు చోటుచేసుకున్నాయి.

పోస్టుల్లో యూనిట్ పోస్టులు వేరు..

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు సంబంధించి ప్రతి కమిషనరేట్‌లోనూ కొన్ని యూనిట్ పోస్టులు కొన్ని ఉంటాయి. ఫలానా పోలీసుస్టేషన్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) పని చేయాలంటే అతడిని ఆ పోస్టులో నేరుగా నియమిస్తారు. సదరు అధికారి సంబంధిత జోన్ డీసీపీకి జవాబుదారీ అవుతాడు. స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)/ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ), టాస్క్‌ఫోర్స్/స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ) వంటి వాటిలో పని చేసే ఇన్‌స్పెక్టర్లు యూనిట్ పోస్టుల్లో పని చేస్తున్నట్లు లెక్క. అంటే వీటిలో అనేక జోన్లు, విభాగాలు ఉన్నప్పటికీ పోలీసు కమిషనర్ నేరుగా ఆ జోన్‌కు పోస్టింగ్ ఇవ్వరు. ఆ విభాగానికి కేటాయిస్తూ పోస్టింగ్ ఇస్తారు. ఆపై దానికి నేతృత్వం వహిస్తున్న అధికారి తన అవసరం తదితరాలను పరిగణనలోకి తీసుకుని జోన్లు, విభాగాలు కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో ఈ వింగ్స్‌లో ఇన్‌స్పెక్టర్లవి యూనిట్ పోస్టులుగా పరిగణిస్తారు.

ఇక్కడ ఒకలా.. ఆ రెంటిలో మరోలా..

ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండేవి, కేసులు నమోదు చేసే విభాగాల్లో పని చేస్తున్న అధికారులు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం ఆయా పోస్టుల్లో నిర్ణీత కాలం పని చేసిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని స్పష్టం చేస్తుంది. ఈసీ నిబంధనల ప్రకారం యూనిట్ పోస్టుల్లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు ఓ కమిషనరేట్‌లో మూడేళ్లు పూర్తి చేసుకుంటే వేరే కమిషనరేట్ లేదా జిల్లాకు వెళ్లాల్సిందే. హైదరాబాద్ కమిషనరేట్ అధికారులు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్‌ల్లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లను యూనిట్ పోస్టుల్లో ఉన్నట్లు గుర్తించి బదిలీ చేశారు. సైబరాబాద్, రాచకొండల్లో మాత్రం వీటిలో పని చేస్తున్న వారిని యూనిట్ పోస్టుల్లో పని చేస్తున్నట్లు భావించలేదు. దీంతో వారికి అదే కమిషనరేట్‌లో ఒక జోన్ నుంచి మరో జోన్‌కు, లేదా మరో పార్లమెంట్ నియోజకవర్గానికి బదిలీ చేశారు. మూడు కమిషనరేట్లో వేర్వేరుగా ఉన్న ఈ విధానం వల్ల తీవ్ర గందరగోళం నెలకొందని అధికారులు వాపోతున్నారు.

ఉమ్మడి కృషితోనే సమస్యల పరిష్కారం



సత్కారం అందుకున్న వృత్తి నిపుణులు

లక్డీకాపూల్: సమస్యల పరిష్కారానికి మహిళలు ఉమ్మడిగా కృషి చేయాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎం. విజ్జులత అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ మహిళా విభాగం ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమ్మిళిత పురోభివృద్ధి మాత్రమే నిజమైన అభివృద్ధి అని ఆమె అభివర్ణించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ.. పబ్లిక్ రిలేషన్స్‌లో భాగమైన సంక్షోభ నియంత్రణ మహిళలకు ఉండే సహజసిద్ధమైన నైపుణ్యమని చెప్పారు. మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ అనిత సభకు అధ్యక్షత వహించగా కో కన్వీనర్ డా. శ్రీబాల, కోఆర్డినేటర్ ధన్య చౌదరి, సలహాదారులు సి. రమాదేవి, ఆనందిత ముఖర్జీ సిన్హా, సంయుక్త కార్యదర్శి అపర్ణ రాజహంస్, సలహాదారు రాజేశ్వరి అయ్యర్, ఈసీ మెంబర్ సాజిదా ఖాన్‌తో పాటు హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, కార్యదర్శి కె. యాదగిరి, కృష్ణ బాజీ, రవీందర్ రెడ్డి, మహేష్ బుడగం, భుజంగ రావు, వై బాబ్జీ, మోహన్ రావు, శ్రీకర్ రెడ్డి, సి.వనజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది వృత్తి నిపుణులను సత్కరించారు.

తనిఖీలు షురూ..

సార్వత్రిక ఎన్నికల 'కోడ్' కూయడంతో నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఎప్పటిలాగా పోలీసుల తనిఖీలు షురూ అయ్యాయి. ఆదివారం నగరవ్యాప్తంగా విస్తృత తనిఖీల కోసం జీహెచ్ఎంసీ, పోలీస్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు రంగంలోకి దిగారు. అనుమానిత వాహనాలను ఆపి చెక్ చేశారు. నగదు, మద్యం, తదితర వస్తువుల రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. – బంజారాహిల్స్



నారీ శక్తి.. శారీ కట్టి..









సంప్రదాయ చీరకట్టులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజా వేదికగా ఆదివారం శారీ రన్ నిర్వహించారు. టాటా ఉత్పత్తి తనైరా, బెంగళూరుకు చెందిన ప్రముఖ ఫిట్‌నెస్ కంపనీ జేజే యాక్టివ్ భాగస్వామ్యంతో నిర్వహించిన శారీ రన్‌లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సినీ నటి సంధ్య జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. కోల్‌కతా, పుణె, బెంగళూరుల్లో తనైరా శారీ రన్‌లు విజయవంతంగా నిర్వహించినట్లు సీఈఓ అంబుజ్ నారాయణ్ తెలిపారు. – ఖైరతాబాద్

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ క్యాపిటల్‌గా హైదరాబాద్

ఈ నెల 30, 31 తేదీల్లో ఏఐ డేస్–2024 అంతర్జాతీయ సదస్సు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ చంద్ర

గచ్చిబౌలి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) క్యాపిటల్‌గా ఎదిగేందుకు హైదరాబాద్‌లో అన్ని హంగులు ఉన్నాయని స్వేచ్ఛ తెలంగాణ వ్యవస్థాపకులు వై.కిరణ్ చంద్ర పేర్కొన్నారు. మార్చి 30, 31 తేదీల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై 'ఏఐ డేస్–2024' పేరిట రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను వెల్లడించారు. మ్యాన్ పవర్ అవసరాలు తగ్గి..ఉద్యోగాలు పోతాయని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను విలన్‌గా చూపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. కానీ ఇది వాస్తవం కాదని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా త్వరితగతిన ప్రజలకు సత్ఫలితాలు అందించవచ్చని, ఉద్యోగాలకు ఎలాంటి ఢోకా ఉండదని ఆయన పేర్కొన్నారు. ఏఐలో హైదరాబాద్‌ను క్యాపిటల్‌గా నిలిపేందుకు ఐటీ కంపెనీలు, మేధావులు, విద్యా సంస్థలు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో మార్చి 30, 31 తేదీల్లో జరిగే సదస్సులో పద్మ భూషణ్ డాక్టర్ వీఎస్ రామచంద్రన్, ఇండియన్–అమెరికన్ కంప్యూటర్ సైంటిస్ట్, ట్యూరింగ్ అవార్డ్ విన్నర్ రాజిరెడ్డి తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు.

కొత్త ఆవిష్కరణలు

స్వేచ్ఛ తెలంగాణ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పలు యంత్రాలను ఆవిష్కరించారు. అవి అందుబాటులోకి వస్తే పంటలకు కోయడం, గ్రేడింగ్ చేయడం ఇట్టే వీలవుతుంది.


ఫ్లక్కింగ్ బోట్



ఇది చేనులో పండించే వివిధ రకాల కూరగాయలను కోస్తుంది. నిమిషానికి అర కిలో టమాటోలను బుట్టలో వేస్తుంది. ఏ రకమైన వాటిని కోయాలో చెబితే వాటినే కోస్తుంది. ఇది బ్యాటరీతో పని చేస్తుంది.

ఆటోమెటిక్ గ్రేడింగ్ రోబో

కూరగాయలు, పండ్లను గ్రేడింగ్ చేసే చిన్న పాటి రోబో ఇది. పండ్లు, కూరగాయలను రాసులుగా పోసి రంగు చెబితే వాటిన్నింటిని ఒక బుట్టలో వేస్తుంది. గ్రేడింగ్ చేయాలని కలర్, సైజు వాయిస్ చెబితే అది పని మొదలు పెడుతుంది. గంటకు వెయ్యి కాయలు, పండ్లను గ్రేడింగ్ చేస్తుంది. ఇప్పటికే ఫీల్డ్‌లో టెస్ట్ చేశారు. లో లెవల్ విద్యుత్, పవర్ బ్యాంక్‌తోను ఇది నడుస్తుంది. దీనికి కెమెరాను అర్చారు. దీని ధర రూ.10 వేల వరకు ఉంటుంది. ఐదు నెలల్లో అందుబాటులోకి రానుంది.



యువశక్తి, మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

మలక్‌పేట: ప్రభుత్వం యువశక్తిని, మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ఆర్ఏఆర్ ట్యూటోరియల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న గ్రూప్ 1,2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భర్తీ కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద వచ్చే పోస్టులను లెక్కించి మొత్తం పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనర్హులకు ప్రమోషన్లు ఇచ్చి నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 24,700 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. యూనివర్సిటీల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ, ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీ ఎంపీ కృష్ణయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ నేత నీలం వెంకటేష్, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి 10వ తరగతి విద్యార్థి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన చిన్నపాక సురేందర్ కుమారుడు బాలాజీ (16) 10 తరగతి చదువుతున్నాడు. ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి గుడికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంఎంటీఎస్ రైల్లో వెళుతుండగా ప్రమాదవశాత్తు కాచిగూడ – మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో నుంచి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజ వికాసం

రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా

- వేధింపులు, అఘాయిత్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం
- సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డుల ప్రదానం


అవార్డు గ్రహీతలతో అతిథులు

సనత్‌నగర్: నేటి సమాజంలో మహిళలు లేని రంగం ఏదీ లేదని, అన్ని రంగాల్లో మహిళలు రాణించడంతోనే సమాజ వికాసం జరుగుతుందని రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా అన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 50 మంది నేటి తరం మహిళలను సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డ్స్' అందజేశారు. ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా మాట్లాడుతూ మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా సేవా, రాజకీయ రంగాల్లోనూ సత్తా చాటుతున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి మహిళల ప్రతిభను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. చంచల్‌గూడ జైలు ఎస్పీ శివ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆడపిల్లను కాపాడుకుందాం..ఆడపిల్లను రక్షిద్దాం అనే ఆలోచనతోనే సంస్థ ఏర్పాటైందన్నారు. ఆడపిల్లలు ఎక్కడ అఘాయిత్యానికి గురవుతున్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టింది అంటే మహాలక్ష్మీ అనుకునేవారని, ఇంటిల్లిపాది సంబరాలు చేసుకునేవారన్నారు. ఆడ పిల్లలను చదివిద్దాం..ఎదగనిద్దాం..అనే ఆలోచనతో అందరం ముందుకు సాగుదామన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ సృష్టికి, మహిళకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. సృష్టి నిర్మాణంలో మహిళదే ప్రముఖ పాత్ర అన్నారు. పురాణాలు, ఇతిహాసాలు, ఎన్ని చూసినా త్యాగాల్లో మహిళలు ముందుంటారన్నారు. కార్యక్రమంలో ముందడుగు ఫౌండేషన్ ఫౌండర్ రాజేంద్ర, సలహాదారులు కళింగకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి, ముందడుగు డైరెక్టర్ జయరాం, కొమటి రమేష్‌బాబు, బత్తిని రాజేష్, వరికుప్పల గంగాధర్, కొక్కుల ప్రశాంత్, నూలి గుప్తా, హరిప్రకాష్, హరి, లక్ష్మీకళ, గీత తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య



చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. హుజూర్‌నగర్‌కు చెందిన వీరయ్య కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్‌గా సేవలు అందించారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన ప్రధాన అనుచరుడు. రెండు రోజుల్లో ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు నేతలు వీరయ్యకు అభినందనలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

50 ఏళ్ల తర్వాత కలునుకున్న చిన్ననాటి స్నేహితులు



కీసర: ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1973–1974 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కీసరగుట్టలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులంతా ఒక్కచోటికి చేరి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు నేర్పించిన గురువులను గుర్తుచేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు.

ఆయిల్ గోదాంలో అగ్ని ప్రమాదానికి బాధ్యులెవరు?

- ఎగిసిపడిన మంటలు
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- రోడ్డుపై కాలువలా ప్రవహించిన ఆయిల్


రోడ్డుపై పారుతున్న ఆయిల్ (ఫైల్)


ఎగిసిపడుతున్న మంటలు(ఫైల్)

గోల్కొండ: యూసుఫ్ టెక్డీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఆయిల్ డిపోలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి టోలిచౌకీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ ఆయిల్ గోదాం అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. 15 ఫైర్ ఇంజిన్లు కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఆయిల్ నిల్వ చేసిన గోదాంకు అసలు అనుమతులు ఉన్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి ఆ సమయంలో వేల బ్యారళ్ల ఆయిల్ గోదాంలో ఉండి ఉండవచ్చునని తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకోగా శనివారం ఉదయం వరకు మెహిదీపట్నం–టోలిచౌకీ రోడ్డుపై ఆయిల్ వరదలా ప్రవహిస్తుండడం గమనార్హం. అదృష్టవశాత్తు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం చోటు చేసుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి ఆనుకుని పెట్రోల్ బంక్, దాని సమీపంలోనే పలు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే యూసుఫ్ టెక్డీ ఫుడ్ కోర్టు సైతం ఘటన స్థలానికి అతి సమీపంలోనే ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలోని రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు రద్దీగా ఉన్నాయి. రంజాన్ మాసం కావడంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు హలీం కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. అగ్ని ప్రమాదంతో ఇటూ షేక్‌పేట్ నాలా వరకు అటు మెహదీపట్నం వరకు ఇరు వైపులా రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోలేదు. కేవలం హుమాయూన్‌నగర్ పోలీసులు మాత్రమే సహాయక చర్యలను పర్యవేక్షించారు. శనివారం ఉదయం స్థానిక యువకులు వాహనాల రాకపోకలను నియంత్రించారు.

బండరాయితో మోది..

వృద్ధుడి దారుణ హత్య


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి: గుర్తు తెలియని వృద్ధుడిని బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం బాగ్‌లింగంపల్లి మీనాక్షి హోటల్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి రక్తం మడుగులో పడి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రానైట్ రాయితో తలపై మోది గుర్తించారు. అతడి వద్ద లభించిన ఆధారాలతో మృతుడి పేరు శాస్త్రి గోపాల్ (73) గా గుర్తించారు. కుటుంబ వివరాలను తెలియలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన బాలిక

శామీర్‌పేట్: వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారి(18 నెలలు) తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కరుణాకర్, శ్రావణి దంపతుల కుమార్తె ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఆమెను చుట్టుముట్టిన వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో బాలిక ముఖం, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుక్కలను తరిమికొట్టి బాధితురాలిని చికిత్స నిమిత్తం నిలోఫర్‌కు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యుల సూచనమేరకు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చిన్నారి ముఖానికి సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శామీర్‌పేట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శామీర్‌పేట కట్టమైసమ్మ బ్రిడ్జి సమీపంలో కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. కాగా, అప్పటికే వ్యక్తి మృతిచెందాడని ముఖం, శరీర భాగాలపై తీవ్రగాయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35–40 ఉంటుందని, వివరాలు తెలిసిన వారు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందులతో రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. లాలగూడకు చెందిన దుర్గాప్రసాద్ (36) రైల్వే కూలిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఈనెల 17న సికింద్రాబాద్–లాలాగూడ స్టేషన్ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి..

చిలకలగూడ: ప్రమాదవశాత్తు రైలుకింద పడి గాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ అల్వాల్‌కు చెందిన కుర్రా దుర్గయ్య (41) ప్రైవేటు ఎంప్లాయ్ ఈ నెల 13న సనత్ నగర్– అమ్ముగూడ స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన దుర్గయ్యను సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రోజుకో మలుపు



- కారు దిగి.. హస్తంలో చేరి
- పార్టీ మారిన ఎంపీ రంజిత్‌రెడ్డి
- చేవెళ్లలో మారుతున్న సమీకరణలు
- రసవత్తరంగా రాజకీయం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల వేళ చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కారు దిగి హస్తం చెంతకు చేరారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019 మార్చిలోనే లోక్‌సభ ఎన్నికల సమయంలోనే వరంగల్‌కు చెందిన వ్యాపారవేత్త అయిన గడ్డం రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని చేవెళ్ల ఎంపీగా అవకాశం కల్పించింది. అప్పటి వరకు ఈ ప్రాంత నాయకులు, ప్రజలు ఎవరికీ పరిచయం లేకపోయినా అప్పట్లో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అని నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. అనతికాలంలోనే ఆయన తనదైన శైలిలో రాజకీయాల్లో రాణించి పేరు సంపాదించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. పార్టీ నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ జీవితం ఎంపీతోనే మొదలైంది. ఆ ఎంపీ పదవీకాలం ముగియక ముందే రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలు కావడం.. ఎమ్మెల్యేలు, నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆయన ఆత్మరక్షణలో పడిపోయారు. అందరికంటే ముందే చేవెళ్ల అభ్యర్థిగా మరోసారి రంజిత్‌రెడ్డి పేరు ప్రకటించినప్పటికీ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన పోటీకి వెనుకంజ వేశారు. అప్పటి నుంచి మౌనంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. తెరవెనుక పావులు కదిపి చివరికి హస్తం గూటికి చేరారు.

కాంగ్రెస్ పార్టీలో కలిసి వచ్చేనా..?

ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డిపేరు దాదాపు ఖరారైనట్టే. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇన్నాళ్లు పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి అని ఆమెను పార్టీలోకి తీసుకు వచ్చి పరిచయం కూడా చేశారు. అనూహ్య పరిణామాలతో ఆమెకు టికెట్ ప్రకటించ లేదు. రంజిత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీ కావడంతో విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో కాంగ్రెస్ అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. రంజిత్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తే సునీతా మహేందర్‌రెడ్డి పరిస్థితి ఏమిటనే దానిపై చర్చ నడుస్తోంది. ఆమెకు మల్కాజిగిరి ఎంపీ స్థానం ఇస్తారనే ప్రచారం సాగుతోంది. కానీ ఆమె అక్కడి నుంచి పోటీ చేస్తారా లేదా అనేది సంశయంగా మారింది. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగితే పార్టీ నాయకులు ఏ మేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీ టికెట్ హామీతోనే పార్టీ మారిన సునీతా మహేందర్‌రెడ్డి వర్గం సపోర్టు చేస్తుందా.. బీఆర్ఎస్‌లో ఆయన వర్గం నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట నడుస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బలమైన అభ్యర్థిగానే కాకుండా స్థానికుడిగా ఉన్నారు. బీఆర్ఎస్ కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మరి కాంగ్రెస్ నుంచి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

అభివృద్ధిలో భాగంగానే..

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల అభివృద్ధిలో భాగంగానే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తం గూటికి చేరిన అనంతరం ఆదివారం ఆయన మొయినాబాద్ మండలం ఎన్కెపల్లి సమీపంలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రానున్న రోజుల్లో కార్యాచరణపై రంజిత్‌రెడ్డి వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కందవాడ బల్వంత్‌రెడ్డి, దేవురంపల్లి మహేందర్‌రెడ్డి, వెంకటాపూర్ బాలరాజ్, చేగూరి రామకృష్ణగౌడ్, ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే రంగారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే సంక్షేమంలో నంబర్‌వన్ స్థానంలో కాంగ్రెస్ ఉండబోతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు.

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోల్కంపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సింహా, యాదయ్య, రాజు, కాటంరాజు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



బోర్డుపై రాసిన హాల్ టికెట్ నెంబర్లు...

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండగా ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో నిఘానేత్రాల కింద ఈ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయవచ్చని, ఆదరాబాదరాగా రావడం వల్ల టెన్షన్‌కు గురవుతారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో 38 పరీక్షా కేంద్రాలు ఉండగా 8164 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. సోమవారం ఉదయం పోలీసు బందోబస్తు నడుమ ప్రశ్నాపత్రాలను కేంద్రాలకు చేరుస్తారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు కేంద్రంలోకి సెల్‌ఫోన్లతో పాటు ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా అనుమతించేది లేదన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

‘ఎన్నికల’ తనిఖీలు షురూ

- రంగంలోకి దిగిన బృందాలు
- ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్న సిబ్బంది
- బోర్డర్లలో చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు


కవాతు నిర్వహిస్తున్న ఫిలింనగర్ పోలీసులు

బంజారాహిల్స్: తెలంగాణలో మే 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు జరగనుండటంతో పోలీసులు, అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జీహెచ్ఎంసీ, పోలీస్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు రంగంలోకి దిగారు.

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో సైబరాబాద్ కమిషనరేట్ సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే అడుగడుగునా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు వాహనాల తనిఖీలు చేపట్టాయి.
- అనుమానిత వాహనాలను తనిఖీలు చేశారు. మరోవైపు కోడ్ అమలులోకి కావడంతో రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలను ఈవీడీఎం సిబ్బంది పూర్తిగా తొలగించారు.
- ప్రజలు ధైర్యంగా ఓటు వేసేందుకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బస్తీల్లో ఇన్‌స్పెక్టర్‌ఎస్ఎఫ్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కవాతు జరిగింది.
- ఇంకోవైపు నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.


రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది


తనిఖీలు చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్

రంజాన్ సేవా కార్యక్రమాలు వృథాకావు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్


సహర్ కార్యక్రమంలో పాల్గొన్న అజహరుద్దీన్, బాబా ఫసీయుద్దీన్, నవీన్‌యాదవ్

రహమత్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీం ఇండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ కొనియాడారు. బాబా పసీయుద్దీన్ ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన సహేర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజహరుద్దీర్ మాట్లాడుతూ... రంజాన్ మాసంలో చేసిన సేవలు, దానధర్మాలు వృథాకావని, వాటికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రతి మనిషి సేవాగుణం కలిగి ఉండాలని సూచించారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు మహేష్‌గౌడ్, నరసింహ, ఇమ్రాన్, కృష్ణవేణి ఎర్రగడ్డ నాయకుడు మోసిన్ ఖురైషీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలి

లిబర్టీ: అవకాశావాద రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీలను నమ్మకూడదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. స్వార్థం కోసం రాజకీయాలు చేస్తూ మన రాజకీయ సత్యాలు ప్రజలను భ్రమల్లో పెడుతున్నారని విమర్శించారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళిత బహుజనులకు వారి సంక్షేమం కోసం అభ్యున్నతి కోసం ఏ రాజకీయ పార్టీ పని చేయడం లేదని ఎన్నికలు వచ్చినప్పుడు దళితులు గుర్తుకొస్తున్నారని దళితులపై ప్రేమ కురిపిస్తున్నారని మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితి... బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని లోపాయికారిగా పరస్పర రాజకీయ సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో ఈ రెండు పార్టీలు భ్రమలు కల్పిస్తూ రాజకీయ గ్రామాలు ఆడుతున్నారు తప్ప తెరవెనుక రెండు పార్టీలు ఒక్కటేనని పరస్పర అంగీకారంతోనే గత ఎన్నికల్లో గెలిచారని ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు అదే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. భారత రాష్ట్ర సమితి, బీజేపీలను ఓడించాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మనుగడే ప్రమాదంలో పడే అవకాశం ఉండదన్నారు. ప్రజాస్వామ్యకుల అమలు కావని దళితులపై దాడులు కొనసాగుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బహుజనులు బీజేపీకి ఓటు వేయకూడదని శ్రీకృష్ణ సూచించారు.

విశిష్ట సేవకులకు పురస్కారాలు

లిబర్టీ: వివిధ రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న వారికి ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. ఆదినారాయణ వెల్లడించారు. ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉగాది వేడుకలతో పాటు ఎక్సలెన్సీ అవార్డులను ఆయా రంగాల్లో ప్రతిభాపాటవాలు కనపడుతున్న వారికి అందజేస్తామని వెల్లడించారు. సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్లు, ఇంజినీర్లు, విద్యావేత్తలు, లాయర్లు, సోషల్ వర్కర్స్, రియల్ ఎస్టేట్ రంగంలో సేవలు అందిస్తున్న వారు స్పీకర్స్, ఫ్యాషన్ రంగంలో పపని చేస్తున్న వారు ఇలా అనేక రంగాల్లో అనేక ఏళ్లుగా సేవలందిస్తు ప్రతిభ కనబరుస్తున్నా గుర్తింపు ఉండటం లేదన్నారు. వారికి ఆయా అవార్డులతో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎక్సలెన్సీ అవార్డులు ఇస్తున్నట్లు వివరించారు. ఈ నెల 30, 31వ తేదీల్లో గోవాలో జరిగే ప్రదాన కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయా రంగంలో పని చేస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేస్తారని డాక్టర్ ఆదినారాయణ వివరించారు.

అద్దె చెల్లించకుంటే ‘పాఠశాలల’కు తాళం వేస్తాం

రెంటెడ్ బిల్డింగ్స్ ఓనర్స్ అసోసియేషన్


మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల అద్దెను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రెంటెడ్ బిల్డింగ్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అతిక్, కార్యదర్శి జహంగీర్ అలీ డిమాండ్ చేశారు. నగరంలో అద్దె భవనాలలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు సుమారు 110 ఉన్నాయని, మూడు సంవత్సరాలుగా వాటి అద్దె రూ. 4 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పాఠశాలల అద్దెకు సంబంధించిన నిధులు విడుదల చేస్తామని చెప్పినా నేటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల విద్యా శాఖ డైరెక్టరేట్, డీఈవోలకు సైతం వినతి పత్రం అందజేశామని అన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో పాఠశాలల భవనాలకు తాళాలు వేస్తామని వారు హెచ్చరించారు. నేతలు అఫీజ్‌ఖాన్, మహ్మద్ వహీద్ ఉద్దీన్, మహ్మద్ హమీద్ మొయ్యోద్దీన్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు

వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు అగర్వాల్


మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు అగర్వాల్

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ అనుమతుల మేరకే శాంక్షన్ ప్లాన్‌కు అనుగుణంగానే తాము నిర్మాణాలు చేపడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు గత మూడు రోజుల నుంచి నిర్మాణాలు ఆపాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.ఎల్.అగర్వాల్‌లు ప్రశ్నించారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తాము సుప్రీంకోర్టులో ఈ స్థలం సర్వేనెంబర్-129/68 (పైకి) అని తీర్పు కూడా వచ్చిందని, ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అనుమతులు కూడా తీసుకున్నామని, నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. సిటీ సివిల్ కోర్టు, ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు, సుప్రీంకోర్టు అన్ని న్యాయస్థానాలు ఇప్పుడు వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ స్థలం సర్వేనెంబర్-129/68 (పైకి)లో ఉందని స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని పేర్కొన్నారు. తాము ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా వెళ్లడం లేదని, జీహెచ్ఎంసీ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితేనే జోక్యం చేసుకోవాలని, మిగతా విషయాల్లో ఆ స్థలంలోకి వెళ్లవద్దని హైకోర్టు కూడా జీహెచ్ఎంసీని ఆదేశిస్తూ ‘నాట్ ఇంటర్‌పియర్’ ఉత్తర్వులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఓ అనే వ్యక్తి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని, ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తాము ఫిర్యాదు కూడా చేయనున్నామన్నారు. ఎవరో చెబితే జీహెచ్ఎంసీ ఎలా తమ నిర్మాణాలను అడ్డుకుంటుందని ప్రశ్నిస్తూ న్యాయస్థానం తీర్పులనే ధిక్కరిస్తున్నారని, వారిపై కూడా కోర్టు ధిక్కరణ కేసులు వేస్తామన్నారు. ఈ స్థలానికి సంబంధించి రెవెన్యూకు ఎలాంటి సంబంధం లేదని, వారు కూడా జోక్యం చేసుకోవడానికి వీల్లేదని, సుప్రీం తీర్పు కూడా ఇదే స్పష్టం చేసిందన్నారు. ఈ స్థలం సర్వే నెంబర్ 129/68 (పైకి) అని, అన్ని కోర్టులు తమకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని, అందుకు అనుగుణంగానే తాము భవన నిర్మాణాలు చేపట్టామని, ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ జోక్యం చేసుకోవడం చట్టవిరుద్ధమని వెల్లడించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్8 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సిమ్ యాక్టివేట్ చేయమంటే దాడి

వెంగళరావునగర్: సిమ్ కార్డు యాక్టివేట్ చేయమంటే యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌కు చెందిన నాగావత్ శంకర్ ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ యాదగిరినగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 14న మధురానగర్ మెట్రోస్టేషన్ పక్కన ఉన్న మాతాజీ మొబైల్‌షాపుకు వెళ్లి ఎయిర్‌టెల్ సిమ్ కార్డును కొనుగోలు చేశాడు. ఓనర్ రెండు గంటల్లో యాక్టివేట్ అవుతుందన్నారు. అయితే 24 గంటలైనా కాలేదు. దాంతో తర్వాతి రోజు వెళ్లి అడగ్గా అతని తమ్ముడు పావుగంటలో అవుతుందన్నాడు. ఆ రోజు కూడా కాలేదు. మరో రోజు వెళ్లి అడగ్గా షాపు యజమాని రామ్‌నివాస్ కుమావత్ అతనిపై దుర్భాషలాడటమే కాకుండా శంకర్‌పై దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్సల అనంతరం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జనగాం జిల్లాకు చెందిన భూక్యా శ్రీను ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ స్థానిక ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉంటున్నాడు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనాన్ని అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసి లోపలకు వెళ్లి తిరిగి వచ్చి చూడగానే తన వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా వ్యక్తిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అన్నం నాగేశ్వరరావు అనే వ్యక్తి పవర్ ప్రాజెక్ట్ మోడల్ తయారు చేయడానికి మూడు నెలలుగా ఎల్లారెడ్డిగూడలోని సాయి తెలుగు బాలుర హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి తన విధులు ముగించుకుని హాస్టల్‌కు వస్తున్న సమయంలో అదేదారిలో ఉన్న ఎస్‌హెచ్ హాస్టల్ ఓనర్, అతని భార్య, కుమారుడు కలిసి అతనిని ఆపి తమపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేశామంటూ తీవ్రమైన దుర్భాషలాడుతూ కొట్టారు. ఈ సమయంలో హాస్టల్‌లో ఉండే సురేష్ అనే వ్యక్తి హాస్టల్‌లోనికి పిలుచుకుపోయాడు. అయినా వారు వచ్చి అతనిపై కూడా దాడి చేశారు. దాంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆశయ పథంలో నేను’ ఆవిష్కరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

వెంగళరావునగర్: కమ్యూనిస్టులను చూడగానే ముందుగా గుర్తుకు వచ్చేది నీతి నిజాయితీ అని ఇంతటి గొప్ప భావజాలం వారిలో అనువణువునా పుణికిపుచ్చుకుని ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ తెలియజేశారు. సీపీఎం రాష్ట్ర నాయకులు చెన్నుపాటి చంద్రశేఖర్‌రావు ఆయన సతీమణి వాణిల వివాహ స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమం మధురానగర్‌కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా చంద్రశేఖర్‌రావు రచించిన ‘ఆశయ పథంలో నేను’ అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీ ఆశయాలు, ఉద్యమాలు ప్రజా సంక్షేమంలో కీలకపాత్ర వహిస్తాయని తెలియజేశారు. అనంతరం చంద్రశేఖర్‌రావు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, సీపీఎం సెక్రటేరియేట్ మెంబర్ వీరయ్య, సీపీఎం సీనియర్ నాయకులు డీ.జీ.నర్సింహారావు, జ్యోతి, పి.సుదర్శన్‌రావు, రవీందర్, అశోక్, సాయిశేషగిరిరావు, స్వామి పెద్ద సంఖ్యలో సీపీఎం నాయకులు, చంద్రశేఖర్‌రావు, కుటుంబీకులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లండ్‌లో వైద్యసేవలకు మూడు దశల్లో లైసెన్స్

అపోలోలో డాక్టర్ మో సోభి ‘ప్రత్యేక మాస్టర్‌క్లాస్’

లక్డీకాపూల్: ఇంగ్లండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి కావాల్సిన లైసెన్స్ పొందడానికి మూడు దశలు ఉన్నాయని ప్రపంచ ప్రఖ్యాత ఉక్మాలా/ప్లాబ్ సీఈవో, ఫౌండర్ డాక్టర్ మో సోభి చెప్పారు. అందులో ఒకటి ఇంగ్లిష్ పరీక్ష అన్నారు. ఇంగ్లిష్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన రెండేళ్లలోపు ఉక్మాలా స్టెప్ 1, స్టెప్ 2 ఈ రెండు పరీక్షలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. దీని కోసం వైద్య విద్యార్థులు మెడికల్ డిగ్రీ, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో తమ కెరీర్‌లో ముందుకు సాగాలనుకునే వైద్య నిపుణులు, విద్యార్థుల కోసం అపోలో మెడికల్ కాలేజీలో అపోలో ఎడ్యుకేషన్ యూకే ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ మో సోభి ‘ప్రత్యేక మాస్టర్‌క్లాస్’ తీసుకున్నారు. ఈ ఒన్ డే ప్రోగ్రామ్‌లో భారతీయ వైద్య గ్రాడ్యుయేట్లకు ప్రొఫెషనల్, లింగ్విస్టిక్ అసెస్‌మెంట్స్ బోర్డ్ ఎగ్జామినేషన్‌ను నావిగేట్ చేయడానికి అవసరమైన అవగాహన, నైపుణ్యాలను అందించారు. యూకేలో వైద్య విద్య అభ్యాసానికి కీలకమైన దశ డాక్టర్ మో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను ఉక్మాలా పరీక్షపై రచించిన పుస్తకాన్ని త్వరలో ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఉక్మాలా-ప్లాబ్ పరీక్షల సంబంధించిన సమగ్ర అవగాహనకు ఈ నెల18న చిత్తూరులో మరో మాస్టర్ క్లాస్ నిర్వహిస్తామన్నారు. యూకేలోని క్రూలోని అపోలో ఎడ్యుకేషన్ యూకే క్యాంపస్‌లో ఉక్మాలా/ప్లాబ్2 అకాడమీని కూడా నిర్వహిస్తున్నట్టు డాక్టర్ మో సోభి పేర్కొన్నారు.

కులసంఘాల నాయకులు ఐక్యతతో ముందుకుసాగాలి


నాయకులకు అభినందిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: కుల సమస్యల సాధనలో వడ్డెర సంఘం నాయకులు ఐక్యతతో ముందుకు సాగాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సూచించారు. నూతనంగా నియమితులైన తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షుడు ఇ.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీను, రహమత్‌నగర్, వెంగళ్‌రావునగర్ డివిజన్ల అధ్యక్షులు మల్లేశ్, వెంకటేశ్ ఆదివారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కుల సంఘాల సమస్యల పరిష్కారంలో తాను ముందుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... వడ్డెరలు అనాదిగా అణిచివేతకు గురవుతున్నారని, వారిని చైతన్య పరిచే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కులాల కార్పొరేషన్ల ఏర్పాటు చరిత్రాత్మకం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. ఆదివారం కాచిగూడలో జరిగిన కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినప్పటికీ వివిధ కుల సంఘాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కులగణనపై ప్రభుత్వం జీవో జారీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి పాలకమండళ్లను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి విభిన్న రకాల పూలతో నిర్వహించిన పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈ పుష్పయాగం పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని మంత్రముగ్ధులయ్యారు. పది రోజుల పాటు ఆలయంలో నిర్వహించిన వాహన సేవలు, వివిధ పూజాదికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ అధికారులు తెలిపారు.


పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఆకట్టుకున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి ప్రియాంక రామన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను సినీ నటి ప్రియాంక రామన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చేనేత కళాకారులు, డిజైనర్లు రూపొందించిన పలు డిజైనరీ వస్త్రాలతో పాటు మహిళలకు ఆభరణాలు ఇక్కడ ప్రత్యేకంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సినీ నటి ప్రియాంక రామన్ మాట్లాడుతూ... చేనేతలను ప్రోత్సహించేలా ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

బీసీలు సంఘటితంగా ఉద్యమించాలి

లిబర్టీ: బీసీల సంఘటిత శక్తి నిరూపించాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి అన్నారు. విడిపోతే పడిపోతాం ఐక్యంగా ఉంటే రాజ్యాధికారాన్ని సాధిస్తాం అన్న విషయాన్ని బీసీలంతా గమనంలోకి తీసుకోవాలని కోరారు. బీసీలు ప్రస్తుతం కీలక ఘట్టంలో ఉన్నారని సంఘటిత శక్తిని చాటి అధికారం చేపట్టేందుకు సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత చాటాలని విన్నవించారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్న పాలకులు గద్దెనెక్కిన తరువాత ఆ వర్గం అభ్యున్నతి సంక్షేమాన్ని విస్మరిస్తూ చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత చాటి కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించి తీరాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు పదేళ్ల కాలంలో ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా బీసీల పట్ల ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే బీసీల బతుకులు ఆగమవుతాయని.. ఈ విషయాన్ని బీసీలు గమనంలోకి తీసుకోవాలని కుమారస్వామి సూచించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణశర్మ

వెంగళరావునగర్: పాదచారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని రాజీవ్ నగర్‌కాలనీ సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జి. కృష్ణశర్మ అన్నారు. రాజీవ్‌నగర్‌కాలనీ కూడలిలో కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సురేష్ తమ తల్లిదండ్రులు ఎం.వి.సుబ్బారావు, ఎం.వి.ఎస్.రాజ్యంల జ్ఞాపకార్థం ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కృష్ణశర్మ మాట్లాడుతూ... ఐదేళ్లుగా ఫ్రిజ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చల్లని నీటిని పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. కాలనీ నేతలు మోహన్‌రావు, భుజంగరావు, భద్రుద్దీన్, వివేకానంద, నరసింహారావు, సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్, యోగా గురువు ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

సనత్‌నగర్: ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు దోహదపడాలని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య విజ్ఞప్తి చేశారు. ఆస్తి పన్ను సమస్యలకు జీహెచ్ఎంసీ నిర్దేశించిన తేదీల్లో పరిష్కార వేదికలను సర్కిల్ కార్యాలయంలో నిర్వహించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన పరిష్కార వేదికలో ఆస్తి పన్ను సమస్యలపై 17 దరఖాస్తులను వచ్చాయని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థిక సంవత్సరం మరికొన్ని రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తి పన్ను బకాయిదారుల కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక ఆఫర్‌ను కల్పించిందన్నారు. మొండి బకాయిలకు సంబంధించి వడ్డీపై 90 రాయితీ కల్పించడం జరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకుని ఈ నెల 31 వరకు ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లను నూటికి నూరు శాతం లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇటీవల స్పెషల్ ఆఫీసర్ ఐఏఎస్ అధికారి శ్రీవత్సా కోట నిర్వహించిన సమావేశంలో సైతం తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. బేగంపేట సర్కిల్ పరిధిలో రూ.108 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, 80 శాతం వరకు పూర్తి చేశారన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి

నల్లకుంట: సంఘర్ జాతి సంఘం విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీ కమ్యూనిటీ హాల్‌లో సంఘ సంస్కర్త సంత్ శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జయంతి నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎంబీ కిశోర్ కుమార్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.మధుసూదన్, ఎస్సీ మోర్చా అంబర్‌పేట కన్వీనర్ మంగి శివ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

ఖమ్మం మయూరి సెంటర్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న ఈయూ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.పద్మాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్అలీ, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట్గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు, జె.రాఘవ, ప్రచార కార్యదర్శిగా సి.శంకర్, కోశాధికారిగా జి.డి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ సభలకు రాష్ట్రంలోని 95 డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై గీత కార్మికుడి హఠాన్మరణం


చెట్టుపై తలకిందులైన వెంకన్నను కిందకి దించుతున్న గీత కార్మికులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లాలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టుపైనే గుండెపోటుతో మృతిచెందాడు. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్ (40) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వెంకన్నగౌడ్ రోజూ మాదిరిగా కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. వెంకన్న చెట్టు పైభాగానికి ఎక్కగానే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తలకిందులయ్యాడు. తోటి గీత కార్మికులు ఇది గమనించి అతడిని కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

నృసింహస్వామి పెళ్లికొడుకాయెనే..

యాదగిరిగుట్టలో వైభవంగా స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం ● నేటి రాత్రి శ్రీస్వామి కల్యాణోత్సవం


ఆదివారం రాత్రి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎదుర్కోలు మహోత్సవాన్ని జరిపిస్తున్న ఆలయ ఆచార్యులు


స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా జరిపించారు. ఉదయం ప్రధానాలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారు జగన్మోహిని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక సాయంత్రం శ్రీస్వామి వారు అశ్వవాహనంపై పెండ్లి కొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారిని సేవోత్సవంగా ఆలయ మాడవీధిలో ఊరేగించారు. అనంతరం ఆచార్యులు, అధికారులు స్వామి వారి పక్షాన, అమ్మవారి పక్షాన చేరి గుణగణాలను చర్చించుకున్నారు. శ్రీనృసింహస్వామికి లక్ష్మీదేవితో వివాహం జరిపేందుకు ముహూర్తాన్ని ఆచార్యులు నిర్ణయించారు.

గజవాహనంపై కల్యాణోత్సవానికి..

తిరుకల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి 8.45 గంటలకు గజవాహనంపై శ్రీస్వామి, ప్రత్యేక పల్లకిపై అమ్మవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ 9.15 గంటలకు ఉత్తర దిశలోని రథశాల ముందు ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఆ తరువాత శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకను ఆచార్యులు, వేద పండితులు పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వేద మంత్రాలతో ప్రారంభిస్తారు. తుల లగ్న ముహూర్తంలో రాత్రి 9.37 గంటలకు శ్రీస్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ చేయనున్నారు. ఇక ఉదయం శ్రీస్వామి వారు శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై ఊరేగనున్నారు.

యాదాద్రీశుడి కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవాలకు టీటీడీ తరఫున ఆదివారం పట్టు వస్త్రాలను అందజేశారు. ఉదయం టీటీడీకి చెందిన ఉప కార్యనిర్వహణాధికారి లోకనాథం మేల్చాట్ పట్టు వస్త్రాలను తీసుకొని, ఆలయ మాడ వీధిలో ఊరేగింపుగా వచ్చారు.జగన్మోహిని అలంకార సేవ ముందు పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులకు అందజేశారు.

యాదాద్రి స్వామికి వాహన సేవలు బహూకరణ


మహా బలిపురం నుంచి తీసుకువచ్చిన వాహనాలు

యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సేవోత్సవంలో వినియోగించే వాహన సేవలు బంగారుమయంగా మారనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ దాత గజ, గరుడ, శేష వాహనాలను పంచ లోహంతో తయారు చేయించి ఆదివారం యాదాద్రి ఆలయానికి తీసుకువచ్చారు. తమిళనాడులోని మహాబలిపురంలో రవీంద్రన్ స్థపతి ఆధ్వర్యంలో ఈ వాహనాలు ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నాయి. వీటిని శిల్పులు యాదాద్రికి తీసుకురావడంతో ఆలయ ప్రధానార్చకులు పరిశీలించారు. ఆయన సూచనల మేరకు గజ, గరుడ, శేష వాహన సేవలను తిరిగి మహాబలిపురం తీసుకెళ్లి, బంగారు తాపడం పనులు చేయనున్నట్లు తెలిసింది. 20 రోజుల తరువాత దాత..ఆలయాధికారులు, ఆచార్యులకు అందజేయనున్నట్లు సమాచారం.

కువైట్‌లో మళ్లీ క్షమాభిక్ష అమలు

- జూన్ 17 వరకు 90 రోజుల పాటు చాన్స్
- జరిమానా, జైలు శిక్ష లేకుండా సొంతూరికి వెళ్లడానికి అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): వీసా గడువు ముగిసిపోయినా చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు వారి సొంత గడ్డకు వెళ్లడానికి కువైట్ ప్రభుత్వం ఆమ్నెస్టీ (క్షమాభిక్ష)ని ప్రకటించింది. ఆదివారం మొదలైన క్షమాభిక్ష.. జూన్ 17వ తేదీ వరకు కొనసాగనుంది. చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు తమ దేశాలకు వెళ్లిపోవడానికి కువైట్‌లోని ఎంబసీల్లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. కరోనా సమయంలో క్షమాభిక్ష అమలు చేయగా, నాలుగేళ్ల విరామం తర్వాత మరోసారి ఆమ్నెస్టీని ప్రకటిస్తూ కువైట్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. కువైట్‌లో వివిధ దేశాలకు చెందిన వలసదారులు 1.65 లక్షల మంది ఉన్నారని అంచనావేస్తున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల కార్మికులు సుమారు 15 వేల మంది వరకు ఉంటారని కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. కరోనా సమయంలో 2020లో అమలు చేసిన అమ్నెస్టీతో భారీ సంఖ్యలో కార్మికులు ఇంటిబాట పట్టారు. ఇప్పుడు మరోసారి క్షమాభిక్ష అమలు చేస్తుండటంతో పెద్ద సంఖ్యలోనే వలస కార్మికులు సొంతగడ్డకు చేరుకునే అవకాశం ఉందని అంటున్నారు. క్షమాభిక్ష అమలు చేసిన సమయంలో వీసా గడువు ముగిసినవారు ఎలాంటి జరిమానా చెల్లించకుండా, జైలు శిక్ష అనుభవించకుండానే ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుంది.

'రావి' విగ్రహ నమూనా చిత్రానికి ఆమోదం



భువనగిరి రూరల్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి రూపొందించిన నమూనా చిత్రానికి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆమోదం తెలిపింది. ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లెపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ నమూనా కోసం భువనగిరి జోత్స్న వేసిన చిత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కుటుంబ సభ్యుల వద్ద ఉన్న ఫొటోల ఆధారంగా, రావి నారాయణరెడ్డి సమకాలికుల సలహాలు, సూచనల ద్వారా మెరుగులు దిద్ది రావి ఆకృతిని చిత్రించినట్లు జోత్స్న తెలిపారు. జూన్ 4న రావి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మొదట ప్రకటించినా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అదేరోజు రానుండడంతో విగ్రహ ఆవిష్కరణ తేదీని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి రావి సుఖేశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రావి ప్రభాకర్ రెడ్డి, చెరుకుపల్లి మహేశ్, రావి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వడగళ్లవానతో భారీ నష్టం

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 26,129 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రేకుల షెడ్డు కూలి రెండు ఆవులు, నాలుగు దూడల మృత్యువాత

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లాలో 15 మండలాల్లోని 130 గ్రామాల్లో 20,071 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో 14,553 మంది రైతులు నష్టపోయారని నివేదికలో పేర్కొన్నారు. వరి 16,298 ఎకరాల్లో, మక్క 2,784.16 ఎకరాల్లో, జొన్న 705.2 ఎకరాల్లో, గోధుమ ఐదు ఎకరాల్లో, ఉల్లిగడ్డ 12 ఎకరాలు, బొప్పాయి పది ఎకరాలు, పొగాకు 20 ఎకరాలు, మామిడి 192 ఎకరాలు, కూరగాయలు 45 ఎకరాల్లో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రహ్మజీవాడి గ్రామంలో గాలిదుమారానికి రేకుల షెడ్డు కూలిపోవడంతో అందులో ఉన్న రెండు ఆవులు, నాలుగు దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరోనాలుగు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 6,058 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పది మండలాల్లోని 44 గ్రామాల్లో వడగళ్లు బీభత్సం సృష్టించాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 3,076 మంది రైతులు నష్టపోయారన్నారు. అత్యధికంగా 5,661 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. 292 ఎకరాల్లో మక్క, 93 ఎకరాల్లో జొన్న, 12 ఎకరాల్లో నువ్వుల పంట దెబ్బతిన్నదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.


కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మైలారంలో నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు

ఎండ రాకుండానే శ్లాబ్ వేద్దామని వెళుతూ..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. చికిత్స పొందుతూ మరొకరు
- ముగ్గురూ తాపీ పనులు చేసేవారే..

కోరుట్ల: తెల్లవారక ముందే ముగ్గురి బతుకులు తెల్లారిపోయాయి. ఎండ ముదరక ముందే శ్లాబ్ వేసే పనులు పూర్తి చేయాలన్న ఆత్రుత లారీ రూపంలో వారిని బలిగొంది. స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కొండసముద్రం గ్రామానికి చెందిన బడికెల వేణుగోపాల్(32) తల్లిదండ్రులు జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు–ముత్యంపేట గ్రామానికి 25 ఏళ్ల క్రితం వలస వచ్చారు. తాపీమేస్త్రీ అయిన వేణుగోపాల్ మెట్‌పల్లిలోని ఓ ఇంటి నిర్మాణానికి శ్లాబ్ వేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఆ పనులు చేసేందుకు తను నివసించే గ్రామానికి చెందిన కూలీలు పసులోటి శ్రీకాంత్(26), కొమురం వెంకటేశ్(34)లను తీసుకొని మోటార్‌సైకిల్‌పై ఆదివారం వేకువజామున 4.30 గంటలకు మెట్‌పల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 5.45 గంటలకు మోటార్‌సైకిల్‌పై కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్ శివారు దాటుతుండగా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న పసులోటి శ్రీకాంత్, కొమురం వెంకటేశ్ ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న వేణుగోపాల్ తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ఉండగా, పోలీసులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.


వేణుగోపాల్, శ్రీకాంత్, వెంకటేశ్ (ఫైల్)

ఘటనాస్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, మేడిపల్లి ఎస్ఐలు కిరణ్, శ్యాంరాజ్, శ్వేత పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీతో పరారయ్యాడని, నంబరు ఆధారంగా రాజస్తాన్‌కు చెందిన లారీగా గుర్తించామని సీఐ తెలిపారు. వేణుగోపాల్‌కు భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉండగా, శ్రీకాంత్ భార్య శిరీష 7 నెలల గర్భిణి కావడంతో మృతుల బంధువర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వెంకటేశ్‌కు బంధువులెవరూ లేకపోవడంతో కోరుట్ల అధికారులు అంత్యక్రియలు నిర్వహించారు.

నగర వార్తలు

బహు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి 'చిలకమర్తి'



చిక్కడపల్లి: పౌరాణిక నవలలు, నాటకాలు, ప్రవాసనాలు అనువాదాలు పలు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం అని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న దశాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాజమండ్రిలో జన్మించిన చిలకమర్తి కందుకూరి వీరేశలింగం పంతులుకు అండగా నిలిచారన్నారు. దళితుల కోసం ప్రత్యేకంగా విద్యాలయం స్థాపించి ఉచితంగా చదువులు చెప్పించారని కొనియాడారు. హాస్యావధాని జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ హాస్య రచనలోనూ చిలకమర్తి దిట్టని ఆయన రచించిన గణపతి నవల ఇందుకు ఉదాహరణ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంచే కళా ప్రపూర్ణ అవార్డు అందుకున్న చిలకమర్తి రాసిన గయోపాఖ్యానం నాటకం నేటికి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో కవిచక్ర తంగిరాల, సామాజికవేత్త వైకుంఠం పాల్గొన్నారు.

బీసీ సమస్యల పరిష్కారానికి త్వరలో కార్పొరేషన్లు



బంజారాహిల్స్: బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి త్వరలో కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం తెలంగాణ బీసీ కులాలకు చెందిన పలువురు నేతలు మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల సమస్యలపై చర్చించారు. సమస్యలపై స్పందించిన మంత్రి అతి త్వరలోనే కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వేముల వెంకటేష్, ఉప్పరి శేఖర్, పాల్వాయి శ్రీనివాస్ నాయీ, కోల శ్రీనివాస్, చిరుకల శంకర్, రమేష్ కొడిచర్ల తదితరులు ఉన్నారు.

వేడెక్కిన రాజకీయం

- అప్రమత్తమైన రాజకీయ పార్టీలు
- మల్కాజిగిరిలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
- బీజేపీ అభ్యర్థి ఈటల దూకుడు
- ఇప్పటికే మోదీ రోడ్ షో, అమిత్‌షాతో సమావేశం
- అభ్యర్థి ఖరారుపై కాంగ్రెస్ కసరత్తు
- నేడో, రేపో అధికారికంగా ప్రకటించే అవకాశం
- తెరపైకి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పేరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంటు ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయం వేడెక్కింది. పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై జెండా ఎగురవేసేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గంగా గుర్తింపు పొందిన మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

మూడు జిల్లాలు.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు

నగరంతోపాటు శివారు జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగి ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ స్థానంలో ఇప్పటికే భారతీయ జనతా పార్టీ(బీజేపీ), భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)అభ్యర్థులను ప్రకటించగా... కాంగ్రెస్ గెలుపు గుర్రం కోసం అన్వేషిస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత రాష్ట్రంతో పాటు నగర శివారు జిల్లాల్లోనూ రాజకీయ సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుండటంతో ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న మల్కాజిగిరి ఎంపీ పరిధిలో ప్రస్తుతానికి 37,28,519 ఓటర్లు ఉన్నారు. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 6,58,190 మంది ఓటర్లు ఉండగా, మల్కాజిగిరిలో 4,99,538, కుత్బుల్లాపూర్‌లో 7,12,756, కూకట్‌పల్లిలో4,71,878, ఉప్పల్‌లో 5,33,544, ఎల్బీనగర్‌లో 6,00,552, కంటోన్మెంట్‌లో 2,52,060 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు వరకు కూడా అర్హులైన వారు కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

పార్టీలు అప్రమత్తం

మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కావటంతో ... కాంగ్రెస్ వైఖరి ఎలా ఉంటుందనే దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాలను ఆయా పార్టీలు ప్రకటించటంతో వారు ప్రచారంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచార పర్వంలో ముందున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించిన ఆయన బస్తీలు ,పురపాలక సంఘాలు ,డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. ఈటల విజయం కోసం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజవర్గ పరిధిలో పార్టీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పాల్గొని ఎన్నికల శంఖారాన్ని పూరించగా, శుక్రవారం భారత ప్రధాని మోదీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్ షో కార్యక్రమాన్ని చేపట్టి బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపారు. కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ నెలకొనడంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. కాంగ్రెస్ అధిష్టానం తాజాగా పట్నం సునీతా మహేందర్ రెడ్డి పేరు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె పేరును అధికారికంగా నేడో ,రేపో ప్రకటించవచ్చునని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

బీజేపీలో అసమ్మతిపై దృష్టి

బీజేపీలో టికెట్ కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించిన కొందరు నేతలు పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. టికెట్ ఆశించిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్ అధ్యక్షుడు పి.హరీష్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే పార్టీ పెద్దలు అసంతృప్తి నేతలను బుజ్జగించటంతో పాటు అభ్యర్థి ఈటల గెలుపు కోసం పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

మోదీ ప్రభుత్వాన్ని యువత నిలదీయాలి



ముషీరాబాద్: యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ పదేళ్లల్లో యువతను మోసం చేశారని, యువతరం బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్ అన్నారు. ఆదివారం మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012లో 2.1 శాతం ఉన్న నిరుద్యోగం 2024 నాటికి 6.6 శాతానికి పెరిగిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం రూ.14.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందన్నారు. రైల్వే రంగాల నుంచి ఎల్ఐసీ వరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం లేకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిని కొనసాగిస్తున్నారన్నారు. మార్చి 23న రాష్ట్ర వ్యాప్తంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రవికుమార్, సహాయ కార్యదర్శులు ప్రతాప్, రాకేష్, కోశాధికారి బుచ్చిరాజు, సభ్యులు భూషణవేణికృష్ణ, పెండ్యాల రమేష్, దేవ, నవీన్, సిద్ధు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న యూఎస్ఏ, కెనడా అడ్మిషన్ డే

బంజారాహిల్స్: యూఎస్ఏ, కెనడా దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థిని, విద్యార్థుల కోసం యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో యూఎస్ఏ అడ్మిషన్ డే నిర్వహిస్తున్నట్లు సంస్థ ఆపరేషన్ హెడ్ ఉమా తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ యూఎస్ఏ, కెనడాల్లో చదవాలనుకునే విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు, తల్లిదండ్రులు వీసా రిక్రూట్‌మెంట్స్, అడ్మిషన్ రిక్రూట్‌మెంట్స్, స్కాలర్‌షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్‌డేట్స్, ప్రవేశానికి హామీ తదితర అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9912328645 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జాతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ బ్యాంకులన్నిటినీ కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామీణ బ్యాంకులు దేశంలో 40 కోట్ల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నాయన్నారు. 90 శాతం మంది ప్రజలు బ్యాంకులు లేని చోట కూడా తమ బ్యాంకు సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ యూనియన్ పూర్వ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కారింగు భిక్షమయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భిక్షమయ్య దేశంలో, రాష్ట్రంలో బ్యాంకింగ్ ఉద్యోగుల సమస్యలపై 32 ఏళ్ల పాటు పోరాటాలు చేశారన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికే తప్ప వయస్సుకు కాదని భిక్షమయ్య సేవలు అనేక రకాలుగా ఉపయోగపడతాయన్నారు. ఇతర బ్యాంకులతో సమానంగా గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సర్వీస్ కండీషన్లు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దేశంలోని కార్మిక చట్టాలను బ్యాంకింగ్ రంగంలో పని చేస్తున్న వారికి కూడా సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఆర్ఆర్‌ఈఏ అధ్యక్షులు బి.రవికాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి, ఏపీజీవీబీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.వేణురావు, రాజు, వివిధ సంఘాల నాయకులు జె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుమటాలజీ సమస్యలపై అవగాహన అవసరం




బంజారాహిల్స్: చిన్న పిల్లల్లో రుమటాలజికల్ వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ వ్యాధిపట్ల చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన అవసరమని పీడియాట్రిక్ రుమటాలజిస్ట్, ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ అంజనీ గుమ్మడి అన్నారు. ప్రపంచ యంగ్ రుమాటిక్ డిసీజ్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని అంకుర ఆస్పత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు పెయింటింగ్‌తో పాటు పలు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంగెస్ట్ మౌంట్ ఎవరెస్ట్ క్లైంబర్ మిస్ పూర్ణ మలావత్ చిన్నారులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ అంజనీ మాట్లాడుతూ యూఎస్‌లో ప్రతి వెయ్యి మందిలో నలుగురు చిన్నారులు ఈ రుమటలాజికల్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. మన దేశంలో ఎంత మంది చిన్నారుల్లో ఈ వ్యాధి ఉందో ఈ వ్యాధి లక్షణాలు ఏంటో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. చిన్నారులు తరచూ జ్వరం, దద్దుర్లు వస్తున్నా, జాయింట్ల దగ్గర నొప్పులు అంటున్నా, సరిగ్గా నిలబడలేకపోతున్నా, నడవలేకపోతున్నా వెంటనే పీడియాట్రిక్ రుమటాలజిస్టులను సంప్రదించాలని సూచించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే మంచి వైద్యం అందిస్తే పిల్లలు కోలుకుంటారని లేనిపక్షంలో పిల్లలు కంటి చూపు కోల్పోవడంతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 18-3-2024

సన్నిధి

మంచిమాట

భక్తి అంటే ఏమిటి? వేదాంత గ్రంథాలిచ్చే నిర్వచనాల జోలికి వెళ్లవద్దు మనం. మామూలు మాటల్లో అర్థం కావటానికి భక్తి అంటే ఏమిటి? చాలామంది అభిప్రాయంలో ఫోటో పెట్టి, దండలు వేసి, పూలు, అగరొత్తులు, దీపాలు పెట్టి నివేదన చెయ్యటం, దణ్ణం పెట్టటం అనుకుంటారు. అది భక్తా? ఒకరకంగా తను మారకుండా ఉండటాన్ని సమర్థించుకునే ప్రయత్నం. "ఆయన మహానుభావుడు కనుక అట్లా చేయగలిగాడు. మన వంటి సామాన్యులకి సాధ్యమా?" అని తప్పించుకునే మార్గం. అట్లా పూజ చెయ్యటం తప్పు అని కాని, చెయ్య కూడదని కాని చెప్పటం లేదు. అది ఒకరకం. దానివల్ల ఒరిగేది ప్రత్యేకంగా ఏమీ లేదు. అది ఒక క్రమశిక్షణ. చిత్త శుద్ధిని కలిగిస్తుంది. ఇది మొదటిమెట్టు అని చెప్పవచ్చు. కానీ చాలా మంది ఇదే పరమార్థం అనుకుంటారు.



భక్తి అంటే..?

కొంత మంది అనుకరించటమే భక్తి అనే భ్రమలో ఉంటారు. అనుకరించటానికి, అనుసరించటానికి చాలా వ్యత్యాసం ఉంది. వారిలాగా ఉండే ప్రయత్నం అనుకరణ. ఇది భౌతికంగా తమ ఆదర్శమూర్తుల లాగా ఉండేట్టు చేస్తుంది. చూడగానే ఫలానా వారి అభిమానులని తెలియ చేస్తుంది. కాని వారిస్థాయికి చేర్చదు. అయితే అనుకరణ పనికి రానిదని చెప్పటానికి వీలు లేదు. అది రెండవ మెట్టు.

ఒకరిపట్ల భక్తి ఉన్నది అంటే వారు చెప్పిన దానిని చెప్పినట్టు అనుసరించటమే. భక్తిలో ప్రశ్నలకు, సందేహాలకు, వాదోపవాదాలకు తావుండదు. నోటితోనే చెప్పనక్కర లేదు. వారి ప్రవర్తనను చూసి అనుసరించవలసి ఉంటుంది. ''మీ బొమ్మకి పూజ చేస్తాం, కాని, మీరు చెప్పినట్టు చెయ్యటం మావల్ల కాదు, మీరు ఉన్నట్టు ఉండటం అసాధ్యం'' అంటే అది భక్తి అనిపించుకోదు. భగవంతుడివిషయంలోనైనా అంతే! దేవుణ్ణి గదికే పరిమితం చేసి, పూజచేసిన కొద్దిసేపు మాత్రం ఆయన్ని తలచుకొని, తరువాత దుర్మార్గంగా లోకకంటకంగా ప్రవర్తిస్తే అది భక్తి అనిపించుకోదు. పరమాత్మ నిర్దేశించిన విధంగా, ఆయన మెప్పు వడసే పద్ధతిలో ప్రవర్తిస్తే అది నిజమైన భక్తి.

సాటిమనిషి మీద సానుభూతి, జాలి చూపించలేని వాడు, ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రేమించ లేని వాడు, తనకి హాని చేసిన శత్రువుని కాక పోయినా కనీసం ఎదుటివాడిని క్షమించలేని వాడు విశ్వాసి ఎలా అవుతాడు? పొరుగువారిని తనవలే ప్రేమించమని చెప్పిన ఏసు క్రీస్తు అంటే భక్తి ఉంటే ఆయన చెప్పిన మాటలని పాటించాలి, ఆయనలాగా ప్రవర్తించాలి. ఆయన మార్గాన్ని అనుసరించాలి.

> శ్రీరాముడు పితృభక్తి కలవాడు అని చెపుతాం. అంటే అర్థం తండ్రి చెప్పిన విధంగా జీవించాడు అని. ఆయన మాట జవదాటలేదు. ఆయన తనతోచెప్పిన మాటనే కాదు ఆయన ఎవరికిచ్చిన మాటనైనా పాటించాడు. రాముడి పితృభక్తి, గురుభక్తి విశ్వామిత్రుడు తాటకను సంహరించమన్నప్పుడు మారు మాటాడక సంహరించటంలో వ్యక్తమౌతాయి. తల్లితండ్రులని వృద్ధాశ్రమాలలో ఉంచి "మేము రామభక్తులం" అంటే రాముడిపట్ల అపచారం చేసినట్టే. ఆయనలో ఉన్న కొన్నిగుణాలనైనా అలవరచుకుంటే రామభక్తులు అనిపించుకోగలుగుతారు.

ఎక్కువసేపు వాళ్ళతో ఉండటం వల్లనో, పోలికలు రావటం వల్లనో మనవలు, మనవరాళ్ళు తరచుగా తాతానాయనమ్మల్లాగా ప్రవర్తిస్తూ ఉంటారు. తాతలకి నాయనమ్మలకి, అమ్మమ్మలకి మనవలు, మనవరాళ్ళు అంటే ఇష్టం ఉండటానికి కూడా ఇదే కారణం.

మనుషుల విషయంలోనే ఇలా ఉంటే భగవంతుడి విషయంలో ఆయన చెప్పినట్టు ప్రవర్తిస్తే ఫలితం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. భగవంతుడికి, భక్తుడికి ఉండే సంబంధాన్ని భ్రమర కీట న్యాయంగా చెప్పటం ఈ కారణంగానే. తన చుట్టూ తిరుగుతున్న భ్రమరం చేసే ఝుమ్మనే నాదం విని గూటిలో సుప్తావస్థలో ఉన్న కీటకం దానిని అనుసరిస్తూ తాను కూడాఅటువంటి నాదం చేసే ప్రయత్నంలో భ్రమరం లాగా రూపాంతరం చెందుతుంది. ఈ అనుసరణ అన్నది తానే లక్ష్య వస్తువు అయ్యేట్టు చెయ్యగలదు.

ఒక గురువునో, నాయకుణ్ణో అనుకరించేవారు వారి వలె తయారౌతారే కాని, వారుగా అయిపోరు. వారుగా, కనీసం వారంతటి వారుగా అయిపోవటానికి కావలసినది అనుసరణ మాత్రమే. భగవత్తత్త్వాన్ని అందుకోవాలంటే కూడా అంతే!

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికకథ

అంతయు నీవే...

ఉత్తర భారత దేశంలో స్థిరపడిన ఓ వైద్యుడు తిరుమల పుణ్యక్షేత్ర విశిష్టతను తెలుసుకోమని పదహారేళ్ళ కొడుకును తన స్వంత పల్లెకు పంపాడు. తోడుగా వెళ్ళమని తండ్రిని కోరాడు. అందులో భాగంగా మనవడిని తీసుకుని తాత తిరుమల ప్రయాణం ప్రారంభించాడు.

అలిపిరినుండి ఆనంద నిలయం వరకు కాలి నడకన వెళ్దామని అనుకున్నారు. అలిపిరి పాదాల మండపం చేరారు. అక్కడ స్వామి వారిని సేవించారు. అలిపిరి పాదాలమండపం విశిష్టత తెలియజేస్తూ తాత ''అలిపిరి అంటే 'అల్ప శరీరి' అని కూడా అర్థంగా చెబుతారు. శ్రీ వేంకటేశ్వర స్వామి సూక్ష్మ శరీరంతో ఇక్కడ భక్తులను అనుగ్రహిస్తుంటారని భక్తుల నమ్మకం'' అన్నాడు.

ఆ తర్వాత శ్రీవారి లోహ పాదుకలను భక్తి ప్రపత్తులతో నెత్తిన పెట్టుకుని గర్భగుడి ప్రదక్షిణ చేయమని మనవడికి చెప్పాడు తాత.

ఆశ్చర్యంగా మనవడు ''పాదుకలను నెత్తిన పెట్టుకోవడంలో అర్థమేమిటి?'' అని అడిగాడు. ''సనాతన భారతీయ తాత్త్విక ఆరాధనలో పాదాల ఔన్నత్యానికి ఇదో మచ్చు తునక. ఇత్తడి, వెండితో చేసిన పాదుకలను చాలామంది భక్తులు ఇక్కడ స్వామివారికి మొక్కుగా చెల్లించుకుంటారు!'' అని బదులిచ్చాడు తాత. తాత సమాధానానికి సంతృప్తి చెందిన మనవడు గోవింద నామస్మరణలు చేస్తూ గుడి ప్రదక్షిణం చేశాడు. కొండపైకి వెళ్ళడానికి చిన్నగా నడక ప్రారంభించారు. గాలి గోపురం చేరి కొద్దిసేపు అక్కడ కూర్చున్నారు.



అంతసేపూ వారు మెట్లెక్కుతూ పడిన శ్రమంతా, అక్కడ వీస్తున్న చల్లని గాలులకు పటాపంచలయ్యాయి. మెట్ల మహిమలు, మార్మిక సంగతులు, కొండ దోవ కతలు... అనేకం చెప్పాడు తాత.

మళ్ళీ నడక ప్రారంభించి మోకాలి మిట్ట చేరారు. శేషాచలం కొండల్ని చూస్తూ తాత ''నేటి యుగానికి మహర్షులు అందించిన మూడు ఆణిముత్యాలు రామాయణ–భారత–భాగవత గ్రంథాలు'' అన్నాడు. మనవడు ఆసక్తిగా వినడం చూసి ''రామాయణం చదివితే రాములవారి గొప్పతనం, మహాభారతం చదివితే విజ్ఞాన సర్వస్వం, భాగవతం చదివితే శ్రీకృష్ణుడి లీలలు అవగతం అవుతాయి'' అన్నాడు.

''మరి వేంకటేశ్వర స్వామి వారి వైభవం తెలుసుకోవాలంటే ఏ గ్రంథం చదవాలి?'' అని అడిగాడు మనవడు. తాత చిరునవ్వు నవ్వుతూ ''తాళ్ళపాక అన్నమాచార్య కీర్తనలు చదివినా, విన్నా అర్థమవుతుంది స్వామివారి వైభవం, వైభోగం'' అని బదులిచ్చాడు.

''అలాగా...'' అన్న మనవడు గబగబా కొండెక్కి నేరుగా పుస్తక విక్రయశాలకు వెళ్ళి, దొరికిన అన్నమయ్య కీర్తనల పుస్తకాలు, ఆడియోలు కొనుక్కున్నాడు.

ఇద్దరూ స్వామివారి దర్శనం చేసుకుని కొండ దిగారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

వాగ్గేయకార వైభవం

గంగాస్నానం ఎంత గొప్పదంటే...

గంగేమాం పాహి... అంటూ ముత్తుస్వామి దీక్షితార్ వారు చేసిన కీర్తన చివరి చరణాల్లో. ''..సకల తీర్థమూలే సద్గురు గుహలీలే/వరజహ్నుబాలే వ్యాసాది కృపాలే'' అంటారు. దీక్షితార్ వారి కీర్తికి ప్రధాన కారణం గంగమ్మ ప్రసాదంగా లభించిన వీణకాగా మరొకటి తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరుని అనుగ్రహం. సద్గురువు అయిన గుహుడు.. సుబ్రహ్మణ్యుడు గంగానది ఒడ్డున ఆడుకునేవాడని అన్నారు. అక్కడ ఆడుకునేవాడని చెప్పడం వెనుక సుబ్రహ్మణ్య జననం గురించి గుర్తు చేస్తున్నాడు. శివవీర్యం తేజస్సు భరించలేని దేవతలు దానిని అగ్నిహోత్రుని వద్ద ఉంచారు. ఆయన ఒక నాడు గంగమ్మ దగ్గరకు వెళ్ళి...''ఇది దేవతాకార్యం. దీనిని నీవు ఉంచుకుని గర్భం ధరించు'' అన్నాడు. గంగ అంగీకరించింది. అయితే శివ తేజస్సు శరీరం అంతటా ప్రవహించేసరికి తట్టుకోలేక..'నేను వదిలిపెట్టేస్తాను.. ఎక్కడ వదిలిపెట్టేయను' అనడిగింది. ''రెల్లుగడ్డి పొదలో వదిలిపెట్టు'' అని అగ్నిహోత్రుడు సలహా ఇచ్చాడు. అదే శరవణ భవ.. మంత్రం. అక్కడ సుబ్రహ్మణ్య జననం జరిగింది. అందువల్ల బాల సుబ్రహ్మణ్యుడు గంగానదీ ప్రవాహ తీరంలో ఆడుకునేవాడు. అదే సద్గురు గుహలీలే... అన్న చరణం.



బ్రహ్మ, విష్ణు స్పర్శ పొందిన గంగ... సగరుల భస్మరాశిమీదుగా ప్రవహించడానికి పాతాళానికి భాగీరథుడి రథం వెంట పరుగెడుతూన్నది. మార్గమధ్యంలో జహ్నుమహర్షి యజ్ఞవాటికను ముంచెత్తడంతో ఆయన ఆగ్రహించి మొత్తం గంగను తపశ్శక్తితో లోపలకు పుచ్చేసుకున్నాడు. భగీరథుడి అభ్యర్థన మేరకు మళ్ళీ విడిచిపెట్టాడు. అలా గంగ రుషి పుత్రిక జాహ్నవి అయింది. వ్యాసాది కృపాలే... అని కూడా అన్నాడు.. వ్యాసమహర్షికి గంగానది అంటే ఎంత వ్యామోహమో! పరమశివుడు శపిస్తే... గంగను, కాశీని వదిలిపెట్టి పోవడానికి వ్యాసుడు క్షోభిల్లాడు.

గంగకు ఒకగొప్పదనం ఉంది. గంగావతరణమ్ గురించిగానీ, గంగను గురించిగానీ వింటే చాలు... అంటారు భీష్ముడు అనుశాసనిక పర్వంలో అంపశయ్య మీద పడుకుని ధర్మరాజుతో మాట్లాడుతూ –'గంగానది పేరు తలచుకోవడం గానీ, గంగలో స్నానం చేయడం గానీ, ఒక చుక్క గంగనీటిని నాలుకమీద వేసుకోవడం గానీ చేయాలి. ఆచరించవలసినవే అయినప్పటికీ యజ్ఞయాగాదులకన్నా, బ్రహ్మచర్యం కన్నా, తపస్సుకన్నా, దానం కన్నా, గంగాస్నానం గొప్పది'' అంటాడు. కాశీఖండంలో శ్రీనాథుడు...''గౌరియొక్కతె యాకాశగంగ యొకతె/కాశియొక్కతె దక్షిణకాశి యొకతె/నలుగురును శంభునకు లోకనాయకునకు/రాణ్ వాసంబులనురాగ రసమ పేర్మి?'' అని అంటాడు భీమేశ్వర పురాణంలో. అంటే గౌరిని ఎంతగా ప్రేమిస్తాడో శంకరుడికి గంగ, కాశి, దక్షిణ కాశి అన్నా కూడా అంతే అనురాగమట.

ఎవరయితే భక్తితో గంగానది పేరు తలచుకుని ఒక్క గంగనీటి చుక్కను నాలుకమీద వేసుకుంటారో వారికి యమధర్మరాజుతో సంవాదం లేదన్నారు. అంటే వారికి యమదూతల దర్శనం ఉండే అవకాశం లేదు. అంతగొప్పగా గంగానదీ వైభవాన్ని కీర్తించిన ముత్తుస్వామి దీక్షితార్ వారి నోట కీర్తనల రూపంలో ప్రవహించిన శాబ్దికగంగను కూడా మనం నిత్యం వింటూ ఉండాలి.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

సెట్ వర్క్ స్టార్ట్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాను కేఎల్ నారాయణ నిర్మిస్తారు. ఈ సినిమా కథను ఆల్రెడీ రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావొచ్చాయట. కాగా ఈ సినిమా ప్రారంభోత్సవం ఈ ఉగాదికి జరుగుతుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెట్ వర్క్ హైదరాబాద్ శివార్లలోని ప్రాంతాల్లో మొదలైందని, మే కల్లా ఈ భారీ సెట్ వర్క్ పూర్తయ్యేలా టీమ్ టార్గెట్‌గా పెట్టుకున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. జూన్ చివర్లో లేదా జులై మొదటివారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యేలా రాజమౌళి అండ్ కో సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించనున్నారు.


● మహేశ్ బాబు

కల నిజమైంది

హీరో విశాల్ దర్శకుడిగా మారారు. 2017లో విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'తుప్పరివాలన్' (తెలుగులో 'డిటెక్టివ్'). మిస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2'ను ప్లాన్ చేశారు విశాల్. అయితే కొంతకాలం క్రితం క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి మిస్కిన్ తప్పుకున్నారు. దీంతో 'డిటెక్టివ్ 2' కోసం విశాల్ దర్శకుడిగా మారారు. ''డైరెక్టర్ కావాలన్న నా కల నిజమైంది. నా దర్శకత్వంలో రానున్న తొలి సినిమా 'తుప్పరివాలన్ 2'. ఈ సినిమా కోసం లండన్ వెళ్తున్నాను. అజర్‌బైజాన్, మల్టా లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుగుతుంది. నా కలను నాకు మరింత చేరువ చేసిన మిస్కిన్‌గారికి ధన్యవాదాలు'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు విశాల్. ఇక విశాల్ నటించిన లేటెస్ట్ మూవీ 'రత్నం' ఏప్రిల్ 26న విడుదల కానుంది. హరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్.


● విశాల్

చలో గోవా

గోవాకు వెళ్లనున్నారట దేవర. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె.హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలకానుంది. తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది. కాగా 'దేవర' సినిమా యూనిట్ పాటల చిత్రీకరణ కోసం గోవా వెళ్లనున్నారని ఫిల్మ్ నగర్ సమాచారం. అతి త్వరలో ఈ షెడ్యూల్ ప్రారంభం కానుంది తెలిసింది. గోవా షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీలపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ పాట చిత్రీకరిస్తారట మేకర్స్. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్ డైరెక్టర్.


● ఎన్టీఆర్

స్నేహానికి హద్దు లేదురా!


● ఆశిష్ గాంధీ, ఎస్తేర్

''ఏ దర్శకుడికైనా ఫస్ట్ మూవీ బర్త్ లాంటిది. నా తొలి చిత్రం 'డాన్ శ్రీను' ని ఇప్పటికీ మర్చిపోలేను. మనమేంటో ఇండస్ట్రీకి తెలియజేసేదే తొలి సినిమా. 'హద్దు లేదురా' చిత్రం ట్రైలర్ చూస్తుంటే రాజశేఖర్ తొలిసారి దర్శకత్వం వహించినట్లు అనిపించడం లేదు. ఈ మూవీ మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ గోపీచంద్ మలినేని అన్నారు. ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా, వర్ష, ప్రతిక హీరోయిన్లుగా, ఎస్తేర్ అతిథి పాత్రలో నటించిన చిత్రం 'హద్దు లేదురా'. రాజశేఖర్ రావి దర్శకత్వంలో వీరేష్ గాజుల బళ్లారి నిర్మించారు. రావి మోహన్‌రావు సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి గోపీచంద్ మలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ''స్నేహం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది'' అన్నారు రాజశేఖర్ రావి. ''సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మా యూనిట్‌ని ప్రోత్సహించాలి'' అన్నారు వీరేష్ గాజుల బళ్లారి. నటీనటులు ఆశిష్ గాంధీ, తనికెళ్ల భరణి, రాధా మనోహర్ దాస్, ఎస్తేర్ మాట్లాడారు.

ముచ్చటగా మూడోసారి


● నిఖిల్

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు చందూ మొండేటిలది హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'కార్తికేయ'(2014) సూపర్ హిట్‌గా నిలిచింది. అలాగే వీరి కాంబోలో వచ్చిన ద్వితీయ సినిమా 'కార్తికేయ 2' (2022) పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. దీంతో 'కార్తికేయ 3' సినిమాకి సంబంధించిన అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. తాజాగా వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడింది. నిఖిల్, చందూ కలయిక ముచ్చటగా మూడోసారి రిపీట్ అవుతోంది. 'కార్తికేయ 3' సినిమా రూపొందనున్నట్లు స్పష్టత ఇచ్చారు నిఖిల్. ''దర్శకుడు చందూ మొండేటి అడ్వెంచరస్ థ్రిల్లర్ మూడవ ఫ్రాంచైజీకి (కార్తికేయ 3) సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌పై పని చేస్తున్నారు. 'కార్తికేయ 3' స్పాన్, స్కేల్ పరంగా చాలా పెద్దగా ఉండబోతోంది. డా.కార్తికేయ సరికొత్త సాహసం త్వరలోనే ప్రారంభం కానుంది'' అన్నారు మేకర్స్. కాగా ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తున్న 'స్వయంభూ' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుపుకుంటోంది. మరోవైపు నాగచైతన్య హీరోగా 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్నారు చందూ మొండేటి.

ఆ ఇమేజ్ అంటే భయం



– ప్రియదర్శి

''నటుడిగా ఉంటే విభిన్నరకాలైన పాత్రలు చేయవచ్చు. అవకాశాలు కూడా ఎక్కువగా వస్తాయి. ఇలా కాకుండా నన్ను నేను ఓ హీరోగా అనుకుంటే ఓ డిఫరెంట్ ఇమేజ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆ ఇమేజ్ అంటే నాకు భయం. 'మల్లేశం' సినిమా తర్వాత నేను దాదాపు 40 కథలు విన్నాను. ఈ కథల్లో ఓ నటుడిగా నన్ను నేను ఊహించుకోలేకపోయాను. దీంతో 'జాతి రత్నాలు' సినిమాలో నటించాను. 'మంగళవారం' సినిమాలో కూడా నాది హీరో రోల్ అనుకోవడం లేదు. దర్శక–నిర్మాతలు డిఫరెంట్ రోల్స్ ఇస్తున్నారంటే నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని ప్రియదర్శి అన్నారు. శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో హర్ష కొనుగంటి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఓం భీమ్ బుష్'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో వీ సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ప్రియదర్శి మాట్లాడుతూ– ''ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్ కథే ఈ చిత్రం. ఓ మంచి పాయింట్‌ను టచ్ చేశాం. ప్రస్తుతం'గేమ్ ఛేంజర్' మూవీలో ఓ పాత్ర చేస్తున్నాను. నేను, నభానటేష్ లీడ్స్‌గా ఓ మూవీ చేస్తున్నాం'' అన్నారు.

ప్రజాకవి కాళోజీకి మరో అవార్డు

ప్రముఖ కవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు బయోపిక్‌గా రూపొందించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. మూలవిరాట్ (అశోక్ రెడ్డి) టైటిల్ రోల్‌లో నటించారు. డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో జైనీ క్రియేషన్స్‌పై విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలైంది. ఇప్పటికే పలు అవార్డులు సాధించిన ఈ మూవీ తాజాగా ఇండియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్ 2024లో ఫీచర్ ఫిక్షన్ కేటగిరీలో స్పెషల్ జ్యూరీ అవార్డు సొంతం చేసుకుంది. ఈ అవార్డును ప్రభాకర్ జైనీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''కాళోజీ నారాయణరావుగారి జీవిత విశేషాలతో 'ప్రజాకవి కాళోజీ' మూవీ తీసినందుకు చిత్రసీమకు చెందిన అనేక మంది ప్రముఖులు నన్ను ప్రశంసించారు. ఒక కవి మీద సినిమా తీయడం చాలా సాహసమని కొనియాడారు. మా సినిమాకి మొత్తం 8 అవార్డులు రావడం హ్యాపీ'' అన్నారు.


● అవార్డు అందుకుంటున్న ప్రభాకర్ జైనీ

భయ్యాజీ వస్తున్నాడు


● మనోజ్

బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి హీరోగా నటిస్తున్న తాజా హిందీ చిత్రానికి 'భయ్యాజీ' అనే టైటిల్ ఖరారైంది. 'సిర్ఫ్ ఏక్ బందా కఫీ హై' (2023) సినిమా తర్వాత మనోజ్ బాజ్‌పేయి, దర్శకుడు అపూర్వ్‌సింగ్ కర్కీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని బాలీవుడ్ సమాచారం. కాగా ఇటీవల ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న, సినిమాను మే 24న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కాగా 'భయ్యాజీ' చిత్రం మనోజ్ బాజ్‌పేయి కెరీర్‌లో వందో చిత్రం కావడం విశేషం.



భారత ఆర్చరీ జట్టులో ధీరజ్, జ్యోతి సురేఖ

ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టోర్నీలలో పాల్గొనే భారత ఆర్చరీ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) ఆధ్వర్యంలో హరియాణాలోని సోనీపట్‌లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. పురుషుల రికర్వ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ ట్రయల్స్‌లో అగ్రస్థానంలో నిలిచి జాతీయ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. విజయవాడకు చెందిన ధీరజ్ ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా దక్కించుకున్నాడు. ధీరజ్‌తోపాటు తరుణ్ దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్, మృణాల్ చౌహాన్ భారత రికర్వ్ జట్టులో చోటు సంపాదించారు. భారత మహిళల రికర్వ్ జట్టులో 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి, భజన్ కౌర్, అంకిత, కోమలిక ఎంపికయ్యారు. మరోవైపు ఒలింపిక్ ఈవెంట్‌కాని కాంపౌండ్ విభాగంలో భారత మహిళల జట్టులో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖతోపాటు అదితి స్వామి, పర్ణీత్ కౌర్, అవనీత్ కౌర్ చోటు సంపాదించారు. పురుషుల కాంపౌండ్ జట్టులో ప్రథమేశ్, అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్, ప్రియాంశ్ ఎంపికయ్యారు. ప్రపంచకప్ తొలి టోర్నీకి ఏప్రిల్ 23 నుంచి 28 వరకు షాంఘై ఆతిథ్యమిస్తుంది. ప్రపంచకప్ రెండో టోర్నీ మే 21 నుంచి 26 వరకు యెచోన్‌లో, ప్రపంచ కప్ మూడో టోర్నీ జూన్ 18 నుంచి 24 వరకు అంటాల్యాలో జరుగుతాయి.



16 ఏళ్ల రికార్డు బద్దలు

పురుషుల 10,000 మీటర్ల విభాగంలో గుల్‌వీర్ ఘనత



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల కాంస్య పతక విజేత, భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ పురుషుల 10,000 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన 'ద టెన్' అథ్లెటిక్స్ మీట్‌లో 25 ఏళ్ల గుల్‌వీర్ ఈ ఘనత సాధించాడు. గుల్‌వీర్ తాను పాల్గొన్న హీట్స్‌లో 10,000 మీటర్లను 27 నిమిషాల 41.81 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 16 ఏళ్లుగా సురేందర్ సింగ్ (28ని:02.89 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును గుల్‌వీర్ తిరగరాశాడు. గుల్‌వీర్ కొత్త జాతీయ రికార్డు సృష్టించినా పారిస్ ఒలింపిక్స్ (27 నిమిషాలు) అర్హత ప్రమాణ సమయాన్ని అధిగమించలేకపోయాడు.

రన్నరప్ రష్మిక



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో రెండో సింగిల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన హైదరాబాద్ యువ తార భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన డబ్ల్యూ35 ఐటీఎఫ్ టోర్నీలో 22 ఏళ్ల రన్నరప్‌గా నిలిచింది. రెండో సీడ్ దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా)తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రష్మిక 3-6, 2-6తో ఓడిపోయింది. 67 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో రష్మికకు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు తొమ్మిదిసార్లు అవకాశం వచ్చినా ఆమె ఒకసారి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. మరోవైపు రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. ఫైనల్ చేరే క్రమంలో రష్మిక టాప్ సీడ్, ఐదో సీడ్, ఏడో సీడ్ క్రీడాకారిణులను ఓడించడం విశేషం. ఈ టోర్నీ ప్రదర్శనతో రష్మిక నేడు విడుదల చేసే మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 428వ ర్యాంక్‌కు చేరుకుంటుంది.

బెంగళూరు మురిసింది

డబ్ల్యూపీఎల్ చాంపియన్ ఆర్‌సీబీ

- ఫైనల్లో ఢిల్లీపై ఘనవిజయం
- శ్రేయాంక, మోలినెక్స్ మాయాజాలం

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ 2008 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతోంది. మూడుసార్లు ఫైనల్లోకి వచ్చినా... మూడుసార్లూ తుదిపోరులో ఓడిపోయి టైటిల్‌ను అందుకోలేకపోయింది. ఇదే ఆర్‌సీబీ ఫ్రాంచైజీ గత ఏడాది మొదలైన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అడుగు పెట్టింది. తొలి సీజన్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచింది. అయితే ఏడాది తిరిగేలోపు బెంగళూరు మహిళల జట్టు అద్భుతం చేసింది. ఐపీఎల్‌లో పురుషుల జట్టుకు అందని ద్రాక్షగా ఊరిస్తున్న టైటిల్‌ను డబ్ల్యూపీఎల్‌లో మెరిపించే ఆటతీరుతో బెంగళూరు టైటిల్‌ను సొంతం చేసుకుంది. తమ ఫ్రాంచైజీకి డబ్ల్యూపీఎల్ టైటిల్ దక్కడంతో ఐపీఎల్ ఆర్‌సీబీ స్టార్స్ విరాట్ కోహ్లి, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మాజీ సభ్యులు క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, మాజీ యాజమాని విజయ్ మాల్యా తదితరులు అభినందనలు తెలిపారు.



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను మొదట స్పిన్‌తో కట్టడి చేసి... ఆ తర్వాత జాగ్రత్తగా లక్ష్యాన్ని ఛేదించేసి 8 వికెట్లతో బెంగళూరు గెలిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లలో షఫాలీ వర్మ (27 బంతుల్లో 44; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేయగా... కెప్టెన్ మెగ్ లానింగ్ (23 బంతుల్లో 23; 3 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడింది. తర్వాత ఇంకెవరూ 12 పరుగులకు మించి చేయలేకపోయారు. స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (3.3-0-12-4), సోఫీ మోలినెక్స్ (3/20), ఆశ శోభన (2/14) ఢిల్లీని దెబ్బ కొట్టారు. అనంతరం బెంగళూరు 19.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్ బ్యాటర్లు స్మృతి మంధాన (39 బంతుల్లో 31; 3 ఫోర్లు), సోఫీ డివైన్ (27 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలీస్ పెరీ (37 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' పురస్కారం సోఫీ మోలినెక్స్‌కు దక్కింది. విజేతగా నిలిచిన బెంగళూరు జట్టుకు రూ. 6 కోట్లు ప్రైజ్‌మనీ లభించింది. గత సీజన్ మాదిరిగానే ఈసారీ ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి, ఆ తర్వాత ఫైనల్లో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకోవడం గమనార్హం.

ధనాధన్... ఫటాఫట్!

ఢిల్లీ ఓపెనర్లు షఫాలీ వర్మ, మెగ్‌లానింగ్ ఆరంభంలో ధాటిగా చెలరేగిపోయారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో షఫాలీ భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. కెప్టెన్ లానింగ్ ఫోర్లతో వేగాన్ని పెంచింది. 6 ఓవర్లలో ఢిల్లీ 61/0 స్కోరు చేసింది. బ్యాటింగ్ పవర్‌ప్లే తర్వాత బౌలింగ్ పవర్‌ప్లే మొదలైనట్లుగా ఢిల్లీ వికెట్లు ఫటాఫట్ కూలాయి. 8వ ఓవర్ వేసిన స్పిన్నర్ సోఫీ మోలినెక్స్ 4 బంతుల్లో 3 వికెట్లు తీసింది. షఫాలీ, కీలకమైన వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (0), క్యాప్సీ (0) వికెట్లను సోఫీ పడగొట్టింది. 64 పరుగుల వద్దే ఈ మూడు వికెట్లు పడ్డాయి. 11వ ఓవర్ నుంచి శ్రేయాంక, ఆశ శోభన తిప్పేయడంతో లానింగ్, మరిజన్ కాప్ (8), జెస్ జొనాసెన్ (3), మిన్ను రాణి (5) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. రాధా యాదవ్ (12; 2 ఫోర్లు) బౌండరీలతో జట్టు స్కోరు 100 దాటాక... మోలినెక్స్ డైరెక్ట్ త్రోకు రాధ రనౌటైంది. 19వ ఓవర్ వేసిన శ్రేయాంక రెండో బంతికి అరుంధతి రెడ్డిని (10), మూడో బంతికి తానియా (0)ను అవుట్ చేయడంతో క్యాపిటల్స్ ఆలౌటైంది. పవర్‌ప్లే తర్వాత ఢిల్లీకి ఏకంగా 47 బంతుల పాటు బౌండరీ గగనమైంది.

రాణించిన పెరీ, సోఫీ డివైన్

లక్ష్యం చిన్నదే అయినా... టైటిల్ పోరులో బెంగళూరు ఓపెనర్లు సోఫీ డివైన్, స్మృతి మంధాన అనవసర షాట్లకు వెళ్లకుండా జాగ్రత్తగా పరుగుల్ని రాబట్టారు. దీంతో 6 ఓవర్లలో బెంగళూరు 25/0 స్కోరే చేసింది. అడపాదడపా బౌండరీలతో వేగం పెంచిన సోఫీ డివైన్ జట్టు స్కోరు 49 పరుగుల వద్ద శిఖా పాండే బౌలింగ్‌లో అవుటైంది. కెప్టెన్ స్మృతికి పెరీ జతవ్వగా ఈ జోడీ కూడా నింపాదిగానే పరుగుల్ని చక్కబెట్టింది. స్వభావానికి విరుద్ధంగా నెమ్మదిగా ఆడిన స్మృతికి మిన్ను మణి చెక్ పెట్టింది. అయితే అప్పటికే బెంగళూరు 82/2 స్కోరుకు చేరింది. మిగతా పరుగుల్ని పెరీ, రిచా ఘోష్ (17 నాటౌట్, 2 ఫోర్లు) పూర్తిచేయడంతో బెంగళూరు 3 బంతులు మిగిలుండగానే ట్రోఫీ గెలిచింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రేయాంక 23; షఫాలీ వర్మ (సి) వేర్‌హమ్ (బి) సోఫీ మోలినెక్స్ 44; జెమీమా (బి) సోఫీ మోలినెక్స్ 0; క్యాప్సీ (బి) సోఫీ మోలినెక్స్ 0; మరిజన్ కాప్ (సి) సోఫీ డివైన్ (బి) ఆశ 8; జెస్ జొనాసెన్ (సి) స్మృతి (బి) ఆశ 3; రాధా యాదవ్ (రనౌట్) 12; మిన్ను మణి (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రేయాంక 5; అరుంధతి (బి) శ్రేయాంక 10, శిఖా పాండే (నాటౌట్) 5; తానియా భాటియా (సి) రిచా ఘోష్ (బి) శ్రేయాంక 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 113. వికెట్ల పతనం:** 1-64, 2-64, 3-64, 4-74, 5-80, 6-81, 7-87, 8-101, 9-113, 10-113. **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-28-0, సోఫీ మోలినెక్స్ 4-0-20-3, ఎలీస్ పెరీ 2-0-14-0, సోఫీ డివైన్ 1-0-9-0, వేర్‌హమ్ 3-0-16-0, శ్రేయాంక పాటిల్ 3.3-0-12-4, ఆశ శోభన 3-0-14-2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి) అరుంధతి (బి) మిన్ను మణి 31; సోఫీ డివైన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శిఖా పాండే 32; ఎలీస్ పెరీ (నాటౌట్) 35; రిచా ఘోష్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (19.3 ఓవర్లలో 2 వికెట్లకు) 115. వికెట్ల పతనం:** 1-49, 2-82. **బౌలింగ్:** మరిజన్ కాప్ 4-0-20-0, క్యాప్సీ 3-0-13-0, శిఖా పాండే 4-0-11-1, రాధ 1-0-18-0, అరుంధతి 3.3-0-26-0, జొనాసెన్ 2-0-15-0, మిన్ను మణి 2-0-12-1.

డబ్ల్యూపీఎల్-2024 అవార్డులు

ఎమర్జింగ్ ప్లేయర్
శ్రేయాంక పాటిల్ (బెంగళూరు)
మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్
దీప్తి శర్మ (యూపీ)
బెస్ట్ క్యాచ్ ఆఫ్ ద టోర్నీ
సజన సజీవన్ (ముంబై)
ఫెయిర్ ప్లే టీమ్
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

ఆరెంజ్ క్యాప్ (లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)
ఎలీస్ పెరీ (బెంగళూరు) 347 పరుగులు

పర్పుల్ క్యాప్ (లీగ్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)
శ్రేయాంక పాటిల్ (బెంగళూరు) 13 వికెట్లు

66 లీగ్‌లో కొట్టిన సిక్స్‌లు

295 లీగ్‌లో కొట్టిన ఫోర్లు

రూ. 6 కోట్లు విజేత బెంగళూరు జట్టుకు లభించిన ప్రైజ్‌మనీ

స్వదేశానికి కోహ్లి



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి ఆదివారం స్వదేశానికి చేరుకున్నాడు. లండన్ నుంచి ముంబైకి వచ్చిన క్రికెటర్ ఒకట్రెండు రోజుల్లో ఐపీఎల్ 17వ సీజన్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు శిబిరంలో పాల్గొంటాడు. వ్యక్తిగత కారణాలతో 'కింగ్ కోహ్లి' సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు దూరంగా ఉన్నాడు.

శ్రీనిధి డెక్కన్ జట్టును గెలిపించిన ఒలివేరా



కొడుమన్ (కేరళ): ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఖాతాలో 12వ విజయం చేరింది. గోకులం కేరళ ఎఫ్‌సీ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. ఆట 44వ నిమిషంలో నికోలా స్టొజనోవిచ్ గోల్‌తో గోకులం కేరళ జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే శ్రీనిధి తరఫున విలియమ్ అల్వెస్ డి ఒలివేరా (47వ ని.లో, 71వ ని.లో) రెండు గోల్స్ సాధించి తమ జట్టును విజయతీరాలకు చేర్చాడు. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

శ్రేష్ట(ఎన్ఈటీఎస్) పరీక్ష-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ఠ-నెట్స్ 2024 పథకానికి ఎస్సీ బాల బాలికలు నుంచి దరఖాస్తులు కోరుతోంది. శ్రేష్ఠ(రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్)-2024 పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సీబీఎస్ఈ అనుబంధ ప్రైవేట్ విద్యా సంస్థల్లో తొమ్మిది, పదకొండు తరగతుల్లో ప్రవేశాలు పొందవచ్చు. శ్రేష్ఠ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 3000సీట్లు భర్తీ కానున్నాయి.

- **అర్హత:** 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో, పదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించకూడదు.
- **పరీక్ష విధానం:** పెన్ అండ్ పేపర్(ఆఫ్‌లైన్) విధానంలో పరీక్ష జరుగుతుంది. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథమేటిక్స్(30 మార్కులు), సైన్స్ (20 మార్కులు), సోషల్ సైన్స్(25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/నాలెడ్జ్(25 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలుంటాయి. పరీక్ష ప్రశ్నాపత్రం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2024
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.04.2024 నుంచి 08.04.2024.
- **అడ్మిట్ కార్డ్స్ డౌన్‌లోడ్ ప్రారంభం:**12.05.2024
- **పరీక్ష తేది:** 24.05.2024 (మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు).
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/SHRESHTA

ఓఐసీఎల్, న్యూఢిల్లీలో 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసీఎల్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
- **విభాగాలు:** అకౌంట్స్,అక్చూరియల్,ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ),మెడికల్ ఆఫీసర్,లీగల్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్,ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి
- **వయసు:** 31.12.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు గరిష్టంగా ఐదేళ్లు,ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.50,925 నుంచి 96,765.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ టెస్ట్, మెయిన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.03.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.04.2024
- **వెబ్‌సైట్:** https://orientalinsurance.org.in

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 550 యాక్ట్ అప్రెంటిస్‌లు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్).. యాక్ట్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 550
- **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.
- **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 31.03.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల వయో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.04.2024
- **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in

తెలంగాణ టెట్-2024

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **అర్హత:** డీఈఐఈడీ/డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) జరుగుతుంది. టెట్ పరీక్షలో పేపర్-1, పేపర్-2 ఉంటాయి. పేపర్-1 ఒకటి నుంచి ఐదో తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు, పేపర్-2 ఆరు నుంచి పదో తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు. పరీక్ష సమయం 2 1/2 గంటలు.
- **అర్హతా మార్కులు:** అభ్యర్థులు జనరల్ కేటగిరీలో 90మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 60 మార్కులు సాధిస్తే టీఆర్‌టీ-డీఎస్సీ రాసేందుకు అర్హత సాధిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.03.2024
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2024
- **పరీక్ష తేది:** 20.05.2024 నుంచి 03.06.2024 వరకు పరీక్షలు జరుగుతాయి.
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in/ISMS

సాయుధ బలగాల్లో ఎస్ఐ కొలువు

పోలీస్ జాబ్స్.. నేటి యువత క్రేజీ కెరీర్! ముఖ్యంగా సమాజంలోని క్షేత్రస్థాయిలో గుర్తింపు, గౌరవం లభించే సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) పోస్టుల్లో చేరాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. అలాంటి వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! దేశ అంతర్గత భద్రతలో కీలకమైన కేంద్ర సాయుధ దళాలు, ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ పోస్టుల భర్తీకి.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది!! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్ సమాచారం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...

- 4,187 ఎస్ఐ పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
- ఢిల్లీ పోలీస్, సాయుధ దళాల్లో పోస్టుల భర్తీ
- రాత పరీక్ష, ఫిజికల్ టెస్టుల ద్వారా ఎంపిక
- వేతన శ్రేణి: రూ.35,400 -రూ.1,12,400



మొత్తం 4,187 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజా నోటిఫికేషన్ ద్వారా ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ భద్రత బలగాలు (సీఏపీఎఫ్)కు సంబంధించి మొత్తం 4,187 పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్)-పురుషులు- 125, ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్)-మహిళలు-61 పోస్టులు ఉన్నాయి. అదేవిధంగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్-892(మహిళలకు 45) పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్-1,597(మహిళలకు 160), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్-1,172 (మహిళలకు 59), ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్-278 (మహిళలకు 41), సశస్త్ర సీమాబల్: 62 (మహిళలకు 3) ఎస్ఐ పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆగస్టు 1, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 1, 2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

నిర్దేశిత శారీరక ప్రమాణాలు

- ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు విద్యార్హతలు, వయో పరిమితితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా ఉండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 170 సెంటీ మీటర్లు; మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. పురుష అభ్యర్థులు 80 సెం.మీ; 85 సెం.మీ (శ్వాస పీల్చినప్పుడు) ఛాతి కొలత కలిగుండాలి. ఈ శారీరక ప్రమాణాలు కలిగున్న వారికే ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

ప్రారంభ వేతన శ్రేణి

ఎస్ఎస్‌సీ ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికైన వారికి పే లెవల్-6తో ప్రారంభ వేతన శ్రేణి లభిస్తుంది. నెలకు రూ.35,400-రూ. 1,12,400తో ప్రారంభ వేతన శ్రేణి అందుతుంది. అదే విధంగా.. సీఏపీఎఫ్ ఎస్ఐ పోస్టులకు గ్రూప్-బి, ఢిల్లీ పోలీస్ ఎస్ఐ పోస్టులకు గ్రూప్-సి హోదా కల్పించారు. ఎస్ఐగా కొలువుదీరిన వారు సర్వీస్ నిబంధనలు, ప్రతిభ ఆధారంగా కమాండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ విభాగాల్లోని ఎస్ఐ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. తొలుత పేపర్-1 రాత పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ పేరిట దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం పేపర్-2 రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి నియామకాలు ఖరారు చేస్తారు.

200 మార్కులకు పేపర్-1

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష పేపర్-1ను నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (50 ప్రశ్నలు-50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ (50 ప్రశ్నలు-50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (50 ప్రశ్నలు-50 మార్కులు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ (50 ప్రశ్నలు-50 మార్కులు) ఉంటాయి. మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ సర్టిఫికెట్

పేపర్-1లో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందించి.. నిర్దిష్ట నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి.. రెండో దశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. పలు ఫిజికల్ ఈవెంట్లలో అభ్యర్థులు తమ ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

పేపర్-2 ఇలా

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్‌లో భాగంగా ఫిజికల్ ఈవెంట్లలో విజయం సాధించిన వారికి తదుపరి దశలో పేపర్-2 పేరుతో మరో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ అనే ఒకే విభాగంలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. దీనికి కూడా రెండు గంటల సమయం కేటాయిస్తారు. పేపర్-1, పేపర్-2 రెండూ ఆబ్జెక్టివ్ విధానంలోనే బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మార్చి 28
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మార్చి 30, 31 తేదీల్లో
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** మే 9, 10, 13 తేదీల్లో
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్

సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించాలంటే.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో బెస్ట్ స్కోర్ కోసం ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్

పేపర్-1లో మాత్రమే ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో రాణించడానికి అభ్యర్థులు.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్-స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

200 మార్కులతో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్ పేరుతో నిర్వహించే పేపర్-2లో రాణించడానికి అభ్యర్థులు.. ఫ్రేజెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కంప్లీషన్, ప్రెసిస్ రైటింగ్, వొకాబ్యులరీలపై పట్టు సాధించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	454	72,643
నిఫ్టీ ▽	123	22,024

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,973	▽	155
డోజోన్స్	38,715	▽	191
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▽	16
డాక్స్	17,923	▽	14
షాంఘై	3,054	△	16
నికాయ్	38,738	▽	130

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.19	84.48
£	బ్రిటన్ పౌండ్		103.88	108.12
€	యూరో		88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)		47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.07	56.58
S$	సింగపూర్ డాలర్		60.13	64.88
SAR	సౌదీ రియాల్		21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్		21.65	23.43
¥	చైనా యువాన్		10.28	12.29

ఇంటి పేరు మార్చుకుంటున్నారా..?

వివాహానంతరం మహిళల ఇంటి పేరులో మార్పు చూస్తుంటాం. ఆమెకు, ఆమె సంతానానికి సహజంగానే భర్త ఇంటి పేరు వర్తిస్తుంది. అప్పటి వరకు తండ్రి ఇంటి పేరును వారసత్వంగా మోసిన ఆమె, తన విద్యార్హతలు, ఇతర ధ్రువీకరణ, గుర్తింపు పత్రాల్లో అదే పేరును కలిగి ఉంటుంది. మరి పెళ్లి తర్వాత ముఖ్యమైన పత్రాల్లో భర్త ఇంటి పేరును చేర్చుకోవాలా..? వద్దా..? ఇదొక పెద్ద సందేహం. చాలా మంది ఈ విషయంలో దోలాయమాన స్థితిని ఎదుర్కొంటూ ఉంటారు. వివాహానంతరం తండ్రి ఇంటి పేరుతో కొనసాగేందుకు అందరూ అంగీకరించకపోవచ్చు. భర్త అంగీకరించినా, మార్చుకోవడం సులభమేమీ కాదు. ఇందులోని సాధక బాధకాలను పూర్తిగా తెలుసుకుంటే అప్పుడు ఏం చేయాలో సులభంగా తేల్చుకోవచ్చు.

వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత కేవలం ఆధార్‌లో మాత్రమే ఇంటి పేరును మార్చుకుని వదిలివేయడం సరైనది కాదు. విద్యార్హతలు సహా చట్టబద్ధమైన అన్ని పత్రాలు, పెట్టుబడుల డాక్యుమెంట్లలో ఇంటి పేరును మార్చుకోవాలి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఎదురుకావు. కేవలం పాన్, ఆధార్‌లోనే ఇంటి పేరు మార్చుకుంటే, అది ఎన్నో ఇక్కట్లకు దారితీయవచ్చు. ఈపీఎఫ్, బ్యాంక్ ఖాతాల్లోని పేర్లకు, పాన్, ఆధార్‌లోని పేర్ల మధ్య అంతరం ఏర్పడుతుంది. ఆయా ఖాతాల నుంచి నిధులను వెనక్కి తీసుకోవాలంటే.. పేరును అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తుంది. ఇందుకోసం మరోసారి కేవైసీ (నో యువర్ కస్టమర్) ప్రక్రియ పూర్తి చేయక తప్పదు. పేర్ల అప్‌డేట్ కోసం అఫిడవిట్, ఇతర డాక్యుమెంట్లను సమర్పించాల్సి రావచ్చు. ''వివాహం తర్వాత ఇంటి పేరును మార్చుకోవడం అన్నది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమే. కానీ ఈ విషయంలో లాభ, నష్టాలు రెండింటినీ పరిశీలించుకోవాలి. పేరును మార్చుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటంటే కుటుంబం అంతటికీ ఒకే విధమైన గుర్తింపు, ఏకరూపత ఉంటుంది. అన్ని రకాల డాక్యుమెంట్లలోనూ పేరు ఒకే విధంగా ఉండేందుకు శ్రమ పడాల్సి రావడమే ప్రతికూలం''అని ఫిన్‌ఎడ్జ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా భారతి వివరించారు. పెళ్లయిన తర్వాత ఇంటి పేరును మార్చుకోవడం వల్ల ఎన్నో చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని 'అలగ్ అండ్ కపూర్ లా ఆఫీసెస్' (న్యాయ సేవల సంస్థ) పార్ట్‌నర్ సోనాల్ అలఘ్ పేర్కొన్నారు. గతంలోని పేరుకు, ప్రస్తుత పేరుకు మధ్య మార్పు నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో ఎన్నో పరిశీలనలకు తోడు వృత్తిపరమైన ధ్రువీకరణలు అవసరం పడతాయన్నారు.



ముందుచూపుతో వ్యవహరించాల్సిందే

- అన్ని డాక్యుమెంట్లలోనూ సవరణ తప్పదు
- విద్యార్హతల పత్రాల్లోనూ ఆ మేరకు మార్పు
- మ్యారేజ్ సర్టిఫికెట్, అఫిడవిట్ల అవసరం
- భర్త ఇంటి పేరుకు మారితే ఏకరూపత
- కుటుంబం అంతా ఒక్కటేనన్న గుర్తింపు

భర్త ఇంటి పేరు



అప్పటి వరకు ఉన్న ఇంటి పేరు స్థానంలో భర్త ఇంటి పేరును చేర్చుకుంటున్నట్టు అయితే చట్టబద్ధంగా గుర్తింపును మారుస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. అధికారిక రికార్డుల్లో పేర్లు మార్చుకోవడం అన్నది పరిపాలనాపరమైన పెద్ద చిక్కుగా, సవాలుతో కూడుకున్నదిగా అభివర్ణించారు సోనాల్ అలఘ్. ''దీనికి తోడు విద్యా, ప్రభుత్వ సంస్థల్లో పేరు మార్పునకు సంబంధించిన కఠిన ప్రక్రియ కష్టాలను మరింత పెంచుతుంది. దీంతో గుర్తింపు సమస్యలు ఎదురుకావచ్చు''అని ఆమె పేర్కొన్నారు. మహిళ ఇంటి పేరును మార్చుకుంటుంటే, అన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లలోనూ ఆ మేరకు మార్పులు చేసుకోవాలని దీపికా భారతి సూచించారు. కేవలం కొన్నింటిలోనే మార్పు చేసుకుని వదిలేస్తే, విదేశాలకు వెళ్లే సందర్భాల్లో, పెట్టుబడుల సమయంలో, లేదంటే నామినీగా ఉండి పెట్టుబడులను క్లెయిమ్ చేసుకోవాల్సిన సందర్భాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆస్తులు తదితర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు, బీమా పాలసీల్లో పేరులో మార్పు చేయకపోతే, గుర్తింపును నిరూపించుకునేందుకు లేదా ఆయా ఆస్తులను సొంతం చేసుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందని కరంజీవాలా అండ్ కో పార్ట్‌నర్ మేఘనా మిశ్రా పేర్కొన్నారు.

ఆస్తి పత్రాల్లో



అధికారిక డాక్యుమెంట్లలో ఇంటి పేరును మార్చుకున్న ప్రతి ఒక్కరూ.. తమ పేరిట ఉన్న భౌతిక, ఆర్థిక ఆస్తులు అన్నింటిలోనూ ఆ మేరకు సవరణ చేసుకోవడం మర్చిపోవద్దు. ఒక్కసారి ఆధార్, పాన్‌లో కొత్త ఇంటి పేరు ఆధారంగా సవరణ చేసుకుంటే, ఆ తర్వాత మ్యూచువల్ ఫండ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాల్లో మార్చుకోవడం సులభతరం అవుతుందని భారతి తెలిపారు. ఉద్యోగం చేసే చోట అధికారిక రికార్డుల్లోనూ ఇంటి పేరులో మార్పు చేసుకోవడం ద్వారా ఇబ్బందులను అధిగమించొచ్చు.

మార్చుకోవడం వల్ల ప్రయోజనం ఉందా?



నేటి రోజుల్లో దాదాపు అధిక శాతం మహిళలు పెళ్లయిన తర్వాత తమ ఇంటి పేరును మార్చుకుంటున్నారు. భర్త ఇంటి పేరుకు మారిపోవడం వల్ల గుర్తింపు సులభంగా ఉంటుందని మిశ్రా తెలిపారు. సామాజికంగా ఒకే కుటుంబం అన్న భావన, కుటుంబంలో ఐక్యతకు ఇది అనుకూలిస్తుందన్నారు.

పదో తరగతి మెమో

చాలా వాటికి పదో తరగతి విద్యార్హత సర్టిఫికెట్ కీలకంగా పనిచేస్తుంది. ఇందులో పేరు మార్చుకోవడం కష్టమేనంటున్నారు మేఘన మిశ్రా. ''సీబీఎస్ఈ వంటి బోర్డులు సాధారణంగా సర్టిఫికెట్లలో పేర్ల మార్పునకు అనుమతించడం లేదు. పాన్, పాస్‌పోర్ట్‌కు టెన్త్ సర్టిఫికెట్ కీలకంగా పనిచేస్తుంది. పాన్/ఆధార్‌కు, సీబీఎస్ఈ పదో తరగతి సర్టిఫికెట్‌లో పేరుకు వ్యత్యాసం ఉంటే బ్యాంక్ ఖాతా లేదా పాస్‌పోర్ట్ తీసుకునే విషయంలో ధ్రువీకరణ కోసం అదనపు డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. వివాహానంతరం వృత్తిపరమైన విద్యార్హతల డాక్యుమెంట్లు, కోర్సుల్లో ప్రవేశాలకు నమోదు చేసే పేరు, అంతకుముందు డాక్యుమెంట్లలో మాదిరే ఉండాలి''అని మిశ్రా వివరించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయవాది ఏక్తా రాయ్ అభిప్రాయం భిన్నంగా ఉంది. స్కూల్ సర్టిఫికెట్లు అన్నవి ఒక నిర్ణీత కాలం వరకు పుట్టిన తేదీకి ధ్రువీకరణలుగా కొనసాగుతాయి. ఇతర కీలక డాక్యుమెంట్లు అయిన పాన్, ఆధార్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఇంటి పేరును అప్‌డేట్ చేసుకున్న తర్వాత, స్కూల్ సర్టిఫికెట్లకు అంత ప్రాధాన్యం ఉండదు. అయినప్పటికీ వివాహానంతరం మహిళ పాన్ లేదా ఆధార్‌లో పేరు మార్చుకునేట్టు అయితే లేదా ఉన్నత కోర్సులకు దరఖాస్తు చేసుకుంటున్నట్టు అయితే తన వివాహాన్ని రిజిస్టర్ చేసుకుని, వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. జిల్లా మేజిస్ట్రేట్ నుంచి పాఠశాల సర్టిఫికెట్లలో ఇంటి పేరు మార్పును ధ్రువీకరిస్తున్నట్టు అటెస్టేషన్ తీసుకున్నా అది కూడా పరిగణనలోకి వస్తుంది'' అని ఏక్తా రాయ్ తెలిపారు.

ఆస్తుల క్లెయిమ్



కుటుంబ పెద్దలు కొందరు వీలునామా రాస్తుంటారు. కుమార్తెలకు సంబంధించి వివరాలు నమోదు చేస్తున్నప్పుడు తమ ఇంటి పేరునే పేర్కొంటారు. వీలునామా రాసిన వ్యక్తి మరణానంతరమే అది అమల్లోకి వస్తుంది. అలా అమల్లోకి వచ్చే నాటికి మహిళలు వివాహాలు చేసుకుని, భర్త ఇంటి పేరుకు మారి ఉండొచ్చు. అటువంటి సందర్భాల్లో వీలునామాలోని వివరాల మేరకు తమ హక్కులను క్లెయిమ్ చేసుకునే సందర్భంలో చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రాపర్టీ, యాజమాన్యం లేదా వారసత్వ వివాదాల్లో ఇంటి పేరు, చట్టబద్ధమైన డాక్యుమెంట్లలోని ఇంటి పేరు ఒకే మాదిరిగా ఉండకపోతే సవాళ్లు ఎదురవుతాయని ఏక్తారాయ్ అంటున్నారు. వీలునామాలోని పేరుకు, ప్రస్తుతం మహిళ పేరుకు మధ్య వ్యత్యాసం ఉంటే, అదనపు రుజువులు, డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని సోనాల్ అలఘ్ తెలిపారు. మహిళ ఇంటి పేరు మార్పు వెనుకనున్న అంశాలను కోర్టులు, అధికారులు పరిగణనలోకి తీసుకోవచ్చని చెప్పారు. ఏవైనా వ్యత్యాసాలు ఉంటే అందుకు సంబంధించి సహేతుక ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని, దాంతో ఆస్తుల బదిలీ సాఫీగా పూర్తవుతుందని సూచించారు.

వీసాకు దరఖాస్తు


''వీసాలో పేరు అప్‌డేట్ చేసుకోవడం లేదంటే భాగస్వామి వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అంతర్జాతీయంగా ఉన్న భిన్నమైన కుటుంబ నిర్మాణాల నేపథ్యంలో ఇంటి పేరులో వ్యత్యాసాన్ని ఆయా దేశాల్లో గుర్తించేందుకు ఎన్నో రకాల రుజువులు సమర్పించాల్సి రావచ్చు. వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు.. మారిన పేరుకు అనుగుణంగా అప్‌డేట్ చేసుకోవాలని భావించే వారికి ఈ సవాలు ఎదురవుతుంది''అని అలఘ్ అంటున్నారు. పెళ్లి తర్వాత ఇంటి పేరు మార్చుకుని వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే, అప్పుడు వివాహ స్థితిని తెలిపే డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. ఇది వీసా జారీని ఆలస్యం చేయవచ్చు. అందుకే పెళ్లి తర్వాత పాస్‌పోర్ట్‌లో భర్త ఇంటి పేరు ప్రతిఫలించేలా మార్పు చేసుకోవాలని మిశ్రా సూచించారు. దీనివల్ల ధ్రువీకరణ సమస్యలు తక్కువగా ఉంటాయన్నారు.

పాన్, ఆధార్, ఇతర డాక్యుమెంట్లు

కీలక పత్రాల్లో ఇంటి పేరు మార్చుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ (వివాహ ధ్రువీకరణ) సమర్పించాల్సి వస్తుంది. పాస్ పోర్ట్ ఆఫీస్, ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి నిర్దేశిత దరఖాస్తుకు అనుబంధంగా వివాహ ధ్రువీకరణ పత్రం, ఇతర డాక్యుమెంట్లను ఇవ్వాలి. మ్యారేజ్ సర్టిఫికెట్‌తోపాటు గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ, పేరు మార్పునకు సంబంధించి అఫడవిట్ అవసరమవుతాయని మిశ్రా తెలిపారు. ''నిర్దేశిత మార్పునకు సంబంధించి చటబద్ధమైన ప్రక్రియలకు కట్టుబడి ఉండడం కీలకం. ఇక్కడ చెప్పినవన్నీ ప్రాథమికంగా సమర్పించాల్సినవి. విడిగా ఆయా డాక్యుమెంట్లలో మార్పులకు గాను సమర్పించాల్సినవి వేరేవి కూడా ఉండొచ్చు'' అని మిశ్రా పేర్కొన్నారు.

పేరు మార్చుకోకపోతే..?

వివాహం తర్వాత కూడా తన ఇంటి పేరునే కొనసాగించే మహిళలూ కొందరు ఉన్నారు. అలాంటప్పుడు సదరు మహిళ భర్త పేరును పేర్కొనే సమయంలో ఇద్దరి ఇంటి పేరు వేర్వేరుగా ఉంటుంది. కనుక తనకు, తన భర్తకు మధ్య బంధానికి నిదర్శనంగా మ్యారేజ్ సర్టిఫికెట్ ఒక్కటి దగ్గర ఉంచుకుంటే సరిపోతుంది. ''వివాహం తర్వాత మహిళ ఇంటి పేరు మార్చుకోకపోతే అప్పుడు వారి బంధాన్ని నిరూపించుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ ఉండాల్సిందే. ఆదాయపన్ను రిటర్నుల దాఖలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్, ఆస్తుల లావాదేవీల సమయంలో ఇది అవసరపడుతుంది. మ్యారేజ్ సర్టిఫికెట్ లేకపోతే భర్త పేరుతో అప్‌డేట్ చేసిన ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంక్ జాయింట్ అకౌంట్ పాస్‌బుక్ లేదా స్టేట్‌మెంట్, ఒకే ఇంట్లో నివసిస్తున్నట్టు రుజువులు, అఫిడవిట్ సాయపడతాయి''అని మిశ్రా తెలిపారు.



పిల్లల బర్త్ సర్టిఫికెట్

వివాహానంతరం మహిళల ఇంటి పేరులో మార్పు లేనప్పుడు.. ఆ దంపతులకు జన్మించే పిల్లల బర్త్ సర్టిఫికెట్‌లో తల్లి, తండ్రి ఇంటి పేరు వేర్వేరుగా ఉంటుంది. ఇదేమైనా సమస్యలు కలిగిస్తుందా.? అన్న సందేహం రావచ్చు. పిల్లల పేరిట పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే ఈ బర్త్ సర్టిఫికెట్ అవసరం పడు తుంది. అంతేకానీ, అందులో తల్లి, తండ్రి ఇంటి పేర్లు వేర్వేరుగా ఉంటే ఎలాంటి సమస్య రాదని మిశ్రా పేర్కొన్నారు.

మొత్తం పేరే మారితే?

కొన్ని వర్గాల ప్రజల్లో పెళ్లి తర్వాత మహిళ ఇంటి పేరే కాకుండా, మొదటి పేరులోనూ మార్పు చోటు చేసుకుంటుంది. ఇది సమస్యలకు దారితీస్తుందని మిశ్రా చెప్పారు. అధికారిక రికార్డులతో పోలిస్తే పేర్ల మధ్య పోలిక లేకపోవడం వల్ల సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పేరు మార్చుకునే విషయంలో చట్టబద్ధమైన నిబంధనలను పాటించడం వల్ల సవాళ్లను అధిగమించొచ్చని సూచించారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ ఫండ్



హెచ్‌డీఎఫ్‌సీ మ్యుచువల్ ఫండ్ సంస్థ తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ రియల్టీ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్ఎఫ్‌వో మార్చి 21తో ముగుస్తుంది. గత 6–7 ఏళ్లుగా లిస్టెడ్ రియల్టీ కంపెనీల ఫండమెంటల్స్, లాభదాయకత మెరుగుపడ్డాయి. రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్, హాస్పిటాలిటీ, సెజ్ ప్రాజెక్టుల వ్యాప్తంగా దీర్ఘకాలిక వృద్ధికి రియల్టీ రంగానికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నిఫ్టీ రియల్టీ ఇండెక్స్‌ను ప్రతిబింబించే ఈ ఓపెన్ ఎండెడ్ స్కీములో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మరింత మెరుగైన రాబడులు అందుకోవడానికి ఆస్కారం ఉండగలదని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ఎండీ నవ్‌నీత్ మునోత్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	72.00
17-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

స్మాల్ కంటే... మిడ్ క్యాప్ ఫండ్స్ నయమా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్





నేను ఆదాయపన్ను 30 శాతం శ్లాబు పరిధిలోకి వస్తాను. దీంతో అత్యవసర నిధిని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?
– శివ గణేశన్

మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రాబడులకు మార్గం అవుతుంది. అత్యవసర నిధి ఎప్పుడూ మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే ఏటేటా వడ్డీ ఆదాయం పన్ను చెల్లింపుదారు ఆదాయానికి కలుస్తుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను ఆధారపడి ఉంటుంది. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారు ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి వచ్చే వడ్డీ ఆదాయంపైనా 30 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. అలాగే, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను విక్రయించినప్పుడు కూడా నమోదయ్యే లాభంపై ఇంతే మేర పన్ను చెల్లించాల్సి వస్తుంది. అయితే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులను ఇస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి పెట్టుబడులకు రక్షణ హామీ కూడా ఉండదు. అయినా కానీ, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి. నాణ్యమైన డెట్ పేపర్లలో ఇన్వెస్ట్ చేసిన పథకాన్నే ఎంపిక చేసుకోవాలి. లేదంటే రిస్క్ తీసుకున్నట్టు అవుతుంది.

స్మాల్ క్యాప్ కంటే మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం చేయడం మంచిదా?
– వరుణ్

మిడ్‌క్యాప్‌లో ఉండే రాబడులు, సవాళ్లు అనేవి స్మాల్‌క్యాప్ మాదిరే ఉంటాయి. పేరుకు తగినట్టుగా ఈ పథకాల పెట్టుబడులు ఉండటాన్ని గమనించొచ్చు. మిడ్‌క్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అదే విధంగా స్మాల్‌క్యాప్, లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనూ చెప్పుకోతగ్గ పెట్టుబడులు కలిగి ఉంటాయి. అదే స్మాల్‌క్యాప్ ఫండ్ అయితే ఎక్కువగా స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు పెట్టుబడులు కేటాయిస్తుంది. అలాగే, మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది. మార్కెట్ విలువ పరంగా టాప్ -100 కంపెనీలను లార్జ్‌క్యాప్‌గా, తదుపరి 150 కంపెనీలను మిడ్‌క్యాప్‌గా, మిగిలిన కంపెనీలను స్మాల్‌క్యాప్ కంపెనీలుగా సెబీ నిర్వచించింది. ఈ నిర్వచనాన్నే పథకాలు కూడా అనుసరిస్తుంటాయి. మార్కెట్ విలువ ఆధారంగా ఒక కంపెనీని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ అని చెప్పడమే. ఒకవేళ అది చిన్న కంపెనీయే అయినప్పటికీ గొప్పది అయి ఉండొచ్చు. చక్కని నిర్వహణతో, ఎంతో వేగంగా వృద్ధి చెందుతున్న వ్యాపారంతో, భరోసానిస్తూ ఉండొచ్చు. ఇలాంటి అంశాలున్న కంపెనీల విషయంలో అది మిడ్ లేదా స్మాల్ క్యాప్ అన్న నిర్వచనం జోలికి వెళ్లక్కర్లేదు. ఉదాహరణకు ఒక మిడ్‌క్యాప్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కొంత కాలానికి నిర్వహణ ఆస్తుల పరంగా అది పెద్ద పథకంగా మారొచ్చు. అప్పుడు అది పేరుకు మిడ్‌క్యాప్ అయినప్పటికీ లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువగా పెట్టుబడులు కలిగి ఉంటుంది. పేరుకు మిడ్‌క్యాప్ కంపెనీలుగా ఉన్నప్పటికీ, పోర్ట్‌ఫోలియోలని చాలా కంపెనీలు భవిష్యత్తులో లార్జ్‌క్యాప్‌గా మారే అవకాశాలు ఉంటాయి.

సంవర్ధన మదర్‌సన్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు



సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 112 **టార్గెట్:** రూ. 141

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్)లో సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ నిర్వహణ లాభం(ఇబిటా) 47 శాతం జంప్‌చేసింది. త్రైమాసికవారీగా సైతం 27 శాతం ఎగసి రూ. 2,370 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్ వార్షికంగా 1.25 శాతం బలపడి 9.2 శాతానికి చేరింది. అర్జెంటీనాలో అధిక ద్రవ్యోల్బణ వాతావరణం కారణంగా తలెత్తిన వన్ టైమ్ వ్యయాలతో ఇబిటా సర్దుబాటుకులోనై 9.5 శాతంగా నమోదైంది. ఇక కన్సాలిడేటెడ్ ఆదాయం 27 శాతం పురోగమించి రూ. 25,690 కోట్లను తాకింది. అధిక ద్రవ్యోల్బణ పరిస్థితుల ప్రభావంతో సర్దుబాటు తదుపరి నికర లాభం 161 శాతం దూసుకెళ్లి రూ. 733 కోట్లకు చేరింది. కంపెనీ చేపట్టిన కొనుగోళ్లలో యషియో, క్రైమా ఎంటర్‌ప్రైజ్, లుమెన్ గ్రూప్, ఏడీఐ గ్రూప్ కీలకమైనవికాగా.. పూర్తిగా సొంతం చేసుకోవలసి ఉంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) నుంచి 1.1-1.2 బిలియన్ డాలర్లస్థాయిలో ఆదాయం సమకూరే వీలుంది. ఎర్రసముద్రంలో ఇటీవల తలెత్తిన ఆందోళనకర పరిస్థితులు కంపెనీ ఉత్పాదకత, ఇదే ప్రాంతంలోని కస్టమర్లపై ఎలాంటి ప్రభావం చూపలేదు. అయితే అర్జెంటీనాలోని అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు మాత్రం తాత్కాలికంగా కార్యకలాపాలు, లాభదాయకతను దెబ్బతీశాయి. గతంలో కొనుగోలు చేసిన ఇతర కంపెనీలను కలుపుకోవడం ద్వారా వచ్చే రెండేళ్ల(2025, 2026)లో కన్సాలిడేటెడ్ ఇబిటా మార్జిన్ 10 శాతంస్థాయిలో నమోదయ్యే వీలుంది. ఇకపై సొంతం చేసుకోనున్న సంస్థల ద్వారా ఆదాయంలో మరో 10 శాతంమేర లబ్ధిని పొందనుంది.

దిలీప్ బిల్డ్‌కాన్ | ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 406 **టార్గెట్:** రూ. 492

ఎందుకంటే: మౌలిక సదుపాయాల దిగ్గజం దిలీప్ బిల్డ్‌కాన్ ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్)లో అంచనాలకు అనుగుణమైన పనితీరును ప్రదర్శించింది. స్టాండెలోన్ నిర్వహణ లాభం(ఇబిటా) నిపుణుల అంచనాలను అందుకోగా.. నికర లాభం అనుకోని(వన్ టైమ్) ఆదాయంతో జంప్‌చేసింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్-జూన్)లో బలహీన ఫలితాలు వెలువరించాక కంపెనీ ఆదాయం వార్షికంగా 7-8% మేర పుంజుకుంది. వెరసి పూర్తిఏడాదికి మొత్తం ఆదాయం 5 శాతం బలపడే వీలుంది. రుణభారం తగ్గుతుండటం సానుకూల అంశంకాగా.. దీర్ఘకాలానికి అసెట్ ఓనర్‌షిప్ బిజినెస్ లక్ష్యంగా సాగుతుండటంతో రుణ పరిస్థితులను గమనించవలసి ఉంటుంది. పీఈ అల్ఫా ఆల్టర్నేటివ్ డీల్ ద్వారా రెండేళ్ల కాలం(2024, 2025)లో ఏడాదికి రూ. 650 కోట్లు చొప్పున పెట్టుబడులను అందుకోనుంది. వెరసి ఈ డీల్ రుణభారం తగ్గించుకునేందుకు కీలక వనరుగా ఉపయోగపడనుంది. ఈ ఏడాది క్యూ3లో ఎలాంటి ఆర్డర్లనూ పొందలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్యూ4(జనవరి-మార్చి)లోనూ కాంట్రాక్టులు లభించకపోవచ్చు. అయితే వచ్చే ఏడాది (2024-25) నుంచి తిరిగి ఆర్డర్‌బుక్ జోరందుకునే అవకాశముంది. కంపెనీకి ఈపీసీ కాంట్రాక్టులు స్వల్పకాలిక బిజినెస్‌కాగా.. దీర్ఘకాలంలో అసెట్ ఓనర్‌షిప్ విభాగం(కోల్ మైనింగ్, హెచ్ఏఎం ప్రాజెక్టులు) కీలకంగా నిలవనుంది. ఇవి 15ఏళ్లపాటు నగదు ఆర్జనకు భరోసా కల్పించనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ధ్యానంతోనే విశ్వశాంతి

ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్
- కన్హాలో ముగిసిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం
- దాజీకి 'గ్లోబల్ అంబాసిడర్ ఆఫ్ పీస్'అవార్డు



దాజీకి అవార్డు అందజేస్తున్న కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్

నందిగామ/శంషాబాద్ (హైదరాబాద్): ప్రపంచ శాంతికి ధ్యానం ఒక్కటే మార్గమని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు. మూడు రోజులుగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్ (దాజీ)కు కామన్‌వెల్త్ ఆధ్వర్యంలో గ్లోబల్ అంబాసిడర్ ఆఫ్ పీస్ అవార్డు రావడం ఆనందకరమన్నారు. కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ మాట్లాడుతూ.. దాజీ 160 దేశాల్లో 16 వేల మంది వలంటీర్లు, 5 వేల కేంద్రాల్లో 5 మిలియన్లకు పైగా అభ్యాసీలను కలిగి ఉండటం ప్రపంచ స్థాయిలోనే గొప్ప విషయమని ప్రశంసించారు. ఆయన సేవలను గుర్తించి 'గ్లోబల్ అంబాసిడర్ ఆఫ్ పీస్' అవార్డు అందజేస్తున్నందుకు సంతోషిస్తున్నామని చెప్పారు. కమ్లేష్ పటేల్ (దాజీ) మాట్లాడుతూ.. తనకు కామన్‌వెల్త్ ఆధ్వర్యంలో అవార్డు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు అధ్యాత్మికవేత్తలు ధ్యానం చేశారు. కార్యక్రమంలో ప్రపంచ మత పెద్దల మండలి సెక్రటరీ జనరల్ భావాజైన్, సైంటిస్ట్ డాక్టర్ రోలీన్ మెక్‌క్రాటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాన్షియెస్ బీయింగ్ వ్యవస్థాపకుడు డాక్టర్ జోసెఫ్ బెంటన్ హోవెల్ పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు

ఆధ్యాత్మిక సమ్మేళనంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి దంపతులు జగదీప్ ధన్‌ఖడ్, సుధేష్ ధన్‌ఖడ్‌లు తమ పర్యటన ముగించుకుని ఆదివారం ఉదయం ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారిద్దరికీ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గవర్నర్ తమిళి సై, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఘనంగా వీడ్కోలు పలికారు.

నాలుగు కాళ్ల కోడిపిల్ల

ఏపీలోని వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని మల్లికార్జునపురంలో నాలుగు కాళ్లతో జన్మించిన ఓ కోడి పిల్ల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రామానికి చెందిన దామోదర్.. తన ఇంట్లో మూడు రోజుల కిందట ఓ కోడి పెట్టిన గుడ్లను పొదిగేశారు. అందులో ఒక కోడి పిల్ల నాలుగు కాళ్లతో పుట్టింది. ఆరోగ్యంగా ఉన్న ఈ కోడి పిల్లను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.

\- పులివెందుల రూరల్



అమ్మో 'రాజధాని' బస్సులు

- విరిగిన సీట్లు.. పనిచేయని ఏసీలు
- పది లక్షల కిలోమీటర్లు తిరిగినా ఇంకా నడుపుతున్న ఆర్టీసీ
- కొత్త బస్సులు కొనేందుకు నిధులేవీ ?





విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రాజధాని బస్సు సీటు ఊడిపోయింది. సీటు రిజర్వు చేసుకున్న ప్రయాణికురాలు ఇలా డ్రైవర్ క్యాబిన్ దగ్గర సింగిల్ సీటుపై కూర్చోవలసి వచ్చింది.

సాక్షి, హైదరాబాద్: రాజధాని బస్సులు ఆర్టీసీ ప్రయాణికులకు చుక్కలు చూపుతున్నాయి. విరిగిన కుర్చీలు, సరిగ్గా పనిచేయని ఏసీ, పరిశుభ్రత అంతంతమాత్రమే కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికుల నుంచి సంపూర్ణ ఆదరణ ఉన్నా, కొత్త బస్సులు కొనేందుకు ఆర్టీసీ వద్ద నిధులు లేకపోవటంతో కావాల్సినన్ని బస్సులను ఆర్టీసీ సమకూర్చుకోలేకపోతోంది. గత సంవత్సరం ఖరారైన టెండర్లకు సంబంధించిన బస్సులు విడతల వారీగా సమకూరుతున్నాయి. కానీ, అది ఆర్టీసీ డిమాండ్‌కు తగ్గట్టుగా లేకపోవటంతో గత్యంతరం లేని పరిస్థితిలో డొక్కు బస్సులను ఆర్టీసీ కొనసాగించాల్సి వస్తోంది. ఇటీవల 750 వరకు కొత్త సూపర్ లగ్జరీ బస్సులు ఆర్టీసీ కొనుగోలు చేసింది. పాత సూపర్ లగ్జరీ బస్సుల్లో కొన్నింటిని వినియోగించుకుంటూ, మిగతా వాటిని ఎక్స్‌ప్రెస్ బస్సులుగా, సిటీ బస్సులుగా అధికారులు మార్చారు. కానీ, రాజధాని కేటగిరీకి మాత్రం కొత్త బస్సులు లేక, పాత వాటినే వినియోగిస్తున్నారు.

డిమాండ్ ఉన్నా..

రాజధాని బస్సులకు బాగా డిమాండ్ ఉంది. గరుడ బస్సుల్లో టికెట్ ధర ఎక్కువగా ఉన్నందున, టికెట్ ధరలు తక్కువగా ఉండే ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. రైలు నెట్‌వర్క్, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అంతగా తిరగని దూర ప్రాంతాల్లో ఈ బస్సులకు మంచి డిమాండ్ ఉంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో అయితే, విజయవాడ లాంటి రైలు కనెక్టివిటీ మెరుగ్గా ఉన్న ప్రాంతాలకు కూడా వీటిల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉంది.

2016లో కొన్న బస్సులే...

ప్రస్తుతం 235 రాజధాని బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. అవన్నీ 2016లో కొన్న బస్సులు. సాధారణంగా ఐదు లక్షల కిలోమీటర్లు తిరగ్గానే బస్సులను మార్చేస్తారు. కానీ, ఇవి 10 లక్షల కి.మీ. తిరిగినా వాటినే వాడాల్సి వస్తోంది. పాతవాటి స్థానంలో కొత్తవి కొనాల్సి ఉన్నా నిధుల లేమితో ఆర్టీసీ సమకూర్చుకోలేకపోయింది. గతేడాది 46 బస్సులకు టెండర్లు పిలిచారు. తాజాగా అవి సమకూరాయి. దీంతో వాటి సంఖ్య 281కి చేరింది. వాస్తవానికి పాత 235 బస్సులను తొలగించి అంతమేర కొత్తవి సమకూర్చుకోవాల్సి ఉంది. నిధులు లేక కొత్తవి కొనలేకపోతున్నారు.

అన్నీ సమస్యలే....

పాత బస్సుల్లో ఏవీ సక్రమంగా ఉండటం లేదు. సీట్లు పాడైనా మరమ్మతు చేయకుండానే ట్రిప్పులకు పంపుతున్నారు. ఆది, సోమవారాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. సీట్లు విరిగినా.. ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ రిజర్వేషన్‌లో ఉంచుతున్నారు. వాటిని బుక్ చేసుకున్నవారు వాటిల్లో కూర్చోలేక నానా తిప్పలు పడుతున్నారు. కొందరు మధ్యలోనే దిగిపోతున్నారు. ఇక వాటిల్లో ఏసీ వ్యవస్థ పాతబడి సరిగ్గా పనిచేయటం లేదు. మధ్యాహ్నం వేళ ఏసీ ప్రభావం అంతగా లేక ప్రయాణికులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరగటంతో ఈ బస్సులెక్కాలంటే జనం ఇబ్బంది పడుతున్నారు. ఈ బస్సుల్లో సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం నిత్యకృత్యమైంది.



రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బి.వెంకటేశం

సైబర్ బాధితులకు లోక్ అదాలత్‌తో సాంత్వన

సైబర్ సెక్యూరిటీస్ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్

సాక్షి, హైదరాబాద్: సైబర్ మోసాల బారిన పడ్డ బాధితులకు లోక్ అదాలత్ ద్వారా నష్టపోయిన డబ్బు వాపసు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సైబర్ సెక్యూరిటీస్ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. తొలిసారిగా ఈ కేసులను జాతీయ లోక్ అదాలత్ పరిగణనలోకి తీసుకుని 546 కేసులను పరిష్కరించినట్టు వివరించారు. బాధితులకు రూ.2.19 కోట్లు తిరిగి చెల్లించినట్లు చెప్పారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ద్వారా నిర్వహిస్తున్న 1930 హెల్ప్‌లైన్ ద్వారా ఆర్థిక మోసాలకు గురైన వారు ఫిర్యాదు చేయాలని, కాల్ సెంటర్ అధికారుల సత్వర జోక్యంతో మోసగాళ్ల బ్యాంక్ ఖాతాలలో బాధితుల డబ్బును స్తంభింపజేయడం లేదా స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ ప్రక్రియలో దేశంలోని మొదటి 5 రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలిచిందన్నారు. ఇందుకోసం టీఎస్‌సీఎస్‌బీ, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకారంతో మార్గదర్శకాలను రూపొందించినట్లు వివరించారు.

ఫెర్టిలైజర్ రవాణా టెండర్లకు మార్క్‌ఫెడ్ నోటిఫికేషన్

రూ.100 కోట్లు ఖర్చు చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఫెర్టిలైజర్ నిర్వహణ, రవాణా టెండర్లకు మార్క్‌ఫెడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024–25 ఆర్థిక ఏడాదికి 20 రేక్ పాయింట్ల కోసం నిల్వ, రవాణా ఒప్పందం కోసం టూ బిడ్ విధానంలో (టెక్నికల్, ధర బిడ్) ఆహ్వానించినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మార్కెట్లో రైతులకు సులభంగా ఎరువులు లభించేలా ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తామన్నారు. అందుకనుగుణంగా రవాణా స్టోరేజీ, హమాలీ మొదలైన వాటికోసం టెండర్లను పిలిచామన్నారు. ఈ–టెండర్ ప్రక్రియకు బిడ్ సమర్పణకు గడువు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. గతంలో ఒక కంపెనీకి కనీసం ఐదు లారీలుండాలన్న నియమాన్ని మూడు లారీలకు తగ్గించామన్నారు. రేక్ పాయింట్లలో ఉండే ఎరువుల విలువలో సగం మేర గ్యారంటీ చూపాలన్నారు. కాగా, ఎరువుల రవాణాకు రూ.100 కోట్లు ఖర్చు చేసే అవకాశముందని సమాచారం.

మైనారిటీ గురుకుల సొసైటీ బోర్డు ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ బోర్డును ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు స్పెషల్ సెక్రటరీ తఫ్‌సీర్ ఇక్బాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బోర్డు చైర్మన్‌గా మైనారిటీ సంక్షేమ మంత్రి వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషిని నియమించారు. సభ్యులుగా మైనారిటీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రటరీ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శి, మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్ లేదా డైరెక్టర్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ సెక్రటరీ, కన్వీనర్‌గా టీఎంఆర్‌ఈఐ సెక్రటరీ, ప్రత్యేక ఆహ్వానితులుగా ఇంటర్ బోర్డు సెక్రటరీ, పాఠశాల విద్య డైరెక్టర్ ఉంటారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.